


VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

Circulated at Visakhapatnam, Hyderabad, Vijayawada, Guntur, Tirupati, Rajahmundry, Kakinada, Kadapa, Nellore, Srikakulam, Vizianagaram, Yanam, Bhubaneswar, Raipur

RNI No.52722/90 సంపుటి : 38 సంచిక : 146 విశాఖపట్నం, 15 మార్చి 2026 ఆదివారం E-mail : vspnews@gmail.com పేజీలు : 8 వెల : రూ.2.00



అభినందనలు అయినా..
సంతాపం అయినా...
వ్యాపార ప్రకటన అయినా...
విషయం ఏదైనా..
అతి తక్కువ ఖర్చుతో
ఎక్కువ మందికి చేరవేసే చక్కటి వేదిక
విశాఖ సమాచారమ్
దినపత్రిక
Contact :
9100986584, 95535 74250


## కాంగ్రెస్ విదేశీ శక్తుల కీలుబొమ్మ: ప్రధాని మోదీ



**సిల్చార్ (అస్సాం):** ప్రపంచ వ్యాప్తంగా యుద్ధ మేఘాలు కమ్ముకున్న ప్రస్తుత తరుణంలో, దేశ ప్రజల్లో అనవసర భయాందోళనలు సృష్టిస్తూ, కాంగ్రెస్ పార్టీ దేశ ప్రయోజనాలను పణంగా పెడుతోందని ప్రధాని నరేంద్ర మోదీ మండిపడ్డారు. అస్సాంలోని సిల్చార్ వేదికగా శనివారం జరిగిన బహిరంగ సభలో పాల్గొన్న ఆయన, కాంగ్రెస్ పార్టీ వైఖరిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. భారతదేశం సాధిస్తున్న వేగవంతమైన వృద్ధిని జీర్ణించుకోలేకపోతున్న కొన్ని అంతర్జాతీయ శక్తుల చేతుల్లో కాంగ్రెస్ పార్టీ ఒక కీలుబొమ్మగా మారుతోందని ప్రధాని ఆరోపించారు. 'ప్రస్తుతం ప్రపంచమంతటా యుద్ధ వాతావరణం నెలకొంది. ఇటువంటి క్లిష్ట సమయంలో దేశ ప్రజలపై ఆ ప్రభావం పడకుండా తమ ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తోంది. అయితే బాధ్యతాయుతమైన రాజకీయ పక్షంగా వ్యవహరించాల్సిన కాంగ్రెస్.. దేశంలో అలజడి సృష్టించేందుకు ప్రయత్నిస్తోంది. దేశం ఇబ్బందుల్లో చిక్కుకోవాలని, తద్వారా మోదీని నిందించవచ్చని వారు ఆశిస్తున్నారు' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రధాని మోదీ శనివారం ఈశాన్య రాష్ట్రాల కనెక్టివిటీని మెరుగుపరిచే పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. సుమారు రూ. 22,860 కోట్ల భారీ వ్యయంతో నిర్మించనున్న 'షిల్లాంగ్-సిల్చార్ కారిడార్'కు భూమిపూజ చేశారు. 166 కిలోమీటర్ల మేర సాగే ఈ గ్రీన్ ఫీల్డ్ ఫోర్-లేన్ హై స్పీడ్ కారిడార్ పూర్తయితే, గౌహతి నుంచి సిల్చార్ మధ్య ప్రయాణ సమయం ప్రస్తుతం ఉన్న 8.5 గంటల నుండి కేవలం 5 గంటలకు తగ్గుతుంది. ఇదేవిధంగా ప్రధాని మోదీ సిల్చార్‌లోని చీఎ-306 పై నిర్మించే ఎలివేటెడ్ కారిడార్‌కు భూమిపూజ చేశారు. అలాగే కరీంగంజ్ జిల్లాలోని పత్తర్‌కండి వద్ద కొత్త వ్యవసాయ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అస్సాంలో వ్యవసాయ విద్య, పరిశోధనలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కళాశాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధాని పేర్కొన్నారు. దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతుంటే, విపక్షాలు కేవలం విమర్శలకే పరిమితమవుతున్నాయని ప్రధిన మోదీ అన్నారు.

## గ్యాస్ సరఫరాపై మంత్రులకు సిఎం చంద్రబాబు దిశానిర్దేశం

**అమరావతి, విశాఖ సమచారమ్, మార్చి 14 :** రాష్ట్రంలో గ్యాస్ సరఫరా విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో గ్యాస్ సరఫరా పరిస్థితిపై శనివారం పలువురు మంత్రులతో సిఎం టెలికాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ప్రస్తుత పరిస్థితిపై మంత్రి పయ్యావుల కేశవ్ ముఖ్యమంత్రికి వివరాలు అందించారు. గ్యాస్ సరఫరా అంశంపై ఏర్పాటైన మంత్రుల సబ్ కమిటీ సమావేశం నేడు జరగనున్నట్లు మంత్రి తెలిపారు. ఇక, రాష్ట్ర ప్రభుత్వ పరంగా అవసరమైన చర్యలను పూర్తిస్థాయిలో తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. గ్యాస్ సరఫరాలో ఎలాంటి అంతరాయం రాకుండా కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని మంత్రులను ఆదేశించారు. అదేవిధంగా హోటళ్లు సహా సంబంధిత భాగస్వామ్య వర్గాలతో చర్చలు జరిపి, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రులకు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.



## జెరూసలేం మీదుగా పేలుళ్లు



**ఇరాన్ :** మరోవైపు ఖార్గ్ ద్వీపం బాంబు దాడి తర్వాత అమెరికా మద్దతు ఉన్న చమురు కేంద్రాలపై దాడులు చేస్తామని ఇరాన్ గట్టి కౌంటరిచ్చింది. 2,500 మంది అమెరికన్ మెరైన్‌లు, నౌకలు గల్ఫ్‌కు పయనమవుతుండగా టెహ్రాన్ 'మరింత విధ్వంసక' క్షిపణులను సిద్ధం చేస్తోంది. ఇరాన్ నుండి వస్తున్న క్షిపణులను గుర్తించామని ఇజ్రాయెల్ సైన్యం హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో శనివారం ఇజ్రాయెల్ రాజదాని నగరం జెరూసలేం మీదుగా భారీ పేలుళ్లు వినిపించాయని AFP నివేదించింది.

ఇది ఇలా ఉంటే యుఎఇ (యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్) వైమానిక రక్షణ దళాలు మార్చి 13న 7 బాలిస్టిక్ క్షిపణులు , 27 యుఎవిలను అడ్డుకున్నాయి. UAE ఈ రోజు 9 క్షిపణులు, 33 డ్రోన్‌లను అడ్డుకుంది. దీంతో వీటి సంఖ్య 285 బాలిస్టిక్ క్షిపణులు, 15 క్రూయిజ్ క్షిపణులు, 1,567 యుఎవిలకు చేరుకున్నాయి. ఇరాక్‌లోని కుర్దిస్తాన్ ప్రాంతంలోని యుఎఇ కాన్సులేట్ జనరల్‌ను లక్ష్యంగా చేసుకుని వారం రోజుల్లో రెండవసారి జరిగిన ఉగ్రవాద డ్రోన్ దాడిని తీవ్రంగా ఖండించింది. ఈ దాడిలో ఇద్దరు భద్రతా సిబ్బంది గాయపడగా, కాన్సులేట్ భవనం దెబ్బతింది. 45 మంది అరెస్ట్ మరోవైపు యుఎఇలో, తప్పుదారి పట్టించే లేదా ఏఐ వీడియోలను ఆన్‌లైన్‌లో పంచుకున్నందుకు 10 మంది నిందితులకు భారీ షాక్ తగలనుంది. వీరిపై ⏭ తరువాయి 2లో..

## గ్యాస్ కష్టాలు పనుల్లేక సొంతూళ్లకు వలస కూలీలు

**తిరువనంతపురం, విశాఖ సమచారమ్, మార్చి 14 :** దేశాన్ని ఎల్పీజీ కొరత అతలాకుతలం చేస్తోంది. వంట గ్యాస్ దొరక్క వందలాది హోటళ్లు, రెస్టారెంట్లు మూతపడటంతో మరో పెను సంక్షోభం తెరపైకి వచ్చింది. ఉపాధి కోల్పోయిన వేలాది మంది వలస కార్మికులు తమ సొంత రాష్ట్రాలకు తిరుగుపయనం అవుతున్నారు. కేరళలోని హోటల్ రంగం ప్రధానంగా పశ్చిమ బెంగాల్, అస్సాం రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కూలీలపైనే ఆధారపడి నడుస్తోంది.

ప్రస్తుతం ఆయా రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటం, మరోవైపు రంజాన్ పండుగ దగ్గరపడుతుండటంతో వీరంతా ముందస్తుగానే ఇళ్లకు తరలి వెళుతున్నారు. సాధారణంగా ఎన్నికల సమయానికి వారం ముందు వెళ్లే వీరు, ఇప్పుడు గ్యాస్ కొరత వల్ల హోటళ్లు మూతపడటంతో పనులు లేక ముందుగానే సొంతూళ్లకు తరలివెళ్లిపోతున్నారు. 'ఎల్పీజీ సంక్షోభం మధ్య చిన్న తరహా హోటల్ యజమానులు తమ సిబ్బందిని కాపాడుకోలేకపోతున్నారు. ఒక్కసారి వీరు తమ గ్రామాలకు వెళ్తే మళ్లీ రెండు మూడు నెలల వరకు తిరిగి రారు. ఇది కేరళలోని అన్ని రంగాలపై ప్రభావం చూపుతుంది' అని కేరళ హోటల్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి. జయపాల్ ఆవేదన వ్యక్తం చేశారు.

కేరళలోని వలస కార్మికులలో సుమారు 50 శాతం మంది ఎన్నికలు జరగబోయే బెంగాల్, అస్సాం ప్రాంతాల వారేనని గణాంకాలు చెబుతున్నాయి. కొందరు యజమానులు గ్యాస్‌కు బదులు ఇతర ఇంధనాలను వాడుతూ పనివారిని ఆపే ప్రయత్నం చేస్తున్నా, పరిస్థితులు ఆశాజనకంగా లేవు. తిరువనంతపురంలోని ప్రముఖ మాల్స్‌కు సిబ్బందిని సరఫరా చేసే ఏజెన్సీల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ⏭ తరువాయి 2లో..

## అదను చూసి చార్జీలు బాదుడు

**చెన్నై/బెంగళూరు:** దేశవ్యాప్తంగా నానాటికీ తీవ్రతరమవుతున్న వాణిజ్య సిలిండర్ల కొరత పలు గమ్మత్తైన పరిణామాలకు కూడా దారి తీస్తోంది. వాణిజ్య సిలిండర్ల కొరత తీవ్రంగా ఉన్న బెంగళూరు, చెన్నై వంటి పలు నగరాల్లో బ్లాక్ మార్కెటింగ్ జోరుగా సాగుతోంది. దాంతో పలు హోటళ్లు ఆ భారాన్ని వినియోగదారులపై మోపే ప్రయత్నం చేస్తున్నాయి. 'గ్యాస్ చార్జీ' పేరిట కస్టమర్ల నుంచి బిల్లులో అదనంగా వసూలు చేసేస్తున్నాయి! అలా చెన్నైలోని ఒక హోటల్ ఇచ్చిన బిల్లు ఇప్పుడు వైరల్‌గా మారింది.



**ఇదీ చదవండి: మండిస్తున్న ఎండలు, పైకప్పు చల్లగా ఇలా..!**

బెంగళూరులో కూడా ఒక హోటల్ తన కస్టమర్ నుంచి గ్యాస్ బిల్లు రూపంలో ఏకంగా 30 రూపాయలు వసూలు చేసింది. దాంతో చిర్రెత్తుకొచ్చిన కస్టమర్ ఆ బిల్లును సోషల్ మీడియాలో షేర్ చేశాడు. నగర పోలీస్ కమిషనర్‌ను కూడా ట్యాగ్ చేస్తూ, ఈ వసూళ్ల దందాను కట్టడి చేయాల్సిందిగా కోరాడు. బెంగళూరు హోటళ్ల సంఘం అధ్యక్షుడు పి.సి.రావు దీనిపై వెంటనే స్పందించారు.




సదరు హోటల్ యాజమాన్యంతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. బెంగళూరు తదితర నగరాల్లో సిలిండర్ల చోరీలు కూడా పెరిగిపోతున్నాయి. ఇందుకు సంబంధించిన వీడియోలు ఆన్‌లైన్‌లో హల్‌చల్ చేస్తున్నాయి.

## ఏపీలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయి: లక్ష్మీపార్వతి



**తాడేపల్లి, విశాఖ సమచారమ్, మార్చి 14 :** ఆంధ్రప్రదేశ్‌లో మహిళలపై జరుగుతున్న దారుణాలపై వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి లక్ష్మీపార్వతి మండిపడ్డారు. తాడేపల్లిలో లక్ష్మీపార్వతి మీడియా సమావేశంలో మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చాక మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయని చెప్పారు. మహిళలపై ఎమ్మెల్యేలే అత్యాచారాలు చేస్తున్నారని ఆమె అన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎలాంటి వ్యక్తిని టీటీడీ ఛైర్మన్‌గా నియమించారో అందరికీ తెలుసని లక్ష్మీపార్వతి విమర్శించారు. వైఎస్సార్‌సీపీ హయాంలోనే మహిళలకు న్యాయం జరిగిందని ఆమె అన్నారు. చంద్రబాబు నాయుడు సిగ్గుమాలిన నాయకుడని ఆమె మండిపడ్డారు. 'రాష్ట్రం అత్యాచారాల ఆంధ్రప్రదేశ్‌గా మారిపోయింది. కొందరు ఎమ్మెల్యేలు కూడా మహిళలపై దారుణాలకు పాల్పడటం సిగ్గుచేటు. పాపాలను పంచుకోవటంలో జనసేన కూడా భాగం పంచుకుంటోంది. పోలీసులను పనికిమాలిన వారిగా మార్చేశారు. కిరణ్ రాయల్, అరవ శ్రీధర్, కోనేటి ఆదిమూలం, నసీర్ అహ్మద్, కూన రవికుమార్.. ఇలా చెప్పుకుంటే ఎంతోమంది మహిళలను వేధించారు.

దేవుడే లేడన్న చంద్రబాబు సీఎం అయ్యారు. పూజ దీపం దగ్గర సిగరెట్ ముట్టిస్తాడంటూ తన తండ్రి గురించి చెప్పిన పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎం అయ్యారు. ఇలాంటి వారి చేతిలో రాష్ట్రం అధోగతి పాలవుతోంది. మహిళలకు అన్యాయం చేసిన వారు ఏమయ్యారో చరిత్ర చూస్తే తెలుస్తుంది. చంద్రబాబు మహిళలను అడ్డం పెట్టుకుని నీచ రాజకీయాలు చేస్తున్నారు. ఇప్పుడు మేకతోలు కప్పుకుని స్తోత్రాలు మాట్లాడవద్దు.

టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడి వీడియోలు బయటకు వస్తే ఏం చర్యలు తీసుకున్నారు. ఒక మహిళ స్వయంగా లేఖ రాసినా చంద్రబాబు ఎందుకు పట్టించుకోలేదు. దేవునితో కూడా ఆటలు ఆడుకోవటం సరికాదు. జగన్ హయాంలో దిశ యాప్, దిశా పీఎస్ లు ఏర్పాటు చేసి మహిళలకు రక్షణ కల్పించారు. ఇలాంటి మేలు చేయటం చంద్రబాబు చరిత్రలో లేదు. ప్రజలు ఎంత అసహ్యించుకుంటున్నారో బయటకు వస్తే తెలుస్తుంది. ఆడపిల్లలను స్కూల్‌కి పంపాలన్నా కూడా ఇప్పుడు పేరెంట్స్ భయపడుతున్నారు.

## ఇండియన్ బ్యాంక్ మెగా క్రెడిట్ అవుట్‌రీచ్ క్యాంపెయిన్



**భవానీపురం(విజయవాడ పశ్చిమ), విశాఖ సమచారమ్, మార్చి 14 :** ఇండియన్ బ్యాంక్ విజయవాడ జోన్ ఆధ్వర్యాన మెగా క్రెడిట్ అవుట్‌రీచ్ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా బ్యాంక్ జోనల్ మేనేజర్ ఎం.రాజేష్, డిప్యూటీ జోనల్ మేనేజర్ ఎం.శేషగిరిరావు లబ్ధిదారులకు రూ.260 కోట్ల విలువైన రుణాల మంజూరు పత్రాలను అందజేశారు.

అదేవిధంగా ఫీల్డ్ జనరల్ మేనేజర్ ప్రవీణ్ కుమార్ పలువురు లబ్ధిదారులకు రూ.1,422 కోట్ల రుణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా వ్యాపారాలు, వ్యవసాయం ఇతర రంగాలకు చెందిన లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందించి వారి అభివృద్ధికి తోడ్పడుతున్నట్లు పేర్కొన్నారు. కాగా ఇండియన్ బ్యాంక్ హైదరాబాద్ జీఎంఓ పరిధిలో ఉన్న ఎనిమిది జోన్లలో ఈ మెగా క్రెడిట్ అవుట్‌రీచ్ క్యాంపెయిన్ నిర్వహించినట్లు తెలిపారు.

## ఒకే అంబులెన్స్.. డజను మంది రోగులు!

**డుంబ్రిగుడ (అల్లూరి సీతారామరాజు జిల్లా), విశాఖ సమచారమ్, మార్చి 14 :** అల్లూరి సీతారామరాజు జిల్లాలో గిరిపుత్రులకు వైద్యం దైవాదీనంగా మారింది. జిల్లా కేంద్రమైన పాడేరు ఆస్పత్రిలో సైతం సరిపడా అంబులెన్స్‌లు లేవు. దీనికి ప్రత్యక్ష నిదర్శనం శుక్రవారం పాడేరు జిల్లా ఆస్పత్రి నుంచి ఒకే అంబులెన్స్‌లో 12 మంది రోగులను విశాఖ కేజీహెచ్‌కు తరలించడమే. గర్భిణులు ఉన్న అంబులెన్స్‌లో కనీసం నర్సు లేరని.. మార్గమధ్యంలో ప్రసవం జరిగితే పరిస్థితి ఏంటని ప్రశ్నించారు.



డుంబ్రిగుడ మండలం గసబ పంచాయతీ గసబ గ్రామానికి చెందిన పాంగి చిన్ని ప్రసవం నిమిత్తం అరకువేలీ సీహెచ్‌సీలో మూడు రోజుల కిందట చేరింది. అక్కడి నుంచి పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించగా.. సరిపడా రక్తం లేదని కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. ఆమెతో పాటు ఒకే అంబులెన్సులో 12 మందిని తరలించడం.. ఏజెన్సీలో ప్రజల కష్టాలకు అద్దంపడుతోంది.

# తండ్రీకొడుకు.. ఒక ఆర్టీసీ బస్సు!



**సిద్ధిపేట జిల్లా, విశాఖ సమాచారమ్, మార్చి 14 :**

ఒకే బస్సులో తండ్రీకొడుకు విధులు నిర్వహించారు. ఈ ఆసక్తికరమైన ఘటన శుక్రవారం సిద్దిపేట జిల్లా హుస్నా బాద్ బస్టాండ్‌లో చోటు చేసుకుంది. హుస్నాబాద్‌కు చెందిన బంధనాపురం ఎల్లయ్య 34 ఏళ్లుగా ఆర్టీసీ డ్రైవర్‌గా సేవలు అందిస్తున్నాడు. ఆయన కుమారుడు బంధనాపురం ప్రేమ్ కండక్టర్‌గా పని చేస్తున్నాడు.

ఈ క్రమంలో తండ్రీకొడుకు ఇద్దరూ ఒక్కటే బస్సులో డ్యూటీ చేయడం ప్రయాణికులు ఆసక్తిగా గమనించారు. ఎల్లయ్య ఆర్టీసీ డ్రైవర్‌గా సేవలు అందిస్తూ ఉత్తమ డ్రైవర్‌గా పలుసార్లు అవార్డులు అందుకున్నాడు. ప్రమాదరహిత డ్రైవర్‌గా సేవలు కొనసాగిస్తున్నాడు. ప్రస్తుతం కుమారుడితో కలిసి ఒకే బస్సులో విధులు నిర్వహించడంపై తండ్రి ఎల్లయ్య సంతోషం వ్యక్తం చేశాడు.

# మంత్రి భరత్ అనుచరుల అరాచకం



**కర్నూలు, విశాఖ సమాచారమ్, మార్చి 14 :**

మంత్రి టీజీ భరత్ అనుచరుల అరాచకాలు కర్నూలులో శృతిమించాయి. మద్యం మత్తులో మహిళా పోలీసు అధికారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడమే కాక అడ్డొచ్చిన ఆర్ఎస్ఐపై తిరగబడి వీరంగం సృష్టించిన ఘటన వెలుగుచూసింది. మంత్రి టీజీ భరత్ ముఖ్య అనుచరులు భీమిశెట్టి మనోజ్ కుమార్, వంశీ, సాయి ఈ నెల 11న రాత్రి టానిక్ వైన్స్‌లో బీర్లు కొని.. అక్కడి ఐదు రోడ్ల కూడలిలో రోడ్డుపైనే తాగి బాటిళ్లను పగలగొడుతుండగా అదే దారిలో స్కూటీపై వెళ్తున్న మహిళా ఎస్ఐ వారించారు. దీంతో వారు ఆమెపై దురుసుగా ప్రవర్తించారు.

మద్యం మత్తులో ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండగా అదే సమయంలో ఆర్ఎస్ఐ రమేష్ విధి నిర్వహణలో భాగంగా అక్కడికి చేరుకున్నారు. విషయం తెలుసుకుని ఆర్ఎస్ఐ వారిని దండించడంతో ఆయనపై తిరగబడి దాడి చేసేందుకు ప్రయత్నించారు. దీంతో ఘర్షణ వాతావరణం తలెత్తడంతో ఆర్ఎస్ఐ వెంటనే క్యూఆర్‌టీ, బ్లూ కోల్ట్స్ సిబ్బందికి సమాచారమిచ్చారు. వారు అక్కడికి చేరుకుని మద్యం మత్తులో ఉన్న మంత్రి అనుచరులు ముగ్గురునీ అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి తమదైన పద్ధతిలో ట్రీట్‌మెంట్ ఇచ్చారు. అయితే ఈ విషయం బయటకు పొక్కకుండా పోలీసులు గోప్యంగా ఉంచారు.

**ఇందులో ఒకరు ఎంఎస్ఎంఈ స్టేట్ డైరెక్టర్**

మద్యం మత్తులో మహిళా ఎస్ఐ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన మంత్రి అనుచరుడు భీమిశెట్టి మనోజ్ కుమార్ మైక్రో స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ) స్టేట్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఇతను గతంలో టీడీపీ తరపున 44వ వార్డు కార్పొరేటర్‌గా పోటీ చేసి ఓడిపోయారు. ప్రస్తుతం మంత్రి అండతో రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకే కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలించి వ్యాపారం చేస్తున్నాడు. ఉద్యోగులకు పోస్టింగులు, బదిలీల పేరుతో డబ్బులు తీసుకుని మోసం చేస్తున్నట్లు మనోజ్‌పై మంత్రికి గతంలో ఫిర్యాదులు కూడా అందాయి.

నాలుగు నెలల క్రితం ఓ మహిళా అధికారికి కర్నూలు డీఎంహెచ్‌వో పోస్టింగ్ ఇప్పిస్తానని చెప్పి రూ.6 లక్షలు తీసుకుని మోసం చేసినట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ఇతనితోపాటు మద్యం మత్తులో వీరంగం సృష్టించిన మరొకరు వైన్ షాపు నిర్వాహకులు, సాయి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ముగ్గురు కూడా మంత్రికి అత్యంత సన్నిహితులు కావడంతో కనీసం కేసు కూడా నమోదు చేయకుండా వదిలేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

# జెరూసలేం మీదుగా పేలుళ్లు

(మొదటి పేజీ తరువాయి)

విచారణను వేగవంతం చేశారు. సంఘటనాస్థలాలను చిత్రీకరించడం, లేదా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసినందుకు 45 మందిని అబుదాబి అధికారులు అరెస్టు చేశారు. ఇది తప్పుడు సమాచారాన్ని అరికట్టడానికి, జాతీయ భద్రతను రక్షించడానికి కొనసాగుతున్న ప్రయత్నాలలో భాగమని అక్కడి అధికారులు తెలిపారు. కాగా ఫిబ్రవరి 28న మొదలైన యుద్ధం మధ్యప్రాచ్య వివాదం మూడవ వారంలోకి ప్రవేశించింది. దాదాపు 43,000 నివాస, వాణిజ్య యూనిట్లు దెబ్బతిన్నాయని ఇరాన్ ప్రభుత్వ ప్రతినిధి ఫతేమెహ్ మొహజెరానీ వెల్లడించారు. ప్రభుత్వ నిర్వహణలోని IRNA వార్తా సంస్థ ప్రకారం, దెబ్బతిన్న నిర్మాణాలలో 36,469 నివాసాలు, 6,179 వాణిజ్య సౌకర్యాలు ఉన్నాయి.. అమెరికా- ఇజ్రాయెల్ దాడుల్లో మహిళలు తీవ్రంగా నష్టపోయారని, 223 మంది మహిళలు , బాలికలు మరణించారని మరియు 2,129 మంది గాయపడ్డారని మొహజెరానీ చెప్పారు. ఆమె మొత్తం మరణాల సంఖ్యను ప్రకటించలేదు కానీ గతంలో అధికారులు 1,230 మంది మరణించారని చెప్పారు. సైనిక నష్టం గురించి ఇరాన్ ఎటువంటి సమాచారం అందించలేదు.

**మిస్సైల్స్‌ను, డ్రోన్స్‌ను అడ్డుకుంటున్న యుఎఇ**

US-Israel War on Iran day 15: భీకర దాడులతో ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం 15 రోజు కూడా తీవ్రంగా కొనసాగుతోంది. ప్రధానంగా ఇరాన్‌లోని కీలకమైన ఖార్గ్ ద్వీపంపై అమెరికా దళాలు (CENTCOM) అత్యంత శక్తివంతమైన వైమానిక దాడులు నిర్వహించాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు.

# ఏకంగా 10 బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిన కిమ్




**నార్త్ కొరియా :** ప్రపంచవ్యాప్తంగా యుద్ధ ఉద్రిక్తతలు నెలకొన్న తరుణంలో నార్త్ కొరియా ప్రయోగం కొత్త టెన్షన్‌కు దారితీసింది. జపాన్ సముద్ర జలాల్లోకి నార్త్ కొరియా బాలిస్టిక్ క్షిపణులు ప్రయోగించింది. తమ దేశ సముద్ర జలాల్లోకి ఏకంగా 10 బాలిస్టిక్ క్షిపణులను ఉత్తర కొరియా ప్రయోగించినట్లు జపాన్ ప్రకటించింది. ఇప్పటికే ఉద్రిక్త వాతావరణం నెలకొన్న తరుణంలో ఈ ప్రయోగాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి.

అయితే ఈ క్షిపణి ప్రయోగ తర్వాత జపాన్ తమ పౌరులను అప్రమత్తం చేసింది. జపాన్ ప్రధాని మంత్రి కార్యాలయం ఎక్స్‌లో ఒక అధికారిక పోస్ట్‌ను ప్రచురించింది. 'నార్త్ కొరియా జపాన్ జలాల్లోకి అనుమానిత బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించింది. దీనిపై మరింత సమాచారం అందిస్తాం' అని పోస్ట్‌లో తెలిపింది.

అయితే క్షిపణి ప్రయోగంపై పూర్తిపూర్తి స్థాయిలో విశ్లేషణ జరిపిన అనంతరం ఆ క్షిపణులు జపాన్ ఎక్స్‌క్లూజివ్ ఎకనామిక్ జలాల అవతల పడ్డాయని అధికారులు తెలిపారు. అయితే ప్రస్తుతం దక్షిణ కొరియా, అమెరికా సంయుక్త సైనిక విన్యాసాలు జరుపుతున్నాయి ఈ నేపథ్యంలో ఈ మిసైల్స్ ప్రయోగం ఆందోళన కలిగిస్తోంది.

# మాతో పెట్టుకుంటే అంతే.. ఇరాన్ మంత్రి




**టెహ్రాన్:** ఇరాన్ విదేశాంగశాఖ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో రెండు వారాల యుద్ధానికే అమెరికా పనైపోయిందని తెలిపారు. వాషింగ్టన్ ఇప్పుడు భారత్‌తో పాటు అనేక దేశాలను రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేయాలని అడుక్కుంటుందని ఆరోపించారు.

పశ్చిమాసియా యుద్ధంతో ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం ఏర్పడింది. హార్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడం చమురు వాణిజ్యానికి ఆటంకం తలెత్తింది. అంతేకాకుండా గల్ఫ్ దేశాల్లోని ఆయిల్ స్థావరాలపై దాడులు చేయడంతో క్రూడాయిల్ ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. అయితే ఈ నేపథ్యంలోనే ట్రంప్ గతంలో విధించిన ఆంక్షలు సడలించారు. ప్రపంచ దేశాలు తాత్కాలికంగా రష్యా నుంచి చమురు కొనుగోలు చేయాలని తెలిపారు. అయితే దీనిపై ఇరాన్ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ కౌంటరిచ్చారు,

ఆయన మాట్లాడుతూ " గత కొద్ది నెలలుగా అమెరికా, రష్యా నుంచి చమురు కొనుగోలు చేయద్దంటూ ఆంక్షలు విధించింది. ఇరాన్‌తో 15 రోజులు యుద్ధం చేయగానే పరిస్థితులు మారిపోయాయి. ఇప్పుడు భారత్‌తో సహా ఇతర దేశాలని రష్యా నుంచి చమురు కొనుగోలు చేయాలని యాచిస్తుంది. యూరప్ సైతం ఈ అక్రమ యుద్ధంలో మద్దతు ఇవ్వడం ద్వారా రష్యాకు వ్యతిరేకంగా యుఎస్ సపోర్టు లభిస్తోందని భావిస్తోంది" అని అన్నారు. వారి పరిస్థితి ఇప్పుడు దయనీయంగా ఉందని తెలిపారు.

కాగా ఇంతకాలం రష్యాతో చమురు కొనుగోలు ఇతర దేశాలను అమెరికా తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. మాస్కో నుంచి పన్ను కొనుగోలు చేసిన వారిపై అధిక పన్నులు విధించింది. ఈ నేపథ్యంలో భారత్‌పైన తొలుత పన్నులు పెంచి అనంతరం రష్యా నుంచి చమురు కొనుగోలు ఆపేశారని ప్రకటించింది. అయితే ఇటీవలే రష్యా నుంచి తాత్కాలికంగా భారత్ చమురు కొనుగోలు చేయవచ్చని ఆదేశించినట్లు తెలిపింది. కాగా దీనిపైఇరాన్ విదేశాంగమంత్రి స్పందించారు.

కాగా ప్రస్తుతం ఇరాన్ భారత్ విషయంలో సానూకులంగా ఉంది. ఇటీవలే భారత విదేశాంగ మంత్రి జైశంకర్ ఇరాన్ విదేశాంగశాఖ మంత్రితో చర్చలు జరిపారు.ఈ నేపథ్యంలో భారత్ వెళ్లే చమురు నౌకలకు ఇరాన్ అనుమతి తెలిపింది. ఇటీవల భారత్ పతాకంతో ఉన్న రెండు నౌకలు హార్ముజ్ గుండా ఇండియాకు చేరుకున్నాయి.

# ఇరాన్‌తో యుద్ధం.. అమెరికా మరో వ్యూహం!




**అమెరికా :** ఇరాన్‌తో యుద్ధం మొదలై దాదాపు రెండు వారాలు గడుస్తున్న నేపథ్యంలో అమెరికా తన సైనిక బలగాలను భారీగా పెంచింది. ఇరాన్‌పై పట్టు సాధించేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. మిడిల్ ఈస్ట్‌కు అమెరికా మెరైన్ కమాండోలను తరలించింది. సముద్ర మార్గంలో మెరైన్ దళాలను మోహరించింది. యూఎస్ఎస్ ట్రిపోలి యుద్ధనౌకలో 2500 మెరైన్ కమాండోలతో పాటు 20 యుద్ధ విమానాలు, ఫైటర్ జెట్లు మధ్యప్రాచ్యానికి పంపినట్లు ఓ అమెరికా అధికారి తెలిపారు.

మరోవైపు, పశ్చిమాసియాలో యుద్ధం తీవ్రస్థాయిలో కొనసాగుతూనే ఉంది. ఇరాన్ రాజధాని టెహ్రాన్ నిన్న (శుక్రవారం) భారీ పేలుళ్లతో దద్దరిల్లిపోయింది. నగరం నడిరొడ్డున అత్యంత శక్తిమంతమైన పేలుళ్లు సంభవించాయి. ప్రఖ్యాత ఫిరదౌసీ స్క్వేర్ వద్ద ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగిన ఖుద్స్ డే ప్రదర్శనల్లో ప్రజలు వేలాదిగా పాల్గొని ఉండగా ఈ ఉదంతం జరిగినట్టు ప్రభుత్వ టెలివిజన్ పేర్కొంది. పేలుడు కారణమేమిటో తెలియకపోయినా ఆ ప్రాంతంపై దాడి చేస్తామని శుక్రవారం ఉదయమే ఇజ్రాయెల్ సైన్యం హెచ్చరించింది. అంతేగాక ఫిరదౌసీ స్క్వేర్ వద్ద ర్యాలీలు మొదలయ్యేందుకు కాసేపటి ముందే టెహ్రాన్‌పై ఇజ్రాయెల్-అమెరికా భారీ స్థాయి వైమానిక దాడులకు దిగాయి.

ఇదిలా ఉండగా.. ఇరాన్.. ఇజ్రాయెల్, పొరుగున ఉన్న గల్ఫ్ దేశాలపై ఇరాన్ క్షిపణులు, డ్రోన్లతో విస్తృత దాడులను కొనసాగిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా వ్యాపారం జరిగే చమురులో ఐదో వంతు ప్రయాణించే హోర్ముజ్ జలసంధిని (స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్) ఇరాన్ దాదాపుగా మూసివేసింది. అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు ఇరాన్‌లోని సైనిక స్థావరాలు, ఇతర లక్ష్యాలపై విరుచుకుపడుతున్నాయి. ఇరాన్ మద్దతు ఉన్న హిజ్బుల్లా మిలిటెంట్లను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ జరిపిన దాడుల వల్ల లెబనాన్‌లో సంక్షోభం మరింత ముదిరింది. ఇప్పటివరకు దాదాపు 800 మంది మరణించగా.. 8.5 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. దాడులు ఆపే ప్రసక్తే లేదని ఇజ్రాయెల్ హెచ్చరించింది.

# పలాసలో కిడ్నీ మార్పిడి విజయవంతం

**కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌లో తొలిసారి కిడ్నీ మార్పిడి**

**ఆపరేషన్ తండ్రి, కుమార్తె క్షేమం**

**వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రీసెర్చ్ సెంటర్, ఆస్పత్రి నిర్మాణం**



**పలాస:** శ్రీకాకుళం జిల్లా పలాసలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్మించిన కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌లో తొలిసారి కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా జరిగింది. పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో శుక్రవారం సోంపేటకు చెందిన సీహెచ్ హేమశ్రీకి కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స చేశారు. ఆమె తండ్రి మోహనరావు కిడ్నీ దానం చేశారు. విజయవంతంగా కిడ్నీ మార్పిడి చేసిన అనంతరం ఆస్పత్రి వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కేజీహెచ్ నెఫ్రాలజిస్టు డాక్టర్ రవిరాజు మాట్లాడుతూ పలాస వంటి మారుమూల చిన్నపట్టణంలో మెడికల్ కళాశాల లేనిచోట కిడ్నీ మార్పిడి చేయడం ఇదే మొదటిసారి అని చెప్పారు.

ఉద్దానం ప్రాంతంలో చాలా ఏళ్ల నుంచి ఎక్కువగా కిడ్నీ వ్యాధులు ఉన్నాయని చెప్పారు. కిడ్నీ మార్పిడిని 15 ఏళ్ల కిందట కేజీహెచ్‌లో తానే ప్రారంభించినట్లు తెలిపారు. కర్నూలు, గుంటూరు వంటి నగరాల్లోని ఆస్పత్రుల్లో ఈ సదుపాయాలున్నాయని చెప్పారు. పలాసలో కిడ్నీ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేసి, ఆస్పత్రి నిర్మించడంతో ఈ ప్రాంత ప్రజలకు ఈ సదుపాయాలు కలుగుతున్నాయన్నారు. రెండు కిడ్నీలు పాడైపోయిన హేమశ్రీకి ఆమె తండ్రి కిడ్నీ ఇచ్చారని చెప్పారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రారంభించిన ఆపరేషన్ మధ్యాహ్నం 3 గంటలకు పూర్తయిందన్నారు. మార్పిడి తర్వాత కిడ్నీ ఫంక్షనింగ్ బాగానే ఉందని చెప్పారు. ఎన?టఆర్ వైద్యసేవ, ఆస్పత్రి నిధుల నుంచి ఈ ఆపరేషన్ చేసినట్లు తెలిపారు. కిమ్స్, జెమ్స్ ఆస్పత్రుల నుంచి వచ్చిన డాక్టర్లు ఉమామహేశ్వరరావు, పూర్ణచంద్ర, వివేకానంద, అశోక్‌వర్ధన్, జోగినాయుడు, స్థానిక వైద్యులు రాకేబ, జ్యోత్స్న, ఆస్పత్రి సూపరింటెండెంట్ జె.కిశోర్, వైద్యసిబ్బంది పాల్గొన్నారని చెప్పారు.

**ఆస్పత్రి కట్టించినవారికి అభినందనలు**

నెఫ్రాలజిస్టు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఇంత మారుమూల ప్రాంతంలో ఇంత చక్కటి ఆస్పత్రి నిర్మించిన వారిని, అన్ని సదుపాయాలు కల్పించినవారిని ముందుగా అభినందించాలన్నారు. ఇలాంటి మారుమూల ప్రాంతంలో అదీ ప్రభుత్వ ఆస్పత్రిలో కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేయడం ఇదే మొదటిసారని చెప్పారు.

వైఎస్ జగన్ హయాంలో ఆస్పత్రి నిర్మించి, ప్రారంభించారు . టీడీపీ ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ వైఎస్ జగన్ హయాంలో ఈ ఆస్పత్రి నిర్మించి ప్రారంభించారని చెప్పారు. మరిన్ని కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలకు ఈ ఆపరేషన్ పునాది అవుతుందని ఆమె పేర్కొన్నారు.

# గ్యాస్ కష్టాలు: పనుల్లేక సొంతూళ్లకు వలస కూలీలు

(మొదటి పేజీ తరువాయి)

గతంలో 25 మంది పనిచేసే చోట ఇప్పుడు కేవలం ఐదుగురు మాత్రమే మిగిలారు. ప్రస్తుతానికి స్థానిక మహిళలతో పనులు కానిస్తున్నా, వలస కూలీలు లేని లోటు స్పష్టంగా కనిపిస్తోంది. గ్యాస్ సమస్య త్వరగా పరిష్కారం అయితేనే కేరళ ఆతిథ్య రంగం తిరిగి కోలుకునే అవకాశం ఉంది.

# గ్యాస్ కొరత వేళ హోటళ్లు, టీ స్టాళ్లు మూత పడకుండా



**చెన్నై:** పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా భారత్‌లో గ్యాస్ కొరత నెలకొనడంతో హోటళ్లు, రెస్టారెంట్లు, టీ స్టాళ్లు, హాస్టళ్ల వంటి వాటిని నడపలేని పరిస్థితి వస్తోంది. దీంతో తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎల్పీజీలను వాడకుండా విద్యుత్ స్టౌలను వాడుకోవాలని.. ఇలా చేసే హోటళ్లు, టీ స్టాళ్ల వంటివాటికి విద్యుత్ బిల్లులో యూనిట్‌కు రూ.2 చొప్పున సబ్సిడీ ఇస్తామని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు.

తమిళనాడులో ఏర్పడిన ఎల్పీజీ కొరత వల్ల పరిశ్రమలు, ఫుడ్ సెక్టార్ సహా అనేక రంగాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చర్చించేందుకు శనివారం తమిళనాడు సచివాలయంలో స్టాలిన్ నేతృత్వంలో సమీక్షా సమావేశం జరిగింది. హోటళ??ల వంటివాటిలో కార్యకలాపాలు సజావుగా కొనసాగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో చర్చ జరిగింది.

ఈ సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన తమిళనాడు విద్యుత్ ఉత్పత్తి పంపిణీ సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ జె.రాధాకృష్ణన్ వివరాలు తెలిపారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన ఉన్నతాధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో తమిళనాడు ప్రభుత్వం అనేక నిర్ణయాలు తీసుకుందని చెప్పారు.

గ్యాస్ కొరత సమయంలో ఎల్పీజీలు వాడకుండా విద్యుత్ స్టౌలను వాడడం ప్రారంభించే హోటళ్లు, రెస్టారెంట్లు, టీ దుకాణాలు, క్లౌడ్ కిచెన్‌లు, ఇతర ఆహార తయారీ యూనిట్లు.. అదనంగా వినియోగించే విద్యుత్‌కు యూనిట్‌కు రూ.2 చొప్పున సబ్సిడీ ఇస్తాం. కేంద్ర ప్రభుత్వం వాణిజ్య ఎల్పీజీ వినియోగంపై విధించిన పరిమితులు అమల్లో ఉన్నంత కాలం ఈ సబ్సిడీ కొనసాగుతుంది' అని ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న ఎల్పీజీ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు తమిళనాడులో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలతో విద్యుత్ పరికరాలు కొనుగోలు చేయించేందుకు సబ్సిడీతో రుణాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశించారు. అర్హత ఉన్న వ్యాపారులు రూ.3.75 లక్షల వరకు రుణాలకు 25 శాతం సబ్సిడీ పొందవచ్చు. మహిళా వ్యాపార అభివృద్ధి పథకం కింద మహిళలు నడిపే వ్యాపారాలకు రూ.10 లక్షల వరకు రుణంపై గరిష్ఠంగా రూ.2 లక్షలపై 25 శాతం సబ్సిడీ ఇస్తారు.

అదనంగా ఎస??సీ, ఎస్టీ వ్యాపారులను ప్రోత్సహించేందుకు అన్నై అంబేద్కర్ బిజినెస్ ఛాంపియన్స్ పథకం కింద గరిష్ఠంగా రూ.కోటి వరకు 35 శాతం మూలధన సబ్సిడీ ఇస్తారు. అధిక సామర్థ్య విద్యుత్ యంత్రాల వినియోగాన్ని ప్రోత్సహించడమే లక్ష్యం. తమిళనాడులో తమిళనాడు కాలుష్య నియంత్రణ మండలి అనుమతితో 60,698 కర్మాగారాలు ఎల్పీజీ, సీఎన్జీ, డీజిల్, ఫర్నేస్ ఆయిల్, కట్టెలు వంటి వాటిని ఉపయోగిస్తూ పనిచేస్తున్నాయి.

# ఆ దర్శకుడి ఫెయిల్యూర్‌ను ఇండస్ట్రీ కోరుకుంటోంది: రామ్ గోపాల్ వర్మ



ఇండస్ట్రీలో సంచలనం సృష్టించిన చిత్రం 'ధురంధర్'. ఈ చిత్ర దర్శకుడు ఆదిత్యధర్‌పై రామ్‌గోపాల్ వర్మ ఇప్పటికే ఎన్నోసార్లు ప్రశంసలు కురిపించిన సంగతి తెలిసిందే. తాజాగా ఆయన మరోసారి ఆదిత్యధర్‌ను పొగడ్తలతో ముంచెత్తారు. ఓ ఆంగ్ల మీడియా ఇంటర్వ్యూలో వర్మ ఈ సినిమాపై తనశైలిలో మాట్లాడారు. 'ధురంధర్' చిత్రం భారతీయ చిత్ర పరిశ్రమలో ఒక విప్లవాన్ని సృష్టించిందని వర్మ అన్నారు. సినిమా మేకింగ్ శైలిని ఆదిత్య ధర్ పూర్తిగా మార్చేశారని మెచ్చుకున్నారు. బాలీవుడ్‌లోనే కాకుండా, అన్ని భాషల చిత్రాలపై ఈ సినిమా బలంగా ప్రభావం చూపిందన్నారు. దీని విడుదల తర్వాత కథ చెప్పే విధానం పూర్తిగా మారిపోయిందన్నారు. ముఖ్యంగా తెలుగు చలనచిత్ర పరిశ్రమపై ఈ సినిమా ప్రభావం తీవ్రంగా ఉందని వర్మ అభిప్రాయపడ్డారు. తెలుగులో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న పలు భారీ బడ్జెట్ యాక్షన్ చిత్రాలు 'ధురంధర్' మేకింగ్ ప్రమాణాలను అందుకోవడం కోసం భారీగా 'రీ-షుట్స్'లు చేసుకుంటున్నాయని తెలిపారు. దీనివల్ల నిర్మాతలు కోట్ల రూపాయల అదనపు బడ్జెట్ భారాన్ని మోయాల్సి వస్తోందని, ఈ పరిస్థితికి కారణమైన ఆదిత్యధర్‌పై ఇండస్ట్రీ కోపంగా ఉందని వ్యాఖ్యానించారు. "చాలామంది మేకర్స్ వారి కంఫర్ట్ జోన్‌లో ఉండి పాత పద్ధతుల్లోనే సినిమాలు తీయడానికి ఇష్టపడతారు. కానీ ఆదిత్య వారిని ఆ జోన్ నుంచి బయటకు వచ్చి కష్టపడేలా చేశారు. ఆదిత్యధర్, యామీ గౌతమ్ ఇకపై చాలా జాగ్రత్తగా అడుగులు వేయాలి. వారు ఎప్పుడు ఫెయిల్ అవుతారా అని చిత్ర పరిశ్రమ మొత్తం ఎదురుచూస్తోంది" అని రామ్ గోపాల్ వర్మ అన్నారు. ఇక ఈ సినిమాకు సీక్వెల్‌గా తెరకెక్కిన 'ధురంధర్ 2' 2) మార్చి 19న విడుదలకు సిద్ధమైన విషయం తెలిసిందే.

విశాఖ సమాచారమ్
ఆదివారం 15-3-2026

# ఆర్భాటంగా మారుతున్న పెళ్లిళ్లు..

భారతదేశంలో ఆధునిక టెక్నాలజీ, డెస్టినేషన్ వెడ్డింగ్స్ ప్రభావంతో పెళ్లిళ్లు రోజురోజుకు ఆర్భాటంగా మారుతున్నాయి. పెరుగుతున్న పెళ్లి ఖర్చులు, కొత్త ట్రెండ్లు, యువత ఆలోచనల్లో వచ్చిన మార్పులపై ఈ ప్రత్యేక కథనం.

**ఆర్భాటంగా మారుతున్న పెళ్లిళ్లు..**

ఆధునిక టెక్నాలజీ హంగుల ప్రపంచంలో వివాహ మహోత్సవాలు రోజురోజుకు మరింత ఆర్భాటంగా మారుతున్నాయి. ఒకప్పుడు ప్రముఖులు, సంపన్నులు మాత్రమే తమ హోదాను ప్రదర్శించేందుకు భారీగా ఖర్చు చేసేవారు.. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

**ప్రత్యేక ఉత్సవంగా పెళ్లి!**

సామాజిక జీవన విధానంలో వచ్చిన మార్పులు, ఆర్థిక స్థితిగతుల్లో పెరిగిన అవకాశాలు, యువతలో పెరిగిన ఆత్మవిశ్వాసం–ఇవన్నీ కలిసి వివాహాల రూపాన్ని కొత్త దిశగా తీసుకెళ్తున్నాయి. ఇప్పటి తరంలో పెళ్లి అంటే కేవలం రెండు కుటుంబాల కలయిక మాత్రమే కాదు. ఒక ప్రత్యేకమైన ఉత్సవంగా మారింది. జీవితంలో ఒకసారి జరిగే ఈ వేడుకను చిరస్మరణీయంగా నిలుపుకోవాలనే కోరిక ప్రతి కుటుంబంలో పెరుగుతోంది. అందుకే పెళ్లి వేడుకలను ఎంతో వైభవంగా నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నారు..

**భారీగా పెరిగిన పెళ్లి ఖర్చులు..**

ఇటీవలి కాలంలో పెళ్లి ఖర్చులు భారీగా పెరిగినట్టు పలు సర్వేలు సూచిస్తున్నాయి. 'వెడ్ మి గుడ్' అనే సంస్థ నిర్వహించిన సర్వేలో గత సంవత్సరాలతో పోలిస్తే వివాహ వ్యయం గణనీయంగా పెరిగినట్లు వెల్లడైంది. 2022లో సగటు పెళ్లి ఖర్చు సుమారు రూ.25 లక్షలు కాగా, 2023లో అది రూ.28 లక్షలకు చేరింది. 2024 నాటికి అది మరింత పెరిగి సగటున రూ.36.5 లక్షలకు చేరిందని ఆ సర్వే తెలిపింది. డెస్టినేషన్ వెడ్డింగ్స్ కోసం సగటు ఖర్చు రూ.51.1 లక్షలకు పైగా ఉందని పేర్కొంది. అదే విధంగా పెళ్లికి కోటి రూపాయలకు పైగా ఖర్చు చేసే వారు సుమారు 9 శాతం ఉన్నారని, రూ.50 లక్షలకు పైగా ఖర్చు చేసే వారు 18 శాతం వరకు ఉన్నారని సర్వేలో వెల్లడైంది. మరోవైపు రూ.25 లక్షల లోపు ఖర్చు చేసే వారు సుమారు 60 శాతం వరకు ఉన్నారని పేర్కొన్నారు.

**ఖర్చుకు తగ్గేదేలే- అందరికీ నచ్చినట్లే..!**

ముఖ్యంగా యువతలో ఆర్థిక స్వావలంబన పెరిగింది. చిన్న వయసులోనే మంచి ఉద్యోగాలు సంపాదిస్తూ అధిక ఆదాయం పొందుతున్నారు. ఐటీ, కార్పొరేట్ రంగాల్లో పనిచేస్తున్న యువతలో 'జీవితం ఒక్కసారే వస్తుంది' అనే భావన బలపడుతోంది. అందువల్ల పెళ్లి వేడుకలను ప్రత్యేకంగా జరుపుకోవాలనే ఆసక్తి పెరుగుతోంది. భవిష్యత్తులో మరింత సంపాదించగలమనే ధీమాతో పెళ్లి వేడుకలపై భారీగా ఖర్చు చేస్తున్నారు.

**జోరుగా డెస్టినేషన్ వెడ్డింగ్స్!**

పట్టణాల్లో ఉన్న కన్వెన్షన్ సెంటర్లు, ఫంక్షన్ హాళ్లు, రిసార్టులు, లగ్జరీ హోటళ్లు వివాహాలకు ప్రధాన వేదికలుగా మారాయి. సంపన్నులు, ఎగువ మధ్యతరగతి కుటుంబాలు విదేశాల్లో లేదా ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్స్ నిర్వహిస్తున్నారు. గోవా, జైపూర్, ఉదయపూర్, కేరళ వంటి ప్రాంతాలు ఇందుకు ప్రధాన కేంద్రాలుగా నిలుస్తున్నాయి.. మధ్యతరగతి కుటుంబాలు కూడా కన్వెన్షన్ సెంటర్లు, రిసార్టుల్లో పెళ్లి వేడుకలు నిర్వహించడం సాధారణంగా మారింది.

టెక్నాలజీతో కొత్త ట్రెండ్

ఇటీవలి కాలంలో పెళ్లి ఆహ్వాన పత్రికలు కూడా కొత్త రూపం దాల్చాయి. ఒకప్పుడు సాధారణంగా ఉండే శుభలేఖలు ఇప్పుడు టెక్నాలజీతో ముస్తాబై ఆకర్షణీయంగా మారాయి. వెండి, బంగారు అక్షరాలతో అచ్చు వేసిన కార్డులు, ప్రత్యేక డిజైన్లు, బాక్స్ ఇన్విటేషన్లు ఇప్పుడు ఫ్యాషన్‌గా మారాయి. కొత్తగా వర్చువల్, ఎన్ఎఫ్‌సీ, 3డీ వెడ్డింగ్ ఇన్విటేషన్ కార్డులు కూడా అందుబాటులోకి వచ్చాయి.

**ఫ్యాషన్‌గా మారుతున్న ఖర్చు..!**

ఈ విధంగా వివాహ వేడుకలు ఒక ఫ్యాషన్‌గా మారుతున్నాయి. ఆర్థికంగా స్థోమత ఉన్నవారు భారీగా ఖర్చు చేయడంలో తప్పేమీ లేదు. కానీ కొందరు తమ స్థాయికి మించి కేవలం ప్రతిష్ట కోసం అప్పులు చేసి పెళ్లిళ్లను ఆర్భాటంగా నిర్వహించడం ఆందోళనకరం. పెళ్లి తరువాత సంవత్సరాల పాటు అప్పులు తీర్చాల్సిన పరిస్థితి రావడం కుటుంబాల ఆర్థిక స్థితిని దెబ్బ తీస్తోంది. అధిక డబ్బు ఉంటే పేదలకు సహాయం చేయడం, అనాథాశ్రమాలు, విద్యాసంస్థలు లేదా సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలకు కొంత భాగం ఖర్చు చేయడం కూడా ఒక మంచి సంప్రదాయంగా మారాలి.

# హనుమను చూసిన సీత

తనకి కలలో వానరం వచ్చిందనుకుని (కీడు అంటారు)సీతమ్మ భయపడి "లక్ష్మణుడితో కూడిన రాముడికి మంగళం కలగాలి, నా తండ్రి జనక మహారాజు క్షేమంగా ఉండాలి" అని అనుకుని, 'అసలు నాకు నిద్ర వస్తేకదా  కల రావడానికి, నేను అసలు నిద్రేపోలేదు. కాబట్టి ఇదంతా నేను నిరంతరం రాముడిని తలుచుకుంటూ ఉండడం వలన రామ కథని విన్నానన్న భ్రాంతికి లోనయ్యాను' అనుకుని మళ్ళీ పైకి చూసింది. చూసేసరికి హనుమ అక్కడే ఉన్నాడు.

అప్పుడు సీతమ్మ అన్నది

"ఇంద్రుడితో కూడుకుని ఉన్న బృహస్పతికి నమస్కారం, అగ్నిదేవుడికి నమస్కారం, బ్రహ్మకి నమస్కారం, ఈ వానరుడు చెప్పిన మాటలు సత్యమగుగాక!" అని సీతమ్మ దేవతలని ప్రార్థన చేసింది.

అప్పుడు హనుమంతుడు మెల్లగా  కొమ్మల కిందకి వచ్చి "అమ్మా! నేను అబద్ధం చెప్పలేదు. నేను యదార్థం చెప్పాను. నేను రామదూతని, సుగ్రీవుడి సచివుడిని, నన్ను నమ్మమ్మా" అన్నాడు.

అపుడు సీతమ్మ  "ఎవడు 100 సంవత్సరముల జీవితాన్ని పండించుకుంటాడో, ఉత్సాహంతో నిలబడతాడో, వాడు ఏదో ఒకనాటికి జీవితంలో శుభవార్త వింటాడు. నేను బహుశా ప్రాణాలు విడిచిపెట్టకుండా నిలబడినందుకు ఈ శుభవార్త విన్నాను" అన్నది.

అప్పుడు హనుమ "అమ్మా! నువ్వు దేవతా స్త్రీవా,  యక్షు మహిళవా, గంధర్వయువతివా, కిన్నెర కాంతావా, వశిష్ఠుడి మీద అలిగి వచ్చిన అరుంధతివా, అగస్త్యుడి మీద అలిగి వచ్చిన లోపాముద్రవా. నీ పాదాలు భూమి మీద ఆనుతున్నాయి, కనుక నువ్వు దేవతా స్త్రీవి కావు. నీలో రాజలక్షణాలు కనపడుతున్నాయి కనుక నువ్వు కచ్చితంగా క్షత్రియ వంశానికి సంబంధించిన ఒక రాజు ఇల్లాలివి అయ్యి ఉంటావు అని నేను అనుకుంటున్నాను. నువ్వు కాని జనస్థానంలో రావణుడు అపహరించిన సీతమ్మవి కాదు కదా?" అన్నాడు.

సీతమ్మ "ఈ పృథ్వీ మండలాన్ని ఏలిన రాజులలో చాలా గొప్పవాడైన, శత్రుసైన్యాలని చీల్చి చెండాడగల దశరథ మహారాజు పెద్ద కోడలని నేను. విదేహ వంశంలో జన్మించిన జనక మహారాజుకి కూతురిని, నన్ను సీత అంటారు. బుద్ధిమంతుడైన రాముడికి ఇల్లాలిని. నేను అయోధ్యలో 12 సంవత్సరాలు హాయిగా గడిపాను. కాని 13వ సంవత్సరంలో దశరథుడి ఆజ్ఞ మేర దండకారణ్యానికి వచ్చాం. రాముడు లేనప్పుడు రావణుడు నన్ను అపహరించి ఇక్కడికి తీసుకొచ్చాడు" అంది.

'సీతమ్మకి నా మీద నమ్మకం కలిగింది' అని హనుమ అనుకొని ఆమె దగ్గరికి గబగబా వెళ్ళాడు. అలా వస్తున్న హనుమని చూసి సీతమ్మ మళ్ళీ మూర్ఛపోయింది. కొంతసేపటికి తేరుకొని "నువ్వు దుర్మార్గుడవైన రావణుడివి, మళ్ళీ రూపం మార్చుకొని వచ్చావు" అంది.

కాని సీతమ్మ మనస్సులో 'ఏంటో ఈ వానరాన్ని చూస్తే అలా అనిపించడం లేదు. మనస్సులోనుంచి ప్రీతి పొంగుతోంది. ఈయన అటువంటివాడు కాదు అనిపిస్తోంది. ఈయనని చూస్తే పుత్ర వాత్సల్యం కలుగుతోంది' అని అనుకొని, "నాయనా! నువ్వు ఎవరివో యదార్థంగా నాకు చెప్పు" అంది.

అప్పుడు హనుమంతుడు "అమ్మా! నువ్వు అపహరించబడ్డాక రాముడు జటాయువుతో మాట్లాడాడు, తరువాత జటాయువు ప్రాణాలు వదిలాడు. తరువాత కబంధుడు కనబడ్డాడు, ఆ తరువాత సుగ్రీవుడి దగ్గరికి వచ్చారు. సుగ్రీవుడితో స్నేహం చేసిన రాముడు వాలి సంహారం చేసినతరువాత సుగ్రీవుడికి పట్టాభిషేకం చేశారు. నిన్ను వెతకడం కోసం సుగ్రీవుడు వర్షాకాలం వెళ్ళిపోయాక వానరాలని పంపించాడు. దక్షిణ దిక్కుకి అంగదుడి నాయకత్వంలో వచ్చిన వానరాలు సముద్రాన్ని చేరుకొని ఉండిపోయాయి. నన్ను హనుమ అంటారు.

సంభరాసురుడు అనే రాక్షసుడిని చంపిన కేసరి నా తండ్రి, మా తల్లి అంజనా దేవి క్షేత్రంగా వాయుదేవుడికి ఔరస పుత్రుడిని నేను. నేను నీ కుమారుడివంటి వాడను. నేను రామ దూతని తల్లీ. రాముడు నీకోసం బెంగపెట్టుకుని ఉన్నాడు తల్లీ, నీ జాడ తెలియగానే రాముడు వచ్చి నిన్ను రక్షిస్తాడు. నన్ను నమ్ము తల్లీ!" అన్నాడు.

అప్పుడు సీతమ్మ "నువ్వు వానరుడివి, రాముడు నరుడు. నరవానరములకి స్నేహం ఎలా కుదిరింది? నా శోకము పోవాలంటె నేను రాముడి గుణాలు వినాలి. నువ్వు అంత రామ భక్తుడివి అయితే రాముడు ఎలా ఉంటాడో చెప్పు?" అంది.

**...యమ్వీఆర్**

# మీకు తెలియకుండానే.. కిడ్నీలు పాడవుతున్నయ్!

కిడ్నీ వ్యాధులు జాతీయ సగటుతో పోలిస్తే ఎక్కువగా పెరుగుతున్నాయి. హైబీపీ, మధుమేహం, డీహైడ్రేషన్, జీవనశైలి మార్పులు ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. కిడ్నీ సమస్యల లక్షణాలు, ప్రమాదాలు, ముందస్తు పరీక్షలు మరియు మూత్రపిండాల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలుసుకోండి.

**మీకు తెలియకుండానే.. కిడ్నీలు పాడవుతున్నయ్!**

దేశంలో రాను రానూ కిడ్నీ సమస్యల బాధితులు పెరుగుతున్నారు. ప్రతి సంవత్సరం లక్షకు పైగా కొత్త మూత్రపిండ వైఫల్యాల కేసులు బయటపడుతున్నాయి. దేశంలోనే కిడ్నీ సమస్యల్లో తెలంగాణ ప్రథమ స్థానంలో ఉంది. దేశంలో సగటున 13 నుంచి 14 శాతం మంది కిడ్నీ సమస్యలతో బాధపడుతుంటే.. తెలంగాణలో మాత్రం అది దాదాపు 17 శాతం. ఇది జాతీయ సగటు కన్నా చాలా ఎక్కువ.

**కిడ్నీ వ్యాధికి కారణాలు..**

కిడ్నీ సమస్యలకు ప్రధాన కారణాలు హైబీపీ, మధుమేహం కాగా.. తెలంగాణలో ఈ రెండు సమస్యలు ఎక్కువగా ఉన్నాయని ఆరోగ్యశ్రీ, వైద్యారోగ్య శాఖల లెక్కలు వెల్లడిస్తున్నాయి.. రాష్ట్రంలో ఈ రెండు వ్యాధులతో బాధపడుతున్న వారు సుమారు 50 లక్షల మంది వరకు ఉన్నారని అంచనా. మారుతున్న జీవన శైలి, ఆహారపు అలవాట్లు, చక్కెర, ఉప్పు అధిక వినియోగం, ఊబకాయం వంటివి ఈ సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి. కిడ్నీ జబ్బులను సైలెంట్ కిల్లర్ అని అంటారు.. చాలా మందిలో సమస్య బయటపడే సమయానికే మూత్రపిండాలు 70–80 శాతం పాడైపోయి ఉంటున్నాయి. 30 ఏళ్ల లోపు వారిలో కూడా మధుమేహం, హైబీపీ వంటి సమస్యలు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. నొప్పి నివారణ మాత్రలు, గ్యాస్–ఎసిడిటీ మందులు, అశాస్త్రీయ వైద్య విధానాలను ఆశ్రయించడం (ఆయుర్వేదిక్, హోమియోపతి, అల్లోపతి ఇలా అన్ని రకాల మందుల్నీ కలిపి వాడటం వంటివి కూడా) కిడ్నీ సమస్యలను మరింత పెంచుతున్నాయి. జన్యుపరమైన లోపాల వల్ల కూడా కిడ్నీ జబ్బుల బారిన పడే వారి సంఖ్య ఎక్కువగానే ఉంది.

**అజ్ఞాత కారణాలతో కిడ్నీ వైఫల్యం!**

మారుతున్న జీవనశైలి, షుగర్, హైబీపీలతో పాటు తెలంగాణలో అజ్ఞాత కారణాల వల్ల (జఖణబ) సమస్యలు ఎక్కువయ్యాయి.. ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామీణ శ్రీకాకుళం జిల్లాలోని ఉద్దానం ప్రాంతంలో తెలియని కారణాల వల్ల దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధి చాలా మంది పేదల్ని పట్టి పీడిస్తోంది. ఇక్కడి ప్రతి ఐదుగురిలో ఒకరు కిడ్నీ వ్యాధి బాధితులే.. తెలంగాణలోని పలు జిల్లాల్లో భూగర్భ జలాల ప్రభావం, వ్యవసాయ రసాయనాల వాడకం వంటి కారణాలతో యువత ఎక్కువగా కిడ్నీ సమస్యలని ఎదుర్కొంటున్నారు..

**డీహైడ్రేషన్‌తోనే అధిక ప్రమాదం..!**

అధిక ఉష్ణోగ్రతల మధ్య వేడి వాతావరణంలో ఎక్కువ గంటలు పనిచేసే కార్మికులు రైతులు డీహైడ్రేషన్‌కి గురౌతారు. దాని వల్ల మూత్రపిండాలకు రక్త ప్రవాహం తగ్గి, దీర్ఘకాల నష్టం జరుగుతుంది. తగినంత నీరు తాగకపోవడం, ఉప్పు ఎక్కువగా వాడే జంక్ ఫుడ్ తినడం, నొప్పి నివారణ మందుల వాడకం కిడ్నీ సమస్యలకు కారణాలు.. పసర్లు, మూలికా వైద్యాలు మూత్రపిండాలకు హాని కలిగిస్తాయి. 40% మంది కిడ్నీ రోగులు అశాస్త్రీయ వైద్యవిధానాల్ని విశ్వసించి మందులు వాడినట్లు అధ్యయనాలు చూపిస్తున్నాయి. ఉద్దానం, నల్గొండ వంటి ప్రాంతాల్లో ప్రభుత్వాలు కిడ్నీ పరిశోధనా కేంద్రాలు, ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నాయి. కానీ లక్షణాలు కనిపించే సమయానికే వ్యాధి ముదిరిపోయి ప్రమాద స్థాయికి చేరుకుని వుంటుంది. సీరమ్ క్రియాటినిన్, రక్తపోటు మానిటరింగ్, యూరిన్ ఆల్బుమిన్ వంటి సాధారణ పరీక్షల ద్వారా తొలి దశలోనే సమస్యని గుర్తించగలం. రొటీన్ స్క్రీనింగ్ అనివార్య నష్టాన్ని నివారించడానికి కీలక పాత్ర పోషిస్తుంది.

**మూత్రపిండాల సంరక్షణకు ఏం చేయాలి?**

మూత్రపిండాల సమస్య లక్షణాలు కనిపించినప్పుడు మొదలవదు.. అంతకు ముందే మొదలవుతుందని ముందుగా గ్రహించాలి. మధుమేహం, హైపర్ టెన్షన్, కుటుంబ చరిత్ర వంటి రిస్క్ ఫ్యాక్టర్లను




తెలుసుకోవాలి. రిస్క్ ఫ్యాక్టర్లు ఉంటే మూత్రపిండాల పనితీరు పరీక్షలు చేయించుకోండి. నొప్పి నివారణ మందులు, నియంత్రణ లేని సప్లిమెంట్లను దీర్ఘకాల వాడకాన్ని నివారించండి. శుభ్రమైన, సురక్షితమైన నీరు తాగండి. సమతుల ఆహారం తీసుకోండి. రోగ లక్షణాలు ముదిరిపోయే వరకు వేచి ఉండకుండా త్వరగా వైద్య సలహా తీసుకోండి. 30 ఏళ్లు దాటిన వారు ప్రతి సంవత్సరం కిడ్నీ పరీక్షలు (రావతీబఎ జతీమ్ఫ్అఅఅవ, ఖతీఅఖ్రీఎంఅం) చేసుకోవాలి.

**కిడ్నీలు కాపాడుకోవడం మన చేతుల్లోనే..**

తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఉష్ణ ప్రదేశాలు.. వేడి వాతావరణంలో మరీ ముఖ్యంగా బహిరంగ ప్రదే శాల్లో తీవ్రమైన ఉష్ణోగ్రతల మధ్య గనుల్లో కార్ఖానాల్లో పని చేసేవారు తగినంత నీరు తాగడం, ఉప్పు తగ్గించడం, సమతుల ఆహారం తీసుకోవడం అవసరం. సమస్య వచ్చిన తర్వాత డాక్టర్ల దగ్గరికి పరుగెత్తడం కంటే ముందు జాగ్రత్తలు పాటించడం మంచిది. డయాలిసిస్ కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల వరకూ పోకుండా కిడ్నీలు కాపా డుకోవడం మన చేతుల్లోనే ఉంది.

**-డాక్టర్ హిమ దీప్తి ఆళ్ళ**
**ఎం.డి. డి.ఎం.(నెఫ్రాలజీ)**

# మావోయిస్టు పార్టీ.. ఇక చరిత్రేనా..?

దేశ అంతర్గత భద్రతకు సవాల్‌గా ప్రకటించబడి, సమాంతరంగా ఆదర్శ ప్రభుత్వాన్ని సైతం నడిపిన, గ్రామరాజ్య కమిటీలతో 13 రాష్ట్రాలకు విస్తరించిన మావోయిస్టు పార్టీ మనుగడ పైన చర్చ జరగడం చూస్తుంటే ఎవ్వరికైనా ఆశ్చర్యం కలగక మానదు..

కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు రహిత భారత్ 2026 మార్చి గడువు ప్రకటించిన నేపథ్యంలో ప్రజలలో, బుద్ధి జీవులలో, ప్రజాస్వామిక వాదులలో జరుగుతున్న ఆసక్తికర చర్చ కొత్త మలుపు తీసుకుంది.

**కోలుకోలేని దెబ్బ.. నిజమే**

తెలంగాణ ప్రభుత్వం ఇటీవల కొత్తగా ప్రకటించిన లొంగుబాట్లతో విషయం అన్ని రంగాల్లోకి చర్చగా వ్యాపించిదనడంలో ఎలాంటి సందేహం లేదు. సుమారు నాలుగు దశాబ్దాలపాటు పలు రాజకీయ పార్టీల ప్రభుత్వాలకు సవాల్‌గా నిలిచిన ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీ అంతర్ధాన మవుతోందా? అన్నదే ప్రధాన అంశం. మరీ ప్రధానంగా సంవత్సర కాలంగా ఆ పార్టీ నాయకత్వాన్ని కోల్పోవడం (ఎన్ కౌంటర్లు, లొంగుబాట్లతో), ప్రభుత్వ నిఘా, కోవర్ట్ ఆపరేషన్లు, సాంకేతికత వినియోగం, భారీ పోలీసు బలగాలతో అడుగడునా గాలింపు చర్యలతో ఉద్యమాన్ని బలమైన దెబ్బ తీయగలిగింది. శక్తివంతమైన సైనిక శక్తి గల భారత ప్రభుత్వ దాడిని సరైన సమయంలో అంచనా వేయడంలో వైఫల్యం, సకాలంలో సరైన నిర్ణయం తీసుకోవడం అమలు చేయడంలో ఆ పార్టీ నాయకత్వం వైఫల్యం కారణంగా అతి తక్కువ కాలంలోనే ఆ పార్టీకి కోలుకోలేని దెబ్బ తగిలిందన్నది పచ్చి నిజం.

**నాయకత్వాన్ని కోల్పోవడమే సమస్య!**

ఒక రాజకీయ పార్టీగా ఏర్పడి, ఆయుధాలు వీడి ప్రజా పోరాటాల జరపాలని, ఇక యుద్ధం చేసి గెలవలేమని చాలా కాలంగా పార్టీ నేతలు కొందరు బహిరంగంగానే చర్చకు దిగారు. ఇది రెండు పంథాల మధ్య వైరుధ్యంలా కొనసాగింది. అనేకమంది సీనియర్ నేతలతో పాటు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శిగా ఉన్న బసవరాజు ఎన్‌కౌంటర్‌లో అమరుడవడంతో పార్టీలో అంతర్గత వైరుధ్యంగా ఉన్న ఆ విషయం బహిర్గతమైంది. ఆదివాసీ యోధుడు, పి.ఎల్.జి.ఏ. నేత హిడ్మా మరణం ప్రపంచ వ్యాప్తంగా సానుభూతి వచ్చినా ఆ పార్టీ నిలదొక్కుకోలేక పోతోంది. ప్రధానంగా తెలంగాణ ప్రాంతాల నుంచి ఉద్యమ నిర్మాణంలోకి వెళ్లి దీర్ఘకాలం పనిచేసిన నాయకత్వాన్ని కోల్పోవడం వలన ఈ పరిస్థితి దాపురించిందని చెప్పవచ్చు.

**అలుపెరుగని దాడితో అతలాకుతలం..!**

ఆదివాసీల జీవన స్థితిగతుల మెరుగు కోసం, నిర్వాసితుల సమస్య పైన, అటవీ ప్రాంతాల నుంచి అపార ఖనిజ సంపద, కార్పొరేట్ శక్తుల నుంచి రక్షణ కోసం, పర్యావరణ పరిరక్షణలో భాగంగా అటవీ సంపద రక్షణ కోసం, తమ ప్రాణాలను ఫణంగా పెట్టి పని చేసిన నేతలు ఎందరో ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఉద్యమకారులు నిర్బంధాన్ని ఎదుర్కొన్నారు. జైళ్ల పాలయ్యారు. ఈ త్యాగాల, గాయాల కారణంగానే ప్రజల నుంచి, బుద్ధి జీవుల నుంచి, ప్రజాస్వామికవాదుల నుంచి మద్దతు పొందగలిగారు. ప్రభుత్వం మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలననే డిమాండ్‌కు ప్రాధాన్యత తేగలిగారు. కానీ, ప్రభుత్వం జరిపిన అలుపెరుగని దాడితో ఉద్యమం అతలాకుతలమైంది. అన్నిటికంటే ప్రధానంగా నాయకత్వ లొంగుబాటు సామాజిక మాధ్యమాలలో, మీడియాలో భారీ చర్చకు తెర లేపింది. విశ్లేషకులలో అనేక సంశయాలకు తావిచ్చింది.

**ఆ ప్రకటనతో గందరగోళం**

ప్రధానంగా వారు లొంగిపోయిన తర్వాత తెలంగాణ ప్రభుత్వంతో జరిపిన చర్చల సందర్భంగా రాజకీయ పార్టీగా ఏర్పడతామని, కేంద్రం సహకరిస్తే పి.ఎల్.జి.ఎ. ను రద్దు చేస్తామని అన్నట్టు/ ప్రకటించినట్లు వార్తలు వచ్చాయి. దాంతో ఉద్యమ సానుభూతిపరులు, పరిశీలకులు, రాజకీయ విశ్లేషకులు సైతం ఖంగుతిన్నారు. ఆపరేషన్ కగార్ ప్రకటించిన తర్వాత ఆ పార్టీ అధినాయకత్వం సమావేశమే కాలేక పోయిందని, సమీక్ష జరపడం కూడా వీలు కాలేదని ప్రచారం జరుగుతున్న సమయంలో వచ్చిన ప్రకటన గందరగోళానికి గురిచేసింది. అందరితో చర్చ చేయకుండానే, విధివిధానాలను ప్రకటించే అధికారం ఈ కొద్దిమందికి ఎక్కడిదని కొంతమంది అంటే, పార్టీని నమ్ముకుని ప్రాణాలు కోల్పో యిన వారి పరిస్థితి, జైళ్ల పాలైన వారి పరిస్థితి, ఉద్యమంలో మిగిలిన వారి పరిస్థితి ఏమిటన్నది ప్రధానాంశంగా మారింది. వెనువెంటనే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఇక అర్బన్ నక్సలైట్ల పని పడతామని ప్రకటించడం మరో విశేషం. రాహుల్ గాంధీని సైతం అర్బన్ నక్సలైట్ అంటున్న తర్వాత భవిష్యత్తు ఎలా ఉండబోతోందన్నది అగమ్య గోచరం. ఈ అంశాన్ని మానవ హక్కుల, పౌర హక్కుల సంఘాలు మాత్ర మే గొంతు



విప్పుతున్నాయి. గట్టిగా ఖండిస్తున్నాయి. రాజకీ య పార్టీలు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు మూగనోము నోస్తు న్నాయి. ఇలాంటి ప్రత్యేక పరిస్థితుల్లో ప్రభుత్వం విధించిన గడువుకు మాసం ముందుగానే ఇంతటి విపత్కర పరిస్థితులు ఏర్పడడం నిజంగానే ఆశ్చర్యం కలిగించక మానదు.

**చరిత్రలో నిలిచిపోయే ఉద్యమం**

మావోయిస్టు పార్టీ ఇక చరిత్రగానే మిగిలిపోతుందా? సాయుధపోరాటం అనే అంశం కనుమరుగైనట్లేనా? అంటే నిజమేనా అనిపిస్తోంది. కానీ, మావోయిస్టు పార్టీ పీడిత తాడిత ప్రజల కోసం సుదీర్ఘ కాలం సాగించిన ఉద్యమాలు, వారు నిర్మించిన పత్యామ్నాయ ప్రభుత్వ రూపు రేఖలు – విశేషాలు, అసమాన త్యాగాలు, తిరుగుబాటు సిద్ధాంతం చరిత్రలో, పీడిత ప్రజల హృదయాల్లో నిలిచి పోతాయి. లిపి నేర్పి, వ్యవసాయం, సంస్కృతి సంప్రదాయం, విద్యా వైద్య రంగాలలో చేసిన కృషి, ఆత్మగౌరవ పోరాటాలు, జల్ జంగల్ జమీన్ నినాదానికి ఇచ్చిన బలం మధ్యభారత దేశంలోని దండకారణ్య ఆదివాసీ ప్రజల గుండెల్లో అజరామరంగా నిలుస్తాయన్నది చెరిపి వేయలేని వాస్తవమే కదా! మధ్య భారత ప్రాంతానికి,ఆ పార్టీ అందించిన రాజకీయ చైతన్యం, పోరాటస్ఫూర్తి భవిష్యత్ లో ఎలాంటి రూపం తీసుకుంటుందో చరిత్ర మాత్రమే రుజువు చూపగలదు. చరిత్రను తన దృష్టితో కాకుండా,వాస్తవిక దృష్టితో చూస్తే కనిపించేదంతా నిష్ఠూర సత్యం.

**- రమణాచారి**

# మెయిల్ ఐడీ నచ్చలేదా ? మార్చుకుందాం

మనలో చాలా మందికి ఈమెయిల్ ఖాతాలు ఉంటాయి. అయితే ఈ మెయిల్ ఐడీల విషయంలో ఎక్కువ మందికి అసంతృప్తే ఉంటుంది. ఎందుకంటే చాన్నాళ్ల క్రితం వీటిని తెరిచేటప్పుడు సిస్టమ్ ఆటోమెటిక్‌గా సూచించిన ఏదో ఒక ఐడీని ఈమెయిల్ అడ్రెస్‌గా సెట్ చేసుకుని ఉంటారు. కానీ దాన్ని విస్తృతంగా ఉపయోగిస్తున్నప్పుడు అరే ఈ మెయిల్ ఐడీ అంత బాగా లేదే.. దీన్ని మనకు నచ్చినట్టు మార్చుకునే అవకాశం ఉంటే బాగుండు.. అనుకుంటుంటారు. ఇప్పుడా అవకాశాన్ని గూగల్ కల్పించబోతోంది. టెక్ దిగ్గజం రాబోయే సిస్టమ్ మార్పును వివరించే హిందీ భాష సపోర్ట్ డాక్యుమెంటేషన్‌ను ఇటీవల అప్‌డేట్ చేసింది. అందులో జీమెయిల్ అడ్రెస్‌లను మార్చుకునే వెసులుబాటు గురించి పేర్కొంది.ప్రసిద్ద ఫోర్బ్స్ ప్రచురించిన కథనం ప్రకారం.. గూగుల్ తీసుకొస్తున్న కొత్త ఫీచర్‌తో యూజర్లు తమ జీమెయిల్ అడ్రెస్‌లను మార్చుకోవచ్చు. అయితే ఇందుకు నిర్దిష్ట పరిమితులు ఉంటాయి. ఇలా మెయిల్ ఐడీ మార్చుకోవడానికి ఏడాదికి ఒక్కసారి.. మొత్తంగా మూడు సార్లు అవకాశం ఉంటుంది. అదే సమయంలో ఇంతకుముందున్న మెయిల్ అడ్రస్ కూడా అలియాస్‌గా కొనసాగుతుంది. అంటే దానికి వచ్చే మెయిల్స్ అలాగే వస్తుంటాయి. ఇక ఖాతా డేటా అంటే ఫోటోలు, మెసేజ్‌లు, ఇమెయిల్‌లు వంటి వాటిపై ఎలాంటి ప్రభావం ఉండదు.కాగా ఇప్పటి వరకు గూగుల్ అకౌంట్‌కు థర్డ్ పార్టీ ఈమెయిల్ చిరునామాలతో సైన్ అప్ చేసిన వినియోగదారులకు మాత్రమే ఖాతా ఈమెయిల్ మార్పులను అనుమతిస్తోంది. కానీ జీమెయిల్ అడ్రెస్‌ల మార్పునకు అవకాశం ఉండేది కాదు. ఇప్పుడు గూగుల్ అందిస్తున్న కొత్త ఫీచర్‌ను సోషల్ మీడియా యూజర్లు స్వాగతిస్తున్నారు.

# భారత్‌లో ఉద్యోగాలకు ఏఐ ముప్పు తక్కువే




పాశ్చాత్య దేశాలతో పోలిస్తే కృత్రిమ మేధతో (ఏఐ) భారత్‌లో వైట్ కాలర్ ఉద్యోగాలకు ముప్పు తక్కువేనని కేంద్ర ఐటీ శాఖ కార్యదర్శి ఎస్ కృష్ణన్ చెప్పారు. మొత్తం ఉద్యోగుల్లో వైట్ కాలర్ సిబ్బంది సంఖ్య తక్కువగా ఉండటం ఇందుకు కారణమని ఆయన పేర్కొన్నారు. ఈ ఆఫీసు ఉద్యోగాలు ఎక్కువగా సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్ (స్టెమ్) ఆధారిత విభాగాల్లోనే ఉంటున్నాయని తెలిపారు. ఉద్యోగులను పూర్తిగా తప్పించేసి, వారి స్థానాన్ని భర్తీ చేసే పరిస్థితి తలెత్తడం కన్నా, సిబ్బంది ఉత్పాదకత పెంపునకు ఏఐ ఉపయోగపడుతుందని వివరించారు. ఏఐ కొన్ని సందర్భాల్లో డేటాను సరిగ్గా అర్థం చేసుకోలేకపోయి, తప్పుగా ఇస్తున్న వివరాలను సరిచేసేందుకు ఇప్పటికీ మానవ ప్రమేయం అవసరం ఉంటోందని ఆయన చెప్పారు. ఏఐతో నిర్దిష్ట రంగాలు, అవసరాలకు తగ్గ సొల్యూషన్స్‌ని రూపొందించేందుకు అత్యుత్తమ నైపుణ్యాలున్న ఉద్యోగులు కావాల్సి ఉంటుందని కృష్ణన్ చెప్పారు. ఇలాంటి ఏఐ ఆధారిత ఉద్యోగావకాశాలను భారత్ అందిపుచ్చుకోవచ్చని వివరించారు. దేశీయంగా ఉద్యోగాల కల్పన, ఆర్థిక ప్రగతి సాధన కోసం కృత్రిమ మేధని ఉపయోగించుకోవడంతో పాటు ప్రపంచానికి కూడా ప్రయోజనం చేకూర్చగలిగే పటిష్టమైన స్థితిలో భారత్ ఉందని చెప్పారు.

# ఏఐ.. 2025 - ఉమెన్ రైజింగ్



**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో భారతీయ మహిళలకు సంబంధించి 2025 కీలక సంవత్సరంగా నిలిచింది. జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌డబ్ల్యూసీ) యశోద ఏఐ అభియాన్ కార్యక్రమం వల్ల క్షేత్రస్థాయిలో ఏఐ కోర్సులు చదివే మహిళల సంఖ్య బాగా పెరిగింది. టెక్నాలజీలో మహిళలకు సంబంధించిన ట్రెండ్‌లలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్) కోర్సులు కీలకంగా మారాయి. మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కోర్సులలో మహిళల పెరుగుదల నాలుగు రెట్లు పెరిగింది. ఈ సంవత్సరం ప్రారంభమైన జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌డబ్ల్యూసీ) యశోద ఏఐ అభియాన్‌లాంటి ప్రభుత్వ కార్యక్రమాలు, ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్, రైజింగ్ 2025 సమ్మిట్‌లాంటి సదస్సుల ప్రభావం వల్ల ఏఐ కోర్సులు చేసే మహిళల సంఖ్య పెరుగుతోంది. మరోవైపు మహిళల నేతృత్వంలోని ఏఐ స్టార్టప్‌ల సంఖ్య పెరగడం శుభసూచకం.**

**డీప్‌ఉటెక్ డొమైన్‌లలో**

2024తో పోల్చితే 2025లో ఏఐ/ఎంఎల్ మాస్టర్ ప్రోగ్రామ్స్‌లో మహిళల సంఖ్య 20 శాతం పెరిగింది. 'ఏఐ, ఎంఎల్‌లలో మాస్టర్స్ చదువుతున్న ప్రతి ఐదుగురు విద్యార్థులలో ఒకరు మహిళ. సంవత్సరం క్రితం వరకు ఇరవైమందిలో ఒకరు ఉండేవారు' అని తెలియజేసింది యూజీసీకి సంబంధించిన 'కాలేజి విద్య' ప్లాట్‌ఫామ్ రిపోర్ట్.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ప్రాంప్ట్ ఇంజినీరింగ్, సైబర్ సెక్యురిటీ, రోబోటిక్స్, డాటా సైన్స్‌లాంటి డీప్‌ఉ టెక్ డొమైన్‌లలో మహిళల ప్రాతినిధ్యం పెరిగిందని రిపోర్ట్ తెలియజేసింది. ఈ సంవత్సరం ఏఐ ప్రోగ్రామ్‌లకు సంబంధించి మహిళల ఆసక్తి గణనీయంగా పెరిగిందని, ఎంసిఏ సైబర్ సెక్యూరిటీ ఎన్‌రోల్‌మెంట్స్‌లో మహిళలు 25 శాతం, జనరేటివ్ ఏఐలో డాక్టోరల్ క్యాండిడేట్స్ 15 శాతం మంది ఉన్నారని నివేదిక వెల్లడించింది.

**మార్పు మంచిదే కదా!**

మనలో వచ్చిన మార్పుకు ఈ అభివృద్ధి రేటు అద్దం పడుతుంది. ఫ్లెక్సిబుల్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్, ఇండస్ట్రీ రోల్ మోడల్స్ విజయగాథలు తెలుసుకునే అవకాశం ఈ పెరుగుదలకు కారణం. భారతదేశ సాంకేతిక భవిష్యత్తుకు సంబంధించి మహిళలు కీలకపాత్ర పోషించబోతున్నారని ఈ మార్పును చెబుతుంది' అంటున్నారు 'కాలేజి విద్య' చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రోహిత్ గుప్తా.పెద్ద పెద్ద నగరాలలో మాత్రమే కాదు ద్వితీయ శ్రేణి, తృతీయ శ్రేణి పట్టణాలలో కూడా మహిళలు ఏఐ కోర్సులపై అమిత ఆసక్తి చూపిస్తున్నారు. సైబర్ భద్రతా నైపుణ్యాలపై మహిళలు దృష్టి సారించేలా యశోద ఏఐ అభియాన్ కార్యక్రమాలు చేపట్టింది.

**స్టాన్‌ఫోర్డ్ ఏఐ ఇండెక్స్ 2025**

స్టాన్‌ఫోర్డ్ ఏఐ ఇండెక్స్ 2025 ప్రకారం ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ఏఐ నైపుణ్యం కలిగిన వారిలో భారతీయ మహిళలు ఉన్నారు.'ఎనాలటిక్స్' ఇండియా మ్యాగజైన్ సమ్మిట్ ఏఐలో మహిళల భాగస్వామ్యంపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించింది. మొత్తంమీద, ఏఐకి సంబంధించి 2025 సంవత్సరం మహిళలకు కీలకమైన సంవత్సరం నిలుస్తుంది.**యశోద ఏఐ అంటే?**డిజిటల్ రంగంలో లింగ అంతరాన్ని తగ్గించడానికి ఈ సంవత్సరం మే 22న యశోద ఏఐ అభియాన్ ముందుకు వచ్చింది.యువర్ ఏఐ సాక్షి ఫర్ షేపింగ్ హారిజన్స్ విత్ డిజిటల్ అవేర్‌నెస్‌కు సంక్షిప్తరూపం... యశోద ఏఐ.ఎన్‌సీడబ్ల్యూ, ఫ్యూచర్ షిఫ్ట్ ల్యాబ్స్ (ఎఫ్‌ఎస్‌ఎల్) సహకారంతో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ ప్రచార కార్యక్రమం బరేలీలోని మహాత్మా జ్యోతిబా పూలే రోహిల్‌ఖండ్ విశ్వవిద్యాలయంలో ప్రారంభమైంది. 'భారతదేశం అంతటా ఒక కోటిమంది మహిళలకు డిజిటల్ నైపుణ్యం' అనే దీర్ఘకాలిక లక్ష్యంతో ప్రయాణం మొదలు పెట్టింది యశోద ఏఐ అభియాన్. మొదటి దశలో రెండు లక్షల మందికి పైగా మహిళలకు శిక్షణ ఇవ్వడాన్ని లక్ష్యంగా నిర్ణయించుకుంది. మొబైల్ యాప్, శిక్షణ కార్యక్రమాల ద్వారా మహిళలకు ఏఐ సాధనాలు, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ అక్షరాస్యతలో ఆచరణాత్మక జ్ఞానాన్ని అందిస్తోంది. ఏఐ సాంకేతికతను సులభతరం చేయడానికి స్థానిక భాషలలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

**మహిళలకు ఏఐ, సైబర్ సెక్యూరిటీ ఎందుకు కీలకం?**

హ్యాకింగ్, ఆన్‌లైన్ వేధింపులలాంటి సైబర్ నేరాల నుంచి తమను తాము రక్షించుకోవడానికి, ఏఐ రంగంలో అద్భుతమైన ఉద్యోగాలు సాధించడానికి, సాధికారతకు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను సురక్షితంగా నావిగేట్ చేయడానికి, కొత్త అవకాశాలను అన్వేషించడానికి, లింగ వివక్ష లేకుండా ఉండడానికి మహిళలకు ఏఐ, సైబర్ సెక్యూరిటీ ముఖ్యం అని యూఎన్ నివేదిక తెలియచేసింది. కాలేజీ స్టూడెంట్. సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ (ఎస్‌హెచ్‌జీ), ఆశావర్కర్, టీచర్, పంచాయతీ వార్డు మెంబర్ ఇలా ఎవరైనా కావచ్చు... యశోద ఏఐ అభియాన్‌లో చేరవచ్చు.'ఇది కేవలం శిక్షణా కార్యక్రమం మాత్రమే కాదు. ఏఐ, సైబర్ సెక్యూరిటీకి సంబంధించి మహిళా సాధికారతను ఉన్నతస్థాయిలో తీసుకువెళ్లే ఉద్యమం' అనే ప్రశంసలు అందుకుంటోంది యశోద ఏఐ అభియాన్. **ఏఐ బై హర్...గ్లోబల్ ఇంపాక్ట్ చాలెంజ్**గ్లోబ్ ఇంపాక్ట్ ఛాలెంజెస్...'ఏఐ బై హర్' 'ఏఐ ఫర్ ఆల్' 'యువ్ ఏఐ'ల కోసం భారత ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)కి సంబంధించి నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి మహిళా సాంకేతిక నిపుణులను ఆహ్వానిస్తుంది. మహిళల నేతృత్వంలో ఏఐ ఆవిష్కరణలకు ప్రోత్సాహం అందించడానికి, వ్యవసాయం. సైబర్‌సెక్యూరిటీ, విద్య, డిజిటల్ వెల్‌బీయింగ్, ఆరోగ్యసంరక్షణ, ఎనర్జీ అండ్ క్లైమేట్ రంగాలలో, ఏఐకి సంబంధించి నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, నీతి అయోగ్, ఇతర సంస్థల భాగస్వామ్యంతో గ్లోబల్ ఇంపాక్ట్ చాలెంజ్ 'ఏఐ బై హర్'కు శ్రీకారం చుట్టారు. 'ఏఐఉఫర్‌ఉగుడ్ అప్లికేషన్స్' లక్ష్యంతో ఫిబ్రవరి 2026లో న్యూ దిల్లీలో ఇండియాఉ ఏఐ ఇంపాక్ట్ సదస్సు జరగనుంది.

**ఎన్ని స్టార్టప్‌లో!**

ఈ సంవత్సరం మహిళల నేతృత్వంలోని స్టార్టప్‌ల సంఖ్యలో పెరుగుదల కనిపించింది. ట్రాక్షన్ డేటా ప్రకారం...అక్టోబర్ 2025 నాటికి దేశవ్యాప్తంగా మహిళల నేతృత్వంలో 7,000 కంటే ఎక్కువ స్టార్టప్‌లు పనిచేస్తున్నాయి. ఫండింగ్‌కు సంబంధించి వీటికి మంచి స్పందన వచ్చింది. మహిళల నేతృత్వంలోని ఏఐ వెంచర్‌లలో కొన్ని... డా.గీతా మంజునాథ్‌ఉనిరామయి హెల్త్ ఎనాలిటిక్స్, అశ్వినీ అశోకన్‌ఉమ్యాడ్ స్ట్రీట్ డెన్, చంద్రాలిక హజారికఉబిగ్ థింక్స్, ప్రాంజలీ అవస్థీఉ డెల్ఫ్.ఏఐ, కృష్ణప్రియ ఆకెళ్లఉస్టార్‌బజ్.ఏఐ, నిధిఉనెమా ఏఐ, రిత్వికా చౌదురిఉఅన్‌స్క్రిప్ట్.ఏఐ, లైనా ఇమ్మాన్యుయేల్, రింజిమ్ అగర్వాల్‌ఉబ్రెయిన్‌సైట్.ఏఐ.

# వంట గ్యాస్ కొరకు గగ్గోలు పెడుతున్న వినియోగదారులు



**రావికమతం (విశాఖ సమాచారం):**–రావికమతం మండలంలో గ్యాస్ ఏజెన్సీ వద్ద శనివారం వినియోగదారులు బారులు తీరారు.ఒక్కసారిగా గ్యాస్ సంక్షోభంలో పడిపోవడంతో వినియోగదారులు గ్యాస్ కొరకు పరుగులు తీస్తున్నారు.గతంలో 10 రోజులకు ఒకసారి వంట గ్యాసు బుక్ చేసుకోవడానికి అవకాశం ఉండేదని, ఇప్పుడు సుమారు 45 రోజులు వరకు గ్యాస్ బుక్ చేసుకోవడానికి సమయం పడుతుందని,అలాగే చిన్న బండకు 70 రూపాయలు, పెద్ద బండకు 140 రూపాయలు ధరను అదనంగా పెంచడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ఉదయం నుంచే మహిళలు, వృద్ధులు, వికలాంగులు లైన్లో వేసి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. సరఫరా ఆలస్య కావడంతో వినియోగదారులు అసౌకర్యానికి గురయ్యారు. గంటల తరబడి లైన్లో నించొని పడి కాపులు కాయ వలసిన పరిస్థితి నెలకొంది. దీంతో విసుగు చెందిన కొంతమంది వినియోగదారులు ఏమిటి పరిస్థితి అని ఒకరికొకరు చెవులు కొరుక్కున్నారు. అయితే వినియోగదారులు ఎవరు కంగారు పడాల్సిన అవసరం లేదని ఒకపక్క అధికారులు చెబుతున్నప్పటికీ వినియోగదారులకు ఇబ్బందులు మాత్రం తప్పడం లేదు.

# నాణ్యతే నమ్మకానికి పునాది ... వినియోగదారుడే బ్రాండ్ అంబాసిడర్

## కాండ్రేగుల వెంకటరమణ

**అనకాపల్లి(విశాఖ సమాచారం):-** నకిలీ వస్తువుల బెడద, ఆరోగ్య భద్రతపై పెరుగుతున్న అవగాహన వల్ల 'బ్రాండ' కంటే 'భరోసా' ఇచ్చే ఉత్పత్తులకే వినియోగదారులు ప్రాధాన్యత ఇస్తున్నారని కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కాండ్రేగుల వెంకటరమణ పేర్కొన్నారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా 'సురక్షితమైన ఉత్పత్తులు–విశ్వసనీయ వినియోగదారులు' అంశంపై ఆదిత్య డిగ్రీ కాలేజీలో శనివారం జరిగిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. 'విశ్వసనీయతే పెట్టుబడిగా భద్రతే ప్రాతిపదికగా' సాగే వ్యాపారాలే భవిష్యత్తులో రాణిస్తాయన్నారు. ఒకప్పుడు కంపెనీలు సెలబ్రిటీల ద్వారా ఉత్పత్తుల ప్రచారాన్ని నమ్ముకునేవని, కానీ ఇప్పుడు సోషల్ మీడియా వల్ల వినియోగదారులు ఇచ్చే రివ్యూలు శక్తివంతంగా మారాయన్నారు. కస్టమర్లు వస్తువును కొనే ముందు దానిపై ఉన్న క్యూఆర్ కోడ్‌లు లేదా బ్యాచ్ నంబర్‌లను స్కాన్ చేసి నాణ్యతను తనిఖీ చేసుకోవాలన్నారు. గతంలో 'తక్కువ ధర'కే ప్రాధాన్యతనిచ్చిన వినియోగదారులు ఇప్పుడు 'భద్రత, నాణ్యత' వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. ఆహార పదార్థాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, సౌందర్య సాధనాలు ఏదైనా సరే నాణ్యతలో లోపం ఉంటే అది కేవలం ఆర్థిక నష్టమే కాదు, ప్రాణాపాయానికి కూడా దారితీయవచ్చని ఆయన హెచ్చరించారు. నగదు చెల్లించి కొనుగోలు చేసిన వస్తువులు, సేవల్లో లోపాలకు గురైన వినియోగదారులు నివాస ప్రాంతం నుంచే వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించి న్యాయం, నష్టపరిహారం పొందవచ్చని స్పష్టం చేశారు. 'సురక్షితమైన ఉత్పత్తులు–విశ్వసనీయ వినియోగదారులు' అనే సూత్రం ప్రస్తుతం వ్యాపార విజయానికి ప్రధాన మంత్రంగా మారిందన్నారు. ఐఎస్ఐ, బీఐఎస్,



ఎఫ్ఎస్ఎస్ఏఐ, అంతర్జాతీయ నాణ్యత ప్రమాణాలు ధృవీకరణలు ఉన్న ఉత్పత్తుల పట్ల ప్రజల్లో ఆసక్తి పెరుగుతోందన్నారు. వస్తువులు, ఉత్పత్తుల తయారీలో వాడే ముడి పదార్థాల వివరాలను స్పష్టంగా వెల్లడించాలని తయారీదారులకు కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కాండ్రేగుల వెంకటరమణ విజ్ఞప్తి చేశారు. కాలేజీ ప్రిన్సిపల్ దువ్వాడ స్వాతి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ మై భారత్ (నెహ్రూ యువ కేంద్రం) డిప్యూటీ డైరక్టర్ గొర్లి మహేశ్వరరావు, కాలేజీ వైస్ ప్రిన్సిపల్ సిహెచ్.వి.మురళీధర్, అధ్యాపకులు వి.కామేశ్వరరావు, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం కె.వాసు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అక్కడ మాత్రం కీప్యాడ్ ఫోనులే! ఎందుకో తెలుసా?



**ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఫోన్‌లేని ప్రపంచాన్నే ఊహించలేం. అదీగాక చేతిలో ఫోన్ లేకపోతే ఏ పని సాగదు, కాలు కూడా కదపలేం. అంతలా టెక్నాలజీపై ఆధారపడిపోయాం లేదా బానిసలమైపోయాం అనొచ్చేమో..!. ఏ చిన్న సందేహమైనా..ఏదైనా.. తెలియని ప్రాంతానికి వెళ్లాలన్నా.. చేతిలో ఫోన్ ఉంటే చిటికెలో పనైపోతుంది. అంతలా మనకు అన్నింటిని అరచేతిలోకి వచ్చేసేలా అమర్చి పెట్టేసింది. అలాంటి స్మార్ట్ ఫోన్‌ని స్వచ్ఛంధంగా వాడకూడదని నిషేధం విధించుకుంది ఓ గ్రామం. అలా ఎందుకు చేసిందో తెలిస్తే..కచ్చితంగా సెల్యూట్ చేస్తారంతా. అయితే ఇది మరోకంగా విమర్శలకు దారితీసింది. ఆ నిషేధం కూడా సమంజసంగా ఉంటే..ఇతర గ్రామాలకు ఆదర్శంగానూ, అభినందనీయంగానూ ఉండేది. ఇంతకీ ఎందుకోసం స్మార్ట్ ఫోన్‌ని సీరియస్‌గా బ్యాన్ చేశారంటే..**

రాజస్థాన్‌లోని జలోర్ జిల్లాలోని 15 గ్రామాలు ఈ అనూహ్య నిర్ణయం తీసుకున్నాయట. యావత్తు ప్రపంచం 6జీ వైపు దూసుకుపోతే అక్కడ మాత్రం మహిళలను కీప్యాడ్ ఫోన్‌ల యుగానికి వెళ్లిపోదాం అంటోంది. చౌదరి కమ్యూనిటీకి చెందిన సుంధమాతా పట్టి పంచాయితీ స్మార్ట్‌ఫోన్ ఉపయోగించకుండా నిషేధం విధించింది. ముఖ్యంగా అక్కడ మహిళలు, బాలికలు వినయోగించకూడదు. అత్యవసరం అనకుంటే కీప్యాడ్ ఫోన్‌లే ఉపయాగించాలి అక్కడి మహిళలు. ఇదంతా ఎందుకంటే..మైబైల్ ఫోన్ ఒక వ్యసనంగా మారి పక్కదారి పట్టిస్తోందని, ముఖ్యంగా చిన్నారులపై దీని ప్రభావం మరింత ఎక్కువగా ఉందనే ఆయా గ్రామాలు స్మార్ట్ ఫోన్‌ని ఉపయోగించకూడదని నిషేధం విధించాయట. అంతేగాదు చదువుకునే పిల్లలు సైతం తమ ఇంట్లో ఫోన్ ఉపయోగించుకోవచ్చు గానీ బయటకు తీసుకురావడానికి వీల్లేదట. మహిళలే ఎందుకంటే..కచ్చితం అమ్మతోపాటు పిల్లలు ఉంటారు. దాంతో తరుచుగా చిన్నారులు వాటిని వినియోగించే అవకాశం ఉన్నందున మహిళలు కీప్యాడ్ ఫోన్‌లే ఉపయోగించాలని నిర్ణయించిందట పంచాయతీ. కాగా, ఆదివారం ఘాజీపూర్ గ్రామంలో జరిగిన పంచాయతీ సమావేశంలో ఈ తీర్మానాన్ని ఆమోదించారు. 14 పట్టి సమాజం అధ్యక్షుడైన సుజనారామ్ చౌదరి ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. అక్కడి పంచాయతీ ప్రకారం..దేవరామ్ కర్నోల్ వర్గం ముందుకు తెచ్చిన ప్రతిపాదనను పంచ్ హిమ్మతారామ్ చదివి వినిపించారు. చర్చల అనంతరం, సమావేశానికి హాజరైన పంచ్ సభ్యులందరూ ఈ నిబంధనను అమలు చేసేందుకు మొగ్గుచూపారు. ఈ తీర్మానం జనవరి 26 నుంచి అమలవుతుందట.

**ఏయే గ్రామాల్లో ఇది అమలు అంటే..**

ఈ నిర్ణయం భిన్‌మల్ ప్రాంతంలోని పలు గ్రామాలలో అమలు చేయబడుతుంది. వీటిలో ఘాజీపూర్, పావలి, కల్డా, మనోజియావాస్, రాజికావాస్, దట్లావాస్, రాజ్‌పురా, కోడి, సిద్రోడి, ఆల్డి, రోప్సి, ఖానాదేవల్, సావిధర్, హత్మీ కి ధాని, ఖాన్‌పూర్ గ్రామాలు ఉన్నాయి. నిజానికి పంచాయితీ చర్య సామాజిక కార్యకర్తలు, మహిళా హక్కుల సంస్థల నుంచి తారాస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇది కేవలం మహిళా వ్యతిరేక చర్యగా అభివర్ణించారు. ఏ నిషేధం అయినా లింగ సమానత్వానికి పెద్ద పీటవేసేలా ఉండాలి గానీ, మహిళలే లక్ష్యంగా నిషేధం అంటే సహించదగినది కాదంటున్నారు సామాజికకార్యకర్తలు, మహిళా సంఘాలు. అందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవ్వడమే కాదు హాట్‌టాపిక్‌గా మారింది కూడా.

# ఉల్లిపాయ రసం రెగ్యులర్ గా తాగడం వల్ల కలిగే లాభాలు మీకు తెలుసా..



మనం నిత్యం వంటల్లో ఉపయోగించే వాటిల్లో ఉల్లిపాయ ముఖ్యమైనది. వంటకాన్ని రుచిగా మార్చడంలోనే కాకుండా, అనేక ఆరోగ్యకరమైన పోషకాలు కలిగి ఉంది. రోగనిరోధక శక్తిని పెంచడం నుంచి రక్తంలో చక్కెరను నియంత్రించడం వరకు, ఉల్లిపాయలు అనేక విధాలుగా సహాయపడతాయి. కాబట్టి రోజూ ఉల్లిపాయ రసం తాగడం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుంది.

**జీవక్రియను మెరుగుపరచడంలో**

ఉల్లిపాయలో విటమిన్ "సి" , "బి" వంటి విటమిన్లు, పొటాషియం,మాంగనీస్ వంటి ఖనిజాలు ఉంటాయి. ఇవి జీవక్రియను మెరుగుపరచడంలో సహాయపడతాయి. కాబట్టి ఉల్లిపాయ రసం తాగడం వల్ల ఈ పోషకాలు అందుతాయి. విటమిన్ "సి" ఉన్న ఉల్లిపాయ రసం తాగడం కూడా రోగనిరోధక శక్తి పెరుగుతుంది.ఉల్లిపాయల్లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడితో పోరాడటానికి సహాయపడుతాయి. అంతేకాదు కణాలను దెబ్బతినకుండా కాపాడుతాయి కూడా. ఉల్లిలో ఉండే సల్ఫర్, ఇతర యాంటీఆక్సిడెంట్లు కొన్ని క్యాన్సర్ల ప్రమాదాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

**రక్తం గడ్డకట్టడాన్ని నివారించడం**

ఉల్లిపాయల్లోని యాంటీ ఆక్సిడెంట్లు, సల్ఫర్ శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తాయి. రక్తపోటును తగ్గించడం, రక్తం గడ్డకట్టడాన్ని నివారించడం ద్వారా గుండె జబ్బుల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తాయి. ఉల్లిపాయలలో ఉండే కొన్ని సమ్మేళనాలు యాంటీ డయాబెటిక్ ప్రభావాలను కలిగి ఉన్నాయని అధ్యయనాలు కనుగొన్నాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో ఉపయోగపడుతాయి. అంతే కాదు, ఉల్లిపాయలు ఫైబర్ కంటెంట్ కు గొప్ప మూలం. ఇది జీర్ణక్రియకు సహాయపడడం ద్వారా పేగుల ఆరోగ్యాన్ని కాపాడుతుంది.

# అవకాడోతో కలిపి తినకూడని ఆహారపదార్థాలు ఏమిటి..?



అవకాడోలో అనేక ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రొటీన్లు, పొటాషియం, మెగ్నీషియం పుష్కలంగా ఉన్నాయి. జీర్ణక్రియను మెరుగుపరచడానికి, గుండె ఆరోగ్యాన్ని కాపాడటానికి, మధుమేహాన్ని నియంత్రించడానికి, మెదడు ఆరోగ్యానికి, చర్మ ఆరోగ్యానికి అవకాడోలు ఎంతో మేలు చేస్తాయి. అయితే అవకాడోతో కొన్నిరకాల ఆహారపదార్థాలు తినకూడదు. అవి ఏమిటో చూద్దాం.

**ఉప్పు ఎక్కువగా ఉండే ఆహారాలు.**

అవకాడోలో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. సాల్టీ ఫుడ్స్‌లోని సోడియం వీటితో కలిపి తింటే ఎలక్ట్రోలైట్ సమతుల్యతను దెబ్బతీస్తుంది అంతేకాదు జీర్ణ సమస్యలను కలిగిస్తుంది.

**పాల ఉత్పత్తులు**

అవకాడోలో ఆరోగ్యకరమైన కొవ్వులు పుష్కలంగా ఉంటాయి. జున్ను లేదా పాలు, ఇతర పాల ఉత్పత్తులు కూడా కొవ్వు కలిగి ఉంటాయి. కాబట్టి ఈ రెండూ కలిస్తే జీర్ణ సమస్యలు వచ్చే అవకాశం ఉంది.

**పుల్లని పండ్లు**

అవోకాడోతో పాటు నారింజ,ద్రాక్ష వంటి పుల్లని పండ్లను తినడం వల్ల జీర్ణ సమస్యలు తలెత్తుతాయి.

**తీపి పదార్థాలు.**

అవకాడోలో చక్కెర తక్కువగా ఉంటుంది. కాబట్టి చక్కెర అధికంగా ఉండే ఆహారపదార్థాలు అవకాడోతో కలిపి తినకూడదు.

**ప్రొటీన్లు అధికంగా ఉండే ఆహారాలు**

ప్రొటీన్ ఫుడ్స్‌లోని కొవ్వు, అవకాడోలోని కొవ్వుతో కలిపి తీసుకుంటే శరీరంలోని అధిక కొవ్వుకు దారి తీస్తుంది. కాబట్టి అవకాడోతో ప్రొటీన్లు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోకూడదు.

**ప్రాసెస్ చేసిన ఆహారాలు**

.అవకాడోలు ఆరోగ్యకరమైన కొవ్వులు. ప్రాసెస్ చేసిన ఆహారాలలో అనారోగ్యకరమైన కొవ్వులు ఎక్కువగా ఉంటాయి కాబట్టి ఇవి రెండూ కలిపి తీసుకోవడం కూడా శరీరానికి మంచిది కాదు. అవకాడోతో కొవ్వు పదార్థాలు తినడం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలు వస్తాయి.

# నడక వేగంతో తుంటి మార్పిడి ఫలితం అంచనా



తుంటి కీలులోని మృదులాస్థి క్షీణించి, బాగా దెబ్బతిన్నప్పుడు సాధారణంగా పూర్తి తుంటి మార్పిడి (టోటల్ హిప్ రిప్లేస్‌మెంట్) చేస్తుంటారు. అయితే ఫలితాలు అందరిలో ఒకేలా ఉండవు. ఎప్పుడు తుంటి మార్పిడి చేస్తే మంచిదనేదీ కచ్చితంగా తెలియదు. దీని విషయంలో క్యూషూ యూనివర్సిటీ పరిశోధకులు కొత్త విషయాన్ని కనుగొన్నారు. తుంటి మార్పిడికి ముందు ప్రతి సెకండుకు కనీసం ఒక మీటరు వేగంతో నడిచేవారికి శస్త్రచికిత్స అనంతరం గణనీయమైన ఫలితం కనిపించే అవకాశమున్నట్టు గుర్తించారు. అంటే నడక వేగాన్ని బట్టి తుంటి మార్పిడి ఫలితాన్ని తెలుసుకోవచ్చన్నమాట. ఇది చాలా తేలికైన పద్ధతి కాబట్టి శస్త్రచికిత్స ముందు మదింపు చేసే సమయంలో నడక వేగాన్ని పరిగణనలోకి తీసుకోవటం మంచిదని పరిశోధకులు సూచిస్తున్నారు.

# గోదావరి జిల్లాల సమాచారం

## రైతుల సంక్షేమమే ప్రధాన ధ్యేయం: ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



**తాళ్లపూడి:** రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం సహకారంతో నెరవేరుస్తున్నామని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. తాళ్లపూడి మండలంలో శుక్రవారం సాయంత్రం జరిగిన నియోజకవర్గస్థాయి అన్నదాతా సుఖీభవ-పీఎం కిసాన్ మూడో విడత నిధుల విడుదల కార్యక్రమానికి కలెక్టర్ కీర్తి చేకూరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రకృతి వ్యవసాయ స్టాల్, విభిన్న కూరగాయలు, ధాన్యంతో ఏర్పాటు చేసిన రంగవల్లులను పరిశీలించి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. గోదావరి నీటిని వినియోగించి రెండు పంటలు పండిస్తున్నారని, అయితే ఎత్తిపోతల పథకాలకు మరింత నిధులు మంజూరు చేస్తే రైతుల కష్టాలు పూర్తిగా తీరుతాయన్నారు. యూరియా ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టామన్నారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన ఇబ్బందులపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. నేలను కాపాడేలా యూరియాను తగ్గించే ప్రయత్నం చేయాలన్నారు. ఆరోగ్యాన్నిచ్చే ప్రకృతి పంటలను పండించాలని సూచించారు.

## గోదావరి రివర్ ఫ్రంట్' ప్రాజెక్టుపై కొరవడిన శ్రద్ధ



**రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, :** గోదావరి రివర్ ఫ్రంట్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. సుమారు రూ.8 కోట్ల గ్రాంట్‌తో ప్రారంభించిన పనులు ముందుకెళ్లని పరిస్థితి. మార్చి నెల ఆఖరుకు పనులు పూర్తి చేయాల్సి ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 30 శాతం మాత్రమే పనులు చేపట్టారు. పనుల్లో భాగంగా గోదావరి ఘాట్ తొలగించడంతో ప్రమాదకరంగా మారింది. పనులు సకాలంలో పూర్తి చేయకపోతే వచ్చే వర్షాలకు, ఆ తర్వాత వరదలకు మూల్యం చెల్లించాల్సిందే.

**ఇదీ పరిస్థితి**

గోదావరి గట్టు ఎస్ఈ కార్యాలయం ఎదురుగా ఉన్న గట్టు నుంచి పర్యాటక కార్యాలయం వరకూ తొలి విడత రివర్ ఫ్రంటు పనులు చేపట్టారు.

గట్టు విస్తరణతోపాటు నదీ లోపల నీళ్లు తాకే విధంగా గట్టు విస్తరించడంతోపాటు బండ్ రోడ్డు ఆధునికీకరించాల్సి ఉంది. 2003 పుష్కరాలకు ఇక్కడ పార్కు నిర్మాణంలో భాగంగా గట్టును బలోపేతం చేశారు. పార్కును ఆనుకొని పద్మావతి తదితర స్నాన ఘాట్‌లు ఉన్నాయి. నూతన నిర్మాణంలో భాగంగా వాటిని తొలగించారు. ఆ ప్రాంతంలో బ్రిడ్జి నిర్మాణం, నదీ లోపలకు మెట్లు నిర్మించే క్రమంలో పూర్తిగా గట్టును తవ్వేశారు.

**వర్షం వస్తే అంతే**

గోదావరి నదీ ప్రవాహానికి బాగా దిగువన ఉండటంతో ఇక్కడే నీటి వేగం ఎక్కువగా ఉంటుంది. గతంలో భారీ వరదలకు గండి పడింది. అందువల్లే అక్కడ కాంక్రీటుతో గట్టు నిర్మించారు. ప్రస్తుతం పనుల కోసం కాంక్రీటును తొలగించారు. ఇక కేవలం మట్టి గట్టు మాత్రమే మిగిలి ఉంది. ఏ మాత్రం వర్షం కురిసినా గట్టు కూరుకుపోయే ప్రమాదం ఉంది. ప్రస్తుతం నదిలో నీళ్లు లేవు కాబట్టి ప్రమాదం లేకపోగా, వరదొస్తే గట్టు తెగిపోతుంది. అప్పుడు నగరం నీట మునుగుతుంది.

వాస్తవానికి గత ఏడాదే పనులు చేపట్టారు. గట్టు విస్తరణతోపాటు, బండ్ రోడ్డును పర్యాటకంగా విస్తరించాల్సి ఉంది. గత కమిషనర్ విజయ్‌రామరాజు రివర్ ఫ్రంట్ నిర్మాణ పనులకు నాంది పలికారు. మొత్తం ఘాట్ విస్తరించాలని ప్రతిపాదించారు. అయితే ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి అధికారం చేపట్టాక కేంద్రం స్పందించడంతో రూ. 8 కోట్ల గ్రాంటు మంజూరైంది. టెండర్లు దక్కించుకున్న గుత్తేదారుడు రూ.2 కోట్ల విలువైన పనులు పూర్తి చేశారు. వాటికి సంబంధించి నిధులు మంజూరు కావాల్సి ఉంది. దీంతో పనులు ఆలస్యమవుతున్నాయి. అయితే నదీ సమతుల్యతను దృష్టిలో పెట్టుకొని పనులు ఆలస్యం చేస్తే ప్రమాదాలు ఎదుర్కోవల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిపై మున్సిపల్ అధికారి స్పందిస్తూ పూర్తి చేసిన పనులకు నిధులు విడుదల కావాల్సి ఉందన్నారు. పనులు ఆపడం మాత్రం జరగదని, సకాలంలో పూర్తి చేస్తామన్నారు.

## కల్తీ పాల ఘటనలో 16కు చేరిన మృతుల సంఖ్య



**రాజమహేంద్రవరం:** రాష్ట్రంలోనే సంచలనం సృష్టించిన రాజమహేంద్రవరంలోని కల్తీ పాల ఘటనలో నేటికీ మృత్యుఘోష ఆగడంలేదు. ఈ ఉదంతం గత నెల 16న వెలుగులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు 16 మంది చనిపోయారు. బాధితులకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టినప్పటికీ, అప్పటికే విష రసాయన ప్రభావం వల్ల అవయవాలు దెబ్బతినడంతో ఫలితం లేకపోతోంది. శుక్రవారం ఇద్దరు చనిపోయారు. ఆసుపత్రుల్లో మరో అయిదుగురు చికిత్స పొందుతున్నారు. వీరిలో అయిదు నెలల శిశువు, రెండేళ్ల చిన్నారి సైతం ఉన్నారు. అందరికీ పలు ప్రైవేటు ఆసుపత్రుల్లోని అత్యవసర విభాగంలో వెంటిలేటర్‌పైనే ఉంచి డయాలసిస్ చేస్తూ చికిత్స కొనసాగిస్తున్నారు. ఇప్పటివరకు చనిపోయినవారిలో ఇద్దరు చిన్నారులూ ఉన్నారు. వారిలో మనోహర్ వయసు ఆరేళ్లు కాగా, జైకృత్‌రాజ్‌కు మూడేళ్లు.

**విస్తృత చైతన్యంతోనే..**

రాజమహేంద్రవరం నగరానికి వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 65 మంది వ్యాపారులు వచ్చి పాలు విక్రయిస్తున్నారు. కల్తీ ఘటన నేపథ్యంలో ఆ వ్యాపారంపై ప్రభావం పడింది. ప్రజలకు సైతం కల్తీపాలను గుర్తించే విధానంపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత యంత్రాంగంపై ఉంది. సందేహం వస్తే ఎలా తనిఖీ చేయాలి? ఎవరిని సంప్రదించాలో విస్తృత ప్రచారం చేపట్టాల్సి ఉంది. దీంతోపాటు మార్కెట్‌లో ఎప్పటికప్పుడు తనిఖీ చేసే వ్యవస్థ అందుబాటులోకి వస్తే భవిష్యత్తులో ఈ తరహా ఘటనలు నివారించే అవకాశముంది.

**అలా గుర్తించి..**

కోరుకొండ మండలం నరసాపురానికి చెందిన పాల వ్యాపారి గణేశ్వరరావు సరఫరా చేసిన పాలలో ఇథలీన్ గ్లైకాల్ కలవడంతో 20 మందికి పైగా ఆసుపత్రుల పాలైన విషయం తెలిసిందే. పరీక్షల్లో సీరం క్రియేటిన్ 8 నుంచి 11 వరకు ఉండడం, కిడ్నీలు దెబ్బతినడం గుర్తించారు. ఒకే కుటుంబం నుంచి నలుగురు ఆసుపత్రికి వెళ్లడంతో ఉదంతం వెలుగులోకి వచ్చింది. సమస్యకు కారణమేంటన్న అంశంపై స్పష్టత వచ్చేందుకూ సమయం పట్టింది. బాధితులకు ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డా.రవిరాజ్ పర్యవేక్షణలో చికిత్స అందించారు. హైదరాబాద్ నుంచి పలు విభాగాల నిపుణులు సైతం పరిశీలన చేసి పలు సూచనలు చేశారు.

## ఉమ్మడి జిల్లాలో ఆందోళన కలిగిస్తున్న హిట్ అండ్ రన్ కేసులు

**రాజానగరం:** గుర్తు తెలియని వాహనం ఢీకొని చనిపోయిన యువకుడు రాజానగరం పరిధిలో ఇటీవల ద్విచక్రవాహనంపై వెళ్తున్న యువకుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే చనిపోయాడు. గత నెల 26న రంగంపేట మండలం వడిశలేరు వద్ద ఇంటర్ పరీక్షలు రాసేందుకు బైక్‌పై వెళుతున్న ఇద్దరు విద్యార్థులను ఏదో వాహనం ఢీకొట్టింది. వారు తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలయ్యారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణ నష్టాలకు హిట్ అండ్ రన్ కేసులు కారణమవుతున్నాయి. వాహనాలతో ఢీ కొట్టిన తర్వాత గాయపడినవారిని పట్టించుకోకుండా ఉడాయిస్తున్నారు. గత రెండేళ్లలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 405 కేసులు ఇటువంటివే. గుర్తు తెలియని వాహనాలు ఢీకొనడంతో 136 మంది చనిపోయారు. తీవ్రంగా గాయపడ్డవారిని సకాలంలో ఆసుపత్రిలో చేర్చి ఉంటే కొందరి ప్రాణాలైనా నిలిచేవి. కేసుల నుంచి తప్పించుకోవాలని చూస్తున్నారు తప్ప ప్రాణం విలువ గుర్తించడంలేదు.

హైవేలపైనే అధికం..

జాతీయ రహదారులపైనే హిట్ అండ్ రన్ కేసులు ఎక్కువ. రాత్రి వేళల్లో వాహనాలతో ఢీకొట్టిన తర్వాత ఆపకుండా వెళ్లిపోతున్నారు. కూడళ్లలో సీసీ కెమెరాలు పనిచేయక వీటిని గుర్తించలేకపోతున్నారు. గతేడాది కాకినాడలో 12, సర్పవరం 12, సామర్లకోట 10, తుని తొమ్మిది, తిమ్మాపురం, ప్రత్తిపాడు, కోరింగ పరిధిలో అయిదేసి చొప్పున కేసులు నమోదయ్యాయి. అమలాపురం, ముమ్మిడివరం, రావులపాలెం, కొత్తపేట పరిధిలో రెండు నుంచి నాలుగు చొప్పున నమోదు చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొన్న కేసుల్లో బాధిత కుటుంబాలకు మోటారు వాహన చట్టంలోని సెక్షన్ 161 ప్రకారం పరిహారమిస్తున్నారు.ప్రమాద వివరాలతో ఆర్డీవో కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వ సాయానికి దరఖాస్తు చేయాలి. ప్రమాదం ఎక్కడ, ఎన్ని గంటలకు, ఎలా జరిగింది, చికిత్స బిల్లుల సమాచారం, ఎఫ్ఐఆర్ కాపీ, ఆధార్, బ్యాంకు ఖాతా, లీగల్ హెయిర్ వివరాలివ్వాలి. ఘటనా స్థలాన్ని తహసీల్దార్ పరిశీలించి ఆర్డీవోకు నివేదిస్తారు. కలెక్టర్ పరిశీలించి పరిహారం కోరుతూ కేంద్రానికి ప్రతిపాదిస్తారు. చనిపోయినవారికి రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున పరిహారమిస్తారు. కాకినాడ జిల్లాలో 47 మందికి ఇప్పటికే పరిహారం చెల్లించినట్లు రవాణాశాఖ ఉప కమిషనర్ శ్రీధర్ తెలిపారు. మరో 37 కేసులకు సంబంధించి దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయన్నారు

## అసంపూర్తి పనులతో అవస్థలు..

కోనసీమ జిల్లా కొత్తపేట మండలం వానపల్లి ఉన్నత పాఠశాలలో 495 మంది విద్యార్థులు 6 నుంచి 10 తరగతుల వరకు చదువుతున్నారు. ఒక్కో గదిలో 80 నుంచి 112 మందిని కూర్చోబెట్టి పాఠాలు చెప్పడం ఇబ్బందిగా మారింది. అదనపు గదులు, గ్రంథాలయం, ప్రయోగశాల, స్టోర్ రూం అవసరమని ఉపాధ్యాయులు కోరుతున్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత వేధిస్తోంది. వైకాపా ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పేరుతో చేపట్టిన పనుల్లో సగానికి పైగా అసంపూర్తిగా వదిలేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మన బడి-మన భవిష్యత్తు పేరుతో చర్యలు తీసుకుంటున్నా నిధుల సమస్య వెన్నాడుతోంది. ఉమ్మడి జిల్లాలోని పాఠశాలల్లో ప్రస్తుతం జరుగుతున్న పనులతో పాటు అదనపు వసతులకు సుమారు రూ.200 కోట్లు అవసరమం. నిధులిచ్చి ఈ వేసవిలోనే పూర్తిచేస్తే ఇబ్బంది ఉండదని ఉపాధ్యాయులంటున్నారు. 'మనబడి మన భవిష్యత్తు' పథకంలో ఇదివరకు మంజూరైన మరుగుదొడ్లు, తాగునీటి సరఫరా, వివిధ మరమ్మతులు, రంగులు వేయడం వంటి రూ.93 కోట్ల విలువైన పనులు ప్రస్తుతం జరుగుతు న్నాయి. బిల్లులు సకాలంలో అందక గుత్తేదారులు ముఖం చాటేస్తున్నారు. కొత్తగా మరో రూ.65 కోట్ల అదనపు పనులు మంజూరు చేశారు. ఇవి ఎప్పుడు మొదలవుతాయో తెలియదు.

**అదనపు గదులు నిర్మిస్తే...**

గత ప్రభుత్వంలో అవసరంలేని చోట సైతం గదులు మంజూరుచేశారు. సమీప పాఠశాలల్లో బడుల విలీనం చేయడంతో చాలాచోట్ల గదులు అసంపూర్తిగా ఉన్నాయి. ప్రస్తుతం ఆదర్శ ప్రాథమిక పాఠశాలల పరిధిలో 57, ఉన్నత పాఠశాలల్లో మరో వందకు పైగా అదనపు తరగతి గదులు కావాలి. కాకినాడ సమగ్ర శిక్ష ఇన్‌ఛార్జి ఏపీసీ రమేశ్ వద్ద ప్రస్తావించగా అందుబాటులో ఉన్న నిధులతో ప్రాధాన్య క్రమంలో పనులు పూర్తిచేస్తున్నామని, అదనపు తరగతి గదులకు ప్రతిపాదనలు పంపించామన్నారు

## గ్యాస్ సమస్యల పరిష్కారానికి కంట్రోల్‌రూం: డీఎస్‌వో



**రాజమహేంద్రవరం:** గ్యాస్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి జిల్లా కంట్రోల్‌రూం ఏర్పాటు చేసినట్లు పౌరసరఫరాల అధికారిణి (డీఎస్‌వో) వి.పార్వతి తెలిపారు. కలెక్టర్, జేసీ ఆదేశాల మేరకు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలతో జిల్లా యంత్రాంగం గ్యాస్ సరఫరా ప్రక్రియ పర్యవేక్షిస్తూ పంపిణీదారులకు తగు సూచనలు చేస్తున్నామన్నారు. వాణిజ్య అవసరాలకు బల్క్ ఎల్పీజీ సరఫరాను మాత్రమే పరిమితం చేయగా గృహావసరాలకు, అత్యవసర సేవలకు గ్యాస్ సరఫరా నిరంతరం జరుగుతుందని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో వదంతుల కారణంగా రీఫిల్ బుకింగ్‌లు పెరిగినా.. డెలివరీలు ఎఫ్ఐఎఫ్‌వో విధానంలో కొనసాగుతున్నాయని, కొన్నిచోట్ల తాత్కాలిక జాప్యం ఏర్పడినా సరిపడా నిల్వలు ఉన్నందున ఎటువంటి ఇబ్బందులు లేవని స్పష్టం చేశారు.

గ్యాస్ బుకింగ్‌కు ప్రత్యామ్నాయ నంబర్లు

వినియోగదారులు ఒకేసారి ఎక్కువగా గ్యాస్ బుకింగ్ చేయడం వల్ల కొన్నిచోట్ల సమస్య ఏర్పడుతోందన్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా కూడా గ్యాస్‌బుకింగ్ చేసుకునే అవకాశం ఉందని డీఎస్‌వో తెలిపారు. సంబంధిత ఆయిల్ కంపెనీల మొబైల్ యాప్‌ల ద్వారా కూడా బుకింగ్ చేసుకోవచ్చున్నారు. ముందుగా ఆయా కంపెనీల వాట్సాప్ నంబర్లకు హాయ్ అని వాట్సాప్ చేయాలన్నారు.

## ఒకే నూనె మళ్లీ మళ్లీ వినియోగం



**అమలాపురం:** నాణ్యతలేని ఆహార పదార్థాల విక్రయంపై కొన్నాళ్లుగా వినియోగదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇందులో ప్రధానంగా నూనెలను ఎక్కువసార్లు మరిగించి వాడుతుండటం ఆరోగ్యానికి చేటు కలిగిస్తోంది. జిల్లా వ్యాప్తంగా హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నిర్వాహకులు మాంసాహారం, ఇతర ఆహార పదార్థాలను వండేందుకు నూనెను భారీ మొత్తంలో వినియోగిస్తారు. ఒకే నూనెను అనేకసార్లు మరిగించడం వల్ల క్యాన్సర్ కారకాలు విపరీతంగా పెరుగుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. తాజా నూనెలో టోటల్ పోలార్ కాంపౌండ్స్(టీపీసీ) 5 నుంచి 7 శాతం ఉంటాయి. మరిగించే కొద్దీ ఈ సంఖ్య పెరుగుతుంది. 25 శాతానికి మించితే ఆరోగ్యానికి హానికరం. ఇది పెరిగే కొద్దీ హానికారక రసాయనాలు పెరుగుతాయి.

జిల్లాలో అధికారికంగా 250 వరకు హోటళ్లు, వెయ్యికి పైగా ఫాస్ట్‌ఫుడ్ దుకాణాలు నడుస్తున్నాయి. వీటిలో వంట నూనె చిక్కగా మారేవరకు ఎక్కువసార్లు వినియోగిస్తున్నారు. ఇటీవల ఆహార భద్రత, పురపాలక అధికారులు హోటళ్లపై దాడులు నిర్వహించి ఇలాంటి నూనెను స్వాధీనం చేసుకున్నారు.

**యుద్ధం నేపథ్యంలో..**

ముడి సరకుల దిగుమతులు ఆగిపోవడంతో స్థానిక మార్కెట్లో నూనెల ధరలు పెరిగాయి. కిలో ప్యాకెట్‌పై రూ.10 చొప్పున పెంచాయి. లూజు విక్రయ వ్యాపారులు లీటరుకు రూ.15 నుంచి రూ.30 వరకు పెంచారు. దీంతో హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ దుకాణదారులు ఎక్కువసార్లు వినియోగిస్తున్నారు.

**పాతనూనె కొనుగోలు..**

నూనె ఎక్కువసార్లు వినియోగించకుండా నివారించేందుకు చెన్నైకు చెందిన స్టార్ గ్లోబల్ సంస్థతో హోటళ్ల యజమానులకు అవగాహన కల్పించారు. వారు మూడు నుంచి నాలుగు సార్లు వినియోగించిన నూనెను లీటరు రూ.40 ఇచ్చి కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చారు. దీని బయోడీజిల్ తయారీలో వినియోగిస్తామని వారు తెలిపారు.

**25 కాదు.. 48 శాతం**

అమలాపురం గడియారస్తంభం కూడలికి సమీపంలోని రెస్టారెంట్‌లో కుళ్లిన మాంసాహారం పెట్టారని అందిన ఫిర్యాదు నేపథ్యంలో పురపాలక అధికారులు తనిఖీలు చేయగా మడ్డిలా మారిన వంట నూనెను స్వాధీనం చేసుకున్నారు.

అమలాపురంలోని ఇటీవల ఓ హోటల్‌లో తనిఖీలు చేసి పరిమితికి మించినసార్లు వాడిన వంట నూనె స్వాధీనం చేసుకున్నారు. దాని టీపీసీ 48 ఉండటం గమనార్హం.

రాజోలు నియోజకవర్గం పరిధిలోని ఓ నాన్‌వెజ్ దుకాణంలో నూనెను పరిశీలించగా టీపీసీ 42 శాతంగా నమోదైంది.

**డబ్బాలు పంపిణీ**

**-రామయ్య, ఆహార భద్రతాధికారి**

వినియోగించిన వంట నూనెను సేకరించేందుకు హోటళ్లకు డబ్బాలు పంపిణీ చేస్తున్నాం. ఈ అవకాశాన్ని నిర్వాహకులు సద్వినియోగం చేసుకోవాలి. ఎక్కడైనా మడ్డిలా మారిన నూనె వినియోగిస్తున్నట్లు గుర్తిస్తే వారి అనుమతులు రద్దు చేయడంతోపాటు చర్యలు తీసుకుంటాం.

## భర్త వేధింపులపై మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు

**కాకినాడ రూరల్:** భర్త వేధింపులపై ఓ కానిస్టేబుల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రమణయ్యపేట బాపన్నదొర కాలనీలో నివాసం ఉంటున్న వివాహిత, ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పోలవరపు దేవి ఫిర్యాదు మేరకు ఆమె భర్త సామర్లకోట మండలం పి.వేమవరం గ్రామానికి చెందిన శ్రీపతి మణికంఠపై సర్పవరం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్సై శ్రీనివాసకుమార్ కథనం ప్రకారం.. గతంలో వివాహమైన దేవి తన భర్త నుంచి విడాకులు తీసుకున్న తరువాత 2021లో మణికంఠను ద్రాక్షారామ ఆలయంలో ప్రేమ పెళ్లి చేసుకున్నారు. ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తడంతో భర్త తన మేనకోడలిని వివాహం చేసుకునే ప్రయత్నం చేయగా, అప్పట్లో బాధితురాలి ఫిర్యాదు మేరకు 2024 మార్చి 5న సర్పవరం పోలీసులు కేసు నమోదు చేసి అతన్ని అరెస్ట్ చేశారు. రిమాండ్ అనంతరం బెయిల్‌పై బయటకు వచ్చాడు. కోర్టులో వాదోపవాదాల అనంతరం ఈ ఏడాది జనవరిలో కేసు కొట్టివేశారు. ఈ నేపథ్యంలో మేనకోడలిని మణికంఠ రెండో వివాహం చేసుకున్నాడని, అతని కుటుంబ సభ్యులు తనను దూషించి, కొట్టి బెదిరింపులకు గురిచేసినట్టు దేవి మరోసారి పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వివరించారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**కోరుకొండ:** స్థానిక బూరుగుపూడి సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. కోరుకొండ ఎస్సై ఆర్.అంకారావు కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం ఇన్నీసుపేటకు చెందిన బొర్రా ప్రభాకరరావు (59) గోకవరం నుంచి మోటారు సైకిల్‌పై బయలు దేరారు. ఈ నేపథ్యంలో ఎదురుగా వస్తున్న మోటార్ సైకిలిస్ట్ ఢీకొనడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రభాకరరావు రోజూ గోకవరం, కోరుకొండ మండలాల్లో దుస్తులు అమ్ముతుంటాడు. ఇతనికి భార్య, కూతురు, కొడుకు ఉన్నారు. రోజూలానే గురువారం దుస్తులు విక్రయించి తిరిగి రాజమహేంద్రవరం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేయనున్నట్టు ఎస్సై వివరించారు.

## మున్సిపల్ అధికారులను ప్రశ్నించిన వర్మ



**పిఠాపురం:** పిఠాపురంలో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఫొటోకు సరైన గౌరవం దక్కడం లేదని మాజీ ఎమ్మెల్యే వర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మున్సిపల్ కల్యాణ మండపంలో 'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర'లో భాగంగా పారిశుద్ధ్య కార్మికుల శిక్షణ కార్యక్రమ ఫ్లెక్సీలో ముఖ్యమంత్రి ఫొటో చిన్నదిగా వేయడంపై వర్మ అభ్యంతరం తెలిపి మున్సిపల్ అధికారులను నిలదీశారు. ఆయన స్టేజీ ఎక్కినప్పటికీ తెదేపా నాయకులు గొడవ చేయడంతో స్టేజీ దిగాల్సివచ్చింది. కార్యకర్తలు, నాయకులు కూడా అధికారుల తీరుపై మండిపడ్డారు. అనంతరం వర్మ మాట్లాడుతూ సంక్రాంతి సంబరాల్లో సీఎం ఫొటో పెట్టలేదని, ఈ రోజు కార్యక్రమంలో రెవెన్యూ స్టాంప్‌సైజ్ ఫొటో వేసినట్లు సీఎం ఫొటో వేస్తున్నారన్నారు. మా నాయకుడి ఫొటో లేకపోతే మాకు బాధగా ఉంటుందన్నారు. ఇలాంటి తప్పులను అధికారులు సరిచేసుకోవాలన్నారు.

## శంఖవరంలో పెద్దపులి జాడ



**ప్రత్తిపాడు, శంఖవరం :** పెద్ద పులి స్వైర విహారం చేస్తూ ప్రత్తిపాడు, శంఖవరం మండలాల ఉపప్రణాళిక మన్యంలో యంత్రాంగాన్ని శుక్రవారం ఉరుకులు పరుగులు పెట్టించింది. డీఎఫ్‌వో ఎన్.రామచంద్రరావు నేతృత్వంలో ఎన్ఎస్‌టీఆర్, వెటర్నరీ, రెస్క్యూ బృందాలు పులి జాడను గమనిస్తూ బంధించే ఏర్పాట్లు చేశారు. తాడువాయి వద్ద పశువును వేటాడాక మాసంపల్లి, రాజారం మధ్య రోజంతా మాటు వేయడంతో దానిని ఎరవేసి బంధించేందుకు ఏర్పాట్లు చేసినా ఫలితం దక్కకుండా పోయింది. దిశమార్చుకుని రాజారం, గొంది, జి.కొత్తపల్లి మీదుగా అచ్చంపేట అటవీ ప్రాంతానికి చేరుకుంది.. ఈ క్రమంలో బవురువాక కొత్తపల్లి పలుచోట్ల అధికారులు, గ్రామస్థులకు కనిపించింది. వీఆర్‌వో దొంగబాబు, మాసంపల్లి గ్రామస్థులు సమీప దూరంలో వెళ్లడం చూశామని చెప్పారు. పొదురుపాకకు చెందిన స్కూలు బస్సు డ్రైవరు అర్జున్ జి.కొత్తపల్లి మీదుగా వస్తుండగా బొమ్మ వద్ద మలుపులో పులి రహదారిని దాటుతూ కనిపించిందన్నారు. పులిని బంధించే ఏర్పాట్లలో ఉన్నామని ఆపరేషన్‌కు సారథ్యం వహిస్తున్న డీఎఫ్‌వో రామచంద్రరావు తెలిపారు.

## వైద్యుల నిర్లక్ష్యంతో చిన్నారి మృతి

**బాధిత కుటుంబ సభ్యుల ఆరోపణ**

**రాజవొమ్మంగి:** మండలంలోని గొబ్బిలమడుగు గ్రామానికి చెందిన మూడు నెలల చిన్నారి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. కాగా ఆ చిన్నారి తల్లిదండ్రులు అనుపమ, నాగేంద్రలు తమ పాప వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే మరణించిందని ఆరోపిస్తున్నారు. చిన్నారి ఊపిరి పీల్చుకోవడానికి ఇబ్బంది పడుతుంటే, ఈ నెల 5న మండలానికి దగ్గరలోని ఏలేశ్వరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చూపించామన్నారు. అక్కడి నుంచి ఏలేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రికి, ఆ తరువాత కాకినాడ జీజీహెచ్‌కు తీసుకు వెళ్లామన్నారు. చిన్నారికి తల్లీ బిడ్డ వార్డులో వెంటిలేటర్‌పై చికిత్స అందించారని, ఆ తరువాత పాప బాగానే ఉన్నప్పటికీ రక్తం ఎక్కించారని వాపోయారు. మూడు నెలల చంటి బిడ్డకు రక్తం ఎక్కించడం వల్లనే చనిపోయిందని తల్లి అనుపమ కన్నీరు పెట్టుకొంది. మరోవైపు పాపకు శిక్షణ పొందుతున్న జూనియర్ వైద్యులు చికిత్స చేశారని, దీనితో అల్లారు ముద్దుగా చూసుకుంటున్న తమ మొదటి కాన్పు బిడ్డ తమకు కాకుండా తనువు చాలించిందని తల్లిదండ్రులు దుఃఖించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో తమ వంటి ఆదివాసీలకు సకాలంలో, సరైన వైద్యం లభించడం లేదని, దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటువంటి కష్టం మరో తల్లికి రాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు.

## ఆంధ్ర వాలీబాల్ టీం కెప్టెన్‌గా లక్ష్మి

**రంగంపేట:** ఢిల్లీ రాష్ట్రంలోని పీతంపూర్‌లో ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకూ జరిగే ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ వాలీబాల్ టోర్నమెంట్‌కు ఆంధ్రప్రదేశ్ నుంచి కెప్టెన్‌గా రంగంపేట మండలం జి.దొంతమూరు హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయురాలు ఇ.లక్ష్మి ఎంపికయ్యారని పాఠశాల హెచ్‌ఎం కేవీ రమణారావు చెప్పారు. గురువారం ఆయన ఆ హైస్కూల్‌లో మాట్లాడుతూ మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో అనేక టోర్నమెంట్లలో పాల్గొన్న లక్ష్మి ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ వాలీబాల్ టోర్నమెంట్ కెప్టెన్‌గా వ్యవహరించే అవకాశం రావడం అభినందనీయమని అన్నారు. దేశ వ్యాప్తంగా 28 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొంటున్నారని, ఆంధ్రప్రదేశ్ నుంచి పాల్గొనే అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వ సివిల్ సర్వీసెస్ అధికారులకు లక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. ఆమెను గ్రామ సర్పంచ్ గోలి రమణ, ఎంపీటీసీ సభ్యుడు జి.వెంకటకృష్ణ, విద్యా కమిటీ చైర్మన్ ఎస్‌వీఎస్ నారాయణ, మండల విద్యాశాఖ అధికారులు కె.శ్రీనివాసరావు, పి.మధుసూదనరావు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

## బాల్య వివాహం అడ్డగింపు

**పిఠాపురం:** స్థానిక కత్తులగూడెంలో నిర్వహించ తలపెట్టిన బాల్య వివాహాన్ని గురువారం అధికారులు అడ్డుకున్నారు. పట్టణానికి చెందిన బాలికకు (14) గుంటూరుకు చెందిన వ్యక్తితో అన్నవరంలో ఈ నెల 14న వివాహం చేసేందుకు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో బాల్య వివాహం జరుగుతుందని సమాచారం అందుకున్న ఐసీడీఎస్, బాలల పరిరక్షణ విభాగం అధికారులు బాలిక ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం బాలికను స్థానిక పోలీసుల సహాయంతో కాకినాడలోని బాలల సంరక్షణ గృహానికి తరలించారు.

## ప్రయాణికుల సౌకర్యాలే లక్ష్యంగా కాకినాడ టౌన్ స్టేషన్ అభివృద్ధి



**కాకినాడ రూరల్ విశాఖ సమాచారమ్ :** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమృత్ భారత్ పథకం ద్వారా దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ సీనియర్ డివిజనల్ ఇంజనీర్ (నార్త్) చుండూరి గౌతమ్ తెలిపారు. ఇందులో భాగంగా కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ అభివృద్ధికి కేంద్రం రూ.50 కోట్లను కేటాయించిందని పేర్కొన్నారు. శనివారం స్టేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. మొదటి విడతలో సుమారు రూ.31 కోట్లతో నిర్మించిన పలు సౌకర్యాలను పరిశీలించి వివరాలు తెలిపారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా పార్కింగ్, గ్రీనరీ, వేచివుండే సౌకర్యాలు, వికలాంగుల కోసం ఆధునిక మరుగుదొడ్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. స్టేషన్ బయట భాగంలో తెలుగు ప్రముఖుల చిత్రాలను పెయింటింగ్‌ల రూపంలో అలంకరించామని తెలిపారు. రెండో ప్లాట్‌ఫారం వైపు మరో రూ.20 కోట్లతో పనులు త్వరలో ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ సమావేశంలో ఏసీఎం పి.శివప్రసాద్, సీనియర్ డిఎన్‌హెచ్‌ఎం ఎం.వంశీకాంత్, పిఆర్‌వో నుస్రత్ మంద్రుప్కర్, టౌన్ రైల్వే స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

(1) ప్రకటన నెం. GEM/2026/B/7327904, తేదీ 07.03.2026

**పని పేరు:** వాల్తేరు డివిజన్‌లో KR లైను & RV లైను సెక్షన్ యొక్క అధికారిక విధులు నిర్వర్తించుటకు, ఇనస్పెక్షన్ మరియు మెయింటెనెన్స్‌నకు సంబంధించి సీనియర్ డివిజనల్ ఇంజనీరు/ నార్తు/ వాల్తేరువారి కొరకు 01 (ఒకటి) నాన్-ఏ.సి. రోడ్డు వాహనం (MUV) టాటా సుమో/ మహీంద్రా బొలెరో లేదా తత్సమానమైనది 36 నెలలు కాలంనకు అద్దెకు సరఫరా చేయుట.

**సుమారు పని విలువ:** రూ.20,00,340/-
**బయానా:** రూ.40,100/-

(2) ప్రకటన నెం. GEM/2026/B/7329836, తేదీ 07.03.2026

**పని పేరు:** వాల్తేరు డివిజన్‌లో RV లైను సెక్షన్ యొక్క అధికారిక విధులు నిర్వర్తించుటకు, ఇనస్పెక్షన్ మరియు మెయింటెనెన్స్‌నకు సంబంధించి అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరు/ రాయగడ వారి కొరకు 01 (ఒకటి) నాన్-ఏ.సి. రోడ్డు వాహనం (MUV) టాటా సుమో/ మహీంద్రా బొలెరో లేదా తత్సమానమైనది 36 నెలలు కాలంనకు అద్దెకు సరఫరా చేయుట.

**సుమారు పని విలువ:** రూ.20,00,340/-
**బయానా:** రూ.40,100/-

(3) ప్రకటన నెం. GEM/2026/B/7330133, తేదీ 07.03.2026

**పని పేరు:** వాల్తేరు డివిజన్‌లో KR లైను సెక్షన్ యొక్క అధికారిక విధులు నిర్వర్తించుటకు, ఇనస్పెక్షన్ మరియు మెయింటెనెన్స్‌నకు సంబంధించి అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరు/ లక్ష్మీపూర్ రోడ్ వారి కొరకు 01 (ఒకటి) నాన్-ఏ.సి. రోడ్డు వాహనం (MUV) టాటా సుమో/ మహీంద్రా బొలెరో లేదా తత్సమానమైనది 36 నెలలు కాలంనకు అద్దెకు సరఫరా చేయుట.

**సుమారు పని విలువ:** రూ.23,33,052/-
**బయానా:** రూ.46,700/-

**టెండరు డాక్యుమెంట్ ఖరీదు:** రూ.3,540/- (ఒక్కొక్క వ.నెంబరుకు)

**పని పూర్తిచేయు కాలం:** 36 (ముప్పై ఆరు) నెలలు (అన్ని వ.నెంబర్లకు)

**టెండరు ముగింపు తేదీ మరియు సమయం:** 30-03-2026న 15:00 గంటలు (అన్ని వ.నెంబర్లకు)

పోస్టు/ కొరియర్/ ఫ్యాక్స్ లేదా స్వయంగా ఇట్టి ఇ-టెండర్లకు సంబంధించి మాన్యువల్ ఆఫర్లను తమ సంస్థ లెటర్‌హెడ్స్ పైన సకాలంలో అందునట్లు పంపినప్పటికీ అంగీకరించబడవు. అట్టి మాన్యువల్ ఆఫర్లు అన్నియూ చెల్లుబాటుకానివిగా పరిగణిస్తారు మరియు ఎలాంటి పరిశీలన లేకుండానే తప్పక తిరస్కరించబడతాయి.

పై ఇ-టెండర్లకు సంబంధించిన ఇ-టెండరు డాక్యుమెంట్లుతో పాటు పూర్తి సమాచారం లభించు వెబ్‌సైట్: http://gem.gov.in

**సూచన:** ఈ టెండరునకు ఏదైనా మార్పు/ సవరణ జారీ చేయబడినదేమో తెలిసుకొనుటకు టెండరు ముగింపు తేదీకి 10 (పది) రోజులు ముందు వెబ్‌సైట్‌ను మరొకసారి చూడవలసినదిగా విశ్వసనీయ టెండరుదారులకు సలహా ఇవ్వటమైనది.

**సీనియర్ డివిజనల్ ఇంజనీరు (నార్తు)**
PR-1220/Q/25-26 **వాల్తేరు**


## పదవ తరగతి పరీక్షల నిర్వహణకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు

**- జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా**



**అనకాపల్లి,(విశాఖ సమాచారం బ్యూరో):-** రాబోయే ఎస్.ఎస్.సీ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (మార్చి 16 నుండి ఏప్రిల్ 1 వరకు) శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ప్రకటించారు.జిల్లాలో మొత్తం పరీక్షా కేంద్రాలు 102 కాగా,మొత్తం విద్యార్థులు 21,017 మందిలో బాలురు10,673, బాలికలు 10,344 అని తెలిపారు.పరీక్షా సమయం ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:45 వరకు అని,విద్యార్థులు ఉదయం 9:00 గంటలకే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి అని,పరీక్ష పూర్తయ్యే వరకు విద్యార్థులను బయటకు పంపడం జరగదు అని ఆయన తెలియజేశారు.హాల్ టికెట్ లేనిదే లోపలికి అనుమతి లేదు అని,మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, క్యాలిక్యులేటర్లు, బ్లూటూత్ పరికరాలు మరియు ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లను పరీక్షా కేంద్రంలోకి తీసుకురావడం పూర్తిగా నిషిద్ధం అని అన్నారు.అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. కేంద్రాల పరిసరాల్లో ప్రజలు గుమికూడరాదు,

పరీక్షా సమయంలో కేంద్రాల సమీపంలోని జిరాక్స్ మరియు ఇంటర్నెట్ షాపులను మూసివేయాలని ఆదేశాలు జారీ చేశాం,చీఫ్ సూపరింటెండెంట్ మినహా మరెవ్వరూ (సిబ్బందితో సహా) పరీక్షా కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు తీసుకురాకూడదు, సమస్యాత్మక మరియు సున్నితమైన కేంద్రాల వద్ద ప్రత్యేక పోలీసు నిఘా ఏర్పాటు చేశాం అని ఆయన అన్నారు.మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడే వారిపై "ఏపీ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ యాక్ట్, 1997" ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.విద్యార్థుల కోసం పరీక్షా కేంద్రాలలో తాగునీటి సౌకర్యం కల్పించడమైంది. అభ్యర్థులు తమ బ్యాగులు మరియు వ్యక్తిగత వస్తువుల భద్రతను స్వయంగా చూసుకోవాలి.ఈ సందర్భంగా పరీక్షలు వ్రాస్తున్న విద్యార్థులందరికీ అనకాపల్లి జిల్లా పోలీసు విభాగం తరపున ఆల్ ది బెస్ట్ తెలిపారు.

## ఈ నెల 23న స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనకు ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి ఐటీ శాఖ మంత్రి రాక

**-రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత**



**నక్కపల్లి (విశాఖ సమాచారం):-** పాయకరావుపేట నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేస్తున్నట్లు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు.నక్కపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు, క్లస్టర్, యూనిట్ ఇన్చార్జిలతో శనివారం ఆమె సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా యస్.రాయవరం మండలం పెద్ద ఉప్పలం లింగరాజుపాలెం మధ్య బ్రిడ్జ్ నిర్మాణానికి రూ.13 కోట్లు,కోటవురట్ల మండలం ఇందేశమ్మవాక వద్ద కొండను తొలిచి రోడ్డు నిర్మాణానికి రూ.16 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని రూ.32.80 కోట్లతో 100 పడకల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేయడంతో పాటు ట్రోమా కేర్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.అలాగే పెనుగొల్లు ఆసుపత్రి అభివృద్ధికి రూ.50 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు.నక్కపల్లి మండలంలో 'స్వయం' పేరుతో డ్రై ఫిష్ యూనిట్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.ఈ నెల 23న స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేష్ విచ్చేస్తారని తెలిపారు.స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో నాయకులు సంసిద్ధంగా ఉండాలని మంత్రి పిలుపునిచ్చారు.

## ఆర్క్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్లు అందజేత



**చోడవరం (విశాఖ సమాచారం):-** చోడవరం ఆర్క్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యం లో ఆర్క్ ప్రసాద్ అధ్యక్షతన,పూర్వపు వైస్ ఛాన్సలర్ ఆచార్య ముర్రు ముత్యాల నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జన సేన పార్టీ ఆవిర్భావ సభ లో ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు ఉపాధి అవకాశం గా కుట్టు మిషన్స్ పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ సమావేశానికి రాష్ట్ర శిష్ట కరణ సంఘం (పట్నాయక్)అధ్యక్షులు అక్కు మహంతి రాజా ప్రత్యేక అతిథిగా,చోడవరం అర్బన్ జనసేన అధ్యక్షులు రమేష్, ప్రాథమిక వ్యవసాయ సంఘం అధ్యక్షులు గునూరు మూలునాయుడు,సీనియర్ నాయకులు గునూరు.సూర్యనారాయణ,అడ్వకేట్ చీపురుపల్లి సూర్యనారాయణ, సింగంపల్లి రమేష్,డి.శ్రీనివాస్, రాష్ట్ర సంఘం జనరల్ సెక్రటరీ గౌరీశ్వర రావు,మహిళా ప్రతినిధి కవిత,తిరుపతి రావు,సత్యారావు,విశ్వేశ్వర రావు,టీచర్ శ్రీనివాస్,మాడుగుల రాజకుమార్,శేష గిరి,అనకాపల్లి శ్రీకాంత్,గోపాల పట్నం గణేష్,విజయనగరం రామచంద్ర రావు,నూక రాజు ఇతర సభ్యులు హాజరైనారు..ఆచార్య ముత్యాల నాయుడు మాట్లాడుతూ పవన్ కల్యాణ్ గ్రామీణ ,ఆదివాసీ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలతో..ప్రాథమిక సదుపాయాలు రోడ్లు,తాగునీరు, ఆరోగ్యం లాంటి ప్రధాన సమస్యలు పరిష్కారం జరుపుతున్నారు.యువతకి స్ఫూర్తి గా చైతన్యం దిశగా పని చేస్తున్నారు.డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అని ముత్యాల నాయుడు అన్నారు. రాజా మాట్లాడుతూ ఉమ్మడి ప్రభుత్వం పవన్ కళ్యాణ్ స్ఫూర్తి తో మరింత మెరుగైన స్థాయిలో పనిచేస్తుంది అన్నారు.వీరమహిళలైన రమా దేవి,శైలజ కుటుంబాలకు కుట్టు మిషన్లు అందించేశారు.వందన సమర్పణ రాష్ట్ర శిష్ట కరణ సంఘం జనరల్ సెక్రటరీ గౌరీ శంకర్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ పదవ తరగతి విద్యార్థులతో ముఖాముఖి

**అనకాపల్లి (విశాఖ సమాచారం బ్యూరో):-** జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయ్ కృష్ణన్ పదవ తరగతి విద్యార్థులను ఉద్దేశించి తగు సూచనలు ఇచ్చారు. ప్రతి పాఠశాల లో ప్రధానోపాధ్యాయులు వారు ఐ ఎఫ్ పి ప్యానల్ ద్వారా సుమారు 14,056 మంది విద్యార్థులతో వారికి పరీక్షల్లో భయం పోగొట్టే విధంగా తగు సూచనలు తెలియజేశారు.పరీక్షలు అంటే మనం నిత్యము రాస్తున్న పరీక్షలు మాత్రమేనని వారికి అభినందనలు తెలుపుతూ మన జిల్లా ను ముందంజ లో ఉంచాలని తెలియజేసారు. కావున విద్యార్థులను ఎవరికి ఎటువంటి సందేహాలను సంబంధిత ఉపాధ్యాయుని అడిగి నివృతి చేసుకొని జిల్లాను మొదటి స్థానంలో ఉంచవలసిందిగా కోరారు.ఈ కార్యక్రమములో సంయుక్త కలెక్టర్ శౌర్య మన పటేల్,జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు, ఈ కార్యక్రమంలో 272 ఉన్నత పాఠశాలల నుండి సుమారు 14056 మంది విద్యార్థులు ,మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు వారు తెలియజేసారు.



## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం - అగ్రికల్చర్, ఇండస్ట్రీల కలయికతో జిల్లా అభివృద్ధి

**జిల్లా వ్యాప్తంగా రూ.134.27 కోట్లు రైతుల ఖాతాల్లో జమ**
**- జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయ క్రిష్ణన్**



**అనకాపల్లి, (విశాఖ సమాచారం బ్యూరో):-** అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ పథకం కింద జిల్లావ్యాప్తంగా రూ.134.27 కోట్ల నిధులు 2,42,536 మంది రైతుల ఖాతాల్లో నేడు జమ కానున్నట్లు జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ పేర్కొన్నారు. జిల్లా స్థాయి అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ మూడవ విడత పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక అనకాపల్లి పట్టణం గుండాల వీధి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన (ఆర్ ఎ ఆర్ ఎస్ ) కేంద్రంలో శుక్రవారం సాయంత్రం స్థానిక శాసనసభ్యులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు, రైతులతో కలసి ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తుందన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో వ్యవసాయం, హార్టికల్చర్, పరిశ్రమలు, మైనింగ్ వంటి అన్ని రంగాలు కీలకమైనప్పటికీ, ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర జనాభాలో దాదాపు 50 శాతం మంది ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వ్యవసాయంపైనే ఆధారపడి ఉన్నందున, రైతు సంక్షేమమే ధ్యేయంగా పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు.గత ఏడాది కాలంగా స్థానిక శాసనసభ్యులు చొరవతో జిల్లా యంత్రాంగం చేపట్టిన సాగునీటి కాలువల పూడికతీత, జల వనరుల సంరక్షణ -పనులపై ప్రత్యేక ప్రశంసలు తెలిపారు. ఐదు-ఆరేళ్ల విరామం తర్వాత 'వాటర్ యూజర్ అసోసియేషన్స్' పునరుద్ధరించి, సాగునీటి నిర్వహణను మెరుగుపరిచారని కలెక్టర్ అన్నారు. గతంలో శంకరం వంటి ప్రాంతాలు వరదలతో తీవ్రంగా మునిగిపోయేవని, వేసవిలోనే ప్రధాన కాలువలు, చెరువుల్లో పూడికతీత (డీసిల్టేషన్) పనులు పూర్తి చేయడం వల్ల ఈ ఏడాది భారీ వర్షాలు కురిసినా పంట నష్టం కలగలేదని వివరించారు. ఇరిగేషన్, అగ్రికల్చర్, మైనింగ్ మరియు డ్వామా శాఖలు సమన్వయంతో పని చేయడం వల్లే ఈ విజయం సాధ్యమైందని కొనియాడారు.రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని జల వనరులను కాపాడుకోవడానికి ప్రభుత్వం తీసుకునే చర్యలకు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. మన ఊరిలోని నీటి వనరులను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమం రైతులందరికీ భరోసా ఇస్తుందని,రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తామని అన్నారు.గతంలో ఎన్నడూ లేని విధంగా ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోపే నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని వెల్లడించారు. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ మరియు ఇతర నగర ఉద్యోగాల నుండి రిటైర్ అయిన వారు కూడా తిరిగి గ్రామాలకు వచ్చి వ్యవసాయం చేయాలని కోరుకుంటున్నారని, ఇది శుభపరిణామమని అన్నారు. "నేను ఒక రైతును" అని గర్వంగా చెప్పుకునే రోజులు రావాలని, సమాజంలో రైతులకు ఇచ్చే గౌరవం పెరగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పివీఎన్ మాధవ్, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్లా సురేంద్ర, అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద్ సత్యనారాయణ,

## పవన్ కళ్యాణ్ ఆశయాలే మాకు మార్గదర్శకం - ఎమ్మెల్యే పంతం నానాజీ



**కాకినాడ రూరల్ విశాఖ సమాచారమ్ :** విలువల రాజకీయాలకు నిలువుటద్దం పవన్ కళ్యాణ్ అని, ఆయన ఆశయాలు, మార్గదర్శకత్వంలో కాకినాడ రూరల్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని పంతం నానాజీ అన్నారు. జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు కాకినాడ రూరల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వ వైఫల్యాలపై తీవ్రంగా స్పందించిన నానాజీ, "ఒక్క ఛాన్స్" అంటూ అధికారంలోకి వచ్చిన వారు రాష్ట్రాన్ని సుమారు రూ.10 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టేశారని విమర్శించారు. సాగునీటి రంగం నుంచి పౌర సరఫరాల వరకు అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవస్థలను గాడిలో పెట్టడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. తన నియోజకవర్గ అభివృద్ధిపై ప్రతిపక్షాలకు బహిరంగ సవాల్ విసిరిన ఆయన స్వల్ప కాలంలోనే సుమారు రూ.200 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పించామని, దాదాపు రూ.400 కోట్లతో ప్రజలకు నేరుగా లబ్ధి చేకూర్చామని తెలిపారు. నేను చెప్పిన ఈ పనులు జరగలేదని ఎవరైనా నిరూపిస్తే వచ్చే ఎన్నికల్లో ఓటు అడిగే అర్హత నాకు ఉండదు. ప్రజల కోసం నిరంతరం శ్రమించడమే మా డీఎన్ఏలో ఉంది అని స్పష్టం చేశారు. రాష్ట్రం మళ్లీ పూర్వవైభవం సంతరించుకోవాలంటే టీడీపీ జనసేన బీజేపీ కూటమి మరో 10 నుంచి 15 సంవత్సరాలు అధికారంలో ఉండాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన జెండా ప్రతి గ్రామంలో రెపరెపలాడాలని పార్టీ సభ్యత్వాన్ని భారీగా పెంచాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో జనసేన నాయకులు, వీర మహిళలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బహిరంగ చర్చకు మేము సిద్ధం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారం):** ఆంధ్ర యూనివర్సిటీలో అతిథి అధ్యాపకులు చేస్తున్న నిరసన దీక్షలను ఆంధ్ర యూనివర్సిటీ రిజిస్ట్రార్ సరియైనది కాదని అనడం సమంజసం అతిథి అధ్యాపకుల సంఘం కోరుతున్నది. ముఖ్యంగా ఆంధ్ర యూనివర్సిటీలో కూటమి ప్రభుత్వము అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటి ఇన్చార్జ్ వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ శశి భూషణ్ రావు ఆధ్వర్యంలో సిక్స్ మాన్ కమిటీతో ఇంటర్వ్యూలు నిర్వహించి సెలక్షన్ కమిటీ ద్వారా అతిథి అధ్యాపకులను తీసుకుంటూ అనేది జరిగినది అదే రకంగా సె నెట్ హాల్ లో జరిగినటువంటి అతిథి ఆధ్యాపకుల సమావేశంలో అప్పటి ఇంచార్జ్ వైస్ ఛాన్సర్ శశి భూషణ్ రావు మరియు రిజిస్ట్రార్ ధనుంజయ , ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొ. నరసింహారావు ల ఆధ్వర్యంలో పేపర్ కి లక్ష రూపాయలు మరియు 80000 చొప్పున పెంచుతామని హామీ ఇచ్చారు. తర్వాత పరిణామములు ఫుల్ టైం వైస్ ఛాన్సర్గా వచ్చినటువంటి ప్రొఫెసర్ జిపి రాజశేఖర్ వేతనాలు పెంచక కాలయాపన చేస్తూ వచ్చారు. 8 సంవత్సరాలు గడుస్తున్న వేతనాలు పెంచకపోవడంతో జీవన ప్రమాణాలు స్థాయి ఎక్కువగా ఉండటం వలన రాష్ట్ర ప్రభుత్వం లోనే మినిస్టర్లకి మరియు విశాఖపట్నంలోని ఎమ్మెల్యేలు ఎంపీలు కి వినతి పత్రాలు సమర్పించి , శత జయంతి ఉత్సవాలు సందర్భంగా అతిథి అద్యపకులందరికీ నెలవారి జీతాలు ఇవ్వాల్సిందిగా కోరటం జరిగింది. దీనికి అధికారుల పక్షం నుంచీ స్పందన లేకపోతే గత 28 రోజుల నుంచి నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. వినూత్నంగా కూర గాయలు మార్ట్ ఏర్పాటు చేయటం, వంటా వార్పు కార్యక్రమాల్ని ఏర్పాటు చేసి వినూత్నంగా కార్యక్రమాన్ని ఏర్పాటుచేసి నిరసన తెలియ జేశారు. గత వైస్ ఛాన్సర్ ఇచ్చినటువంటి హామీనే ప్రస్తుత వైస్ ఛాన్సర్లు పక్కన పెట్టడం వల్ల అతిథి అధ్యాపకులల్లో అనైక్యతకు ప్రధాన కారణం. దాని వలన ఈ నిరసన కార్యక్రమాలు అన్నవి చేస్తున్నట్టు మనం చూస్తూ ఉన్నాం. మరియు అతిథి అధ్యాపకులు వ్యక్తిగత దూషణలు కూడా చేస్తున్నారు అని కూడా ఆరోపించారు. దీనికి ప్రధాన కారణము ఆంధ్ర యూనివర్సిటీలోని వైస్ ఛాన్సర్ మరియు రిజిస్ట్రారు తీసుకున్నటువంటి కొన్ని నిర్ణయాలు ఏకపక్షంగా ఉండటం వలన ఈ యొక్క అభియోగాలు చేయవలసినది వచ్చినది. ముఖ్యంగా ఆంధ్ర యూనివర్సిటీలో సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్ మరియు డెల్టా స్టడీస్ అదే రకంగా ఎంటెక్ కోర్సులను ఆంధ్ర యూనివర్సిటీ లో మూసివేసి గీతం యూనివర్సిటీలో తెరవడం అనేది జరిగింది . పై విషయాలు వలన గీతం యూనివర్సిటీకి లబ్ధి చేకూర్చే విధంగా వీసీ, రిజిస్ట్రర్లు వ్యవహరించారని క్లియర్ గా అర్థమవుతుంది. దీని వలనే కొంత యూనివర్సిటీ లో ఉన్నటువంటి అన్ని వర్గాల్లో అధికారుల మీద అసంతృప్తి ఉన్నది , అదే రకంగా ఆంధ్ర యూనివర్సిటీ కి దాతలు ఇచ్చినటువంటి భూమిని కూడా విశాఖపట్నం ఎంపీ భరత్ బినామీకి కట్టబెట్టే విధంగా రెండు పెట్రోల్ బంకులకు స్థలాలు కేటాయిస్తూ అనుమతి కోసం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్లో పెట్టిన సంగతి తెలిసిన విషయమే. దీని మీద అతిథి అధ్యాపకుల సంఘం కట్టుబడి ఉందని మరియు బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని తెలియజేస్తూ ఉంది. ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ ఖరగ్పూర్ ఐఐటీ నుంచి ఇక్కడకు తమ ఉద్యోగం నిర్వహించేందుకు వచ్చి, ఇక్కడ పని చేస్తున్నటువంటి అతిథి అధ్యాపకుల్ని ఉద్యోగం నుంచి తొలగిస్తానని బెదిరించడం సమంజసం కాదని ఈ సందర్భంగా తెలియ చేస్తున్నాము. ఈ సందర్భంగా ఆంధ్ర యూనివర్సిటీలో ఏ ఉద్యోగస్తులు కూడా సంతృప్తికరంగా లేరు ముఖ్యంగా కన్సాలిడేటెడ్ ఉద్యోగులు, 28 రోజుల వారు మరియు టైం స్కేల్ వారు అసిస్టెంట్ ప్రొఫెసర్ కాంట్రాక్ట్ ,మరియు అతిథి అధ్యాపకుల అందరు కూడా శత జయంతి ఉత్సవాల సందర్భంగా న్యాయం జరగవలసిందిగా కోరుతున్నాం, లేని పక్షంలో మాకు కొత్త వైస్ ఛాన్సర్ కోసం పోరాటం చేయవలసిన అవసరం ఉంటుంది అని అతిథి అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎం సురేష్ మీనన్ తెలియ జేశారు.

## కొవ్వూరు రూరల్ ఎస్సై ఆధ్వర్యంలో గ్రామసభ



**విశాఖ సమాచారం:** తూర్పుగోదావరి జిల్లాలోని కొవ్వూరు మండలం లో ఉన్న చిడిపి గ్రామంలో ఈరోజు న కొవ్వూరు ఎస్సై శ్రీహరి ఆధ్వర్యంలో గ్రామసభ జరిగినది. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ చిడిపి గ్రామంలో ఉన్న మెయిన్ రోడ్ వద్ద ఉన్న ర్యాంపు వల్ల ఆర్&బి రోడ్లో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని వాటిని పరిశీలించాలి అని అడగగ ఎస్సై మాట్లాడుతూ స్పీడ్ బ్రేకర్లు వేయాలని , అందువల్ల మీరు ముందుకు వచ్చి అడిగితే మా ద్వారా మేము వేయిస్తాము అని అన్నారు.మరొక్క సమస్య అయినా ఇసుక లారీలు గురించి మాట్లాడుతూ ఇసుక వలన కొవ్వూరు నుంచి తాళ్లపూడి వరకు ఇసుక లారీలు వలన ఇబ్బందులు పడుతున్నామని , వాటి వల్ల యాక్సిడెంట్లు అయ్యే అవకాశం ఉందని గ్రామ ప్రజలు తెలియజేశారు ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఇసుక ర్యాంపులు వార్కి సమాచారం ఇస్తాము అని అన్నారు. మరొక సమస్య ఏమిటనకు చిడిపి గ్రామము నుండి తాళ్లపూడి వెళ్లే మార్గంలో ఉన్న మలుపులో కూడా ఆర్&బి రోడ్ ఒక ప్రక్కకు ఒరిగిపోయి ఉండటం వలన యాక్సిడెంట్లు ఎక్కువగా జరుగుచున్నవి అని ప్రజలు వివరించక ఈ సమస్యపై కూడా ఆర్ అండ్ బి అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపుతామని అని అన్నారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు రూరల్ ఎస్సై కే శ్రీహరి , కానిస్టేబుల్స్ , గ్రామ సర్పంచ్ పాలడుగుల లక్ష్మణ్ రావు, వార్డు మెంబర్స్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## CC రోడ్స్ ప్రారంభం



**కొవ్వూరు :** కొవ్వూరు టౌన్ లో 15 వ ఆర్థిక సంఘంలో మంజూరైన రూ. 29 లక్షల నిధులతో గౌతమినగర్ లో నిర్మించిన జజ రోడ్ ను మరియు ఔరంగాబాద్ లో బాబు జగ్జీవన్ రామ్ గారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించి అనతరం జనరల్ ఫండ్స్ తో రూ. 6 లక్షల నిధులతో నిర్మించిన జజ రోడ్స్ ప్రారంభించిన కొవ్వూరు నియోజకవర్గం శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వర రావు గారు. ఈ కార్యక్రమంలో టూమెన్ కమిటీ మెంబర్ కంఠమణి రామకృష్ణ గారు, చైర్పర్సన్ భావన రత్నకుమారి గారు, పీక్కి నాగేంద్ర గారు, మద్దిపట్ల శివరామ కృష్ణ గారు, సూరపని చిన్ని గారు, సూర్యదేవర రంజిత్ గారు, వేమగిరి వెంకటరావు గారు, పాక జయరాం గారు, కండెల్లి రామారావు గారు, అక్షయ పాత్ర శ్రీనివాస్ గారు, రవీంద్ర గారు, పెనుమాక జయరాజు గారు, బీవీ ముత్యాల రావు గారు, బత్తి నాగరాజు గారు, బొబ్బిలి పేర్రాజు గారు, బీజేపీ రత్నసాయి గారు, కొప్పాక జవహర్ గారు, వేల్పూరు శ్రీనివాస్ గారు తదితర చీణూ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## డా జొన్నకూటి కి ఉగాది పురస్కారం

**తాళ్లపూడి విశాఖ సమాచారం :ప్రతినిధి (శివకృష్ణ) :** కవిగా, రచయితగా, జర్నలిస్ట్ గా, ప్రచురణ కర్తగా, ఉపాధ్యాయునిగా బహుముఖ ప్రతిభ తో రాణిస్తున్న పైడిమెట్ట కు చెందిన డా జొన్నకూటి ప్రమోద్ కుమార్ విశ్వ జనని ఉగాది పురస్కారం అందుకోనున్నారు. పల్నాడు జిల్లాకు చెందిన సాహితీ సంస్కృతి కళా వేదిక విశ్వ జనని ఫౌండేషన్ అధ్యక్షులు బ్రహ్మానందం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 న విజయవాడ లో జరిగే ఉగాది వేడుకలలో ప్రమోద్ ఈ పురస్కారం అందుకోనున్నారు.

## ఘనంగా జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం



**తాళ్లపూడి మండలం: విశాఖ సమాచారం: ప్రతినిధి (శివ కృష్ణ )** అన్నదేవరపేట గ్రామం లో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని చెవ్వూరి బంగార్రాజు గారు ఆధ్వర్యంలో, ముఖ్య అతిధి ¯జ రామారావు గారు, ఈ కార్యక్రమం లో వెలుగుబంటి బాలకృష్ణ, సిద్దా రామకృష్ణ, ఆటపాకాల సోమశేఖర్, పూలపల్లి బాలకృష్ణ , గ్రామ కార్యాకర్తలు, జనసైనికులు, వీర మహిళలు, పార్టీ అభిమానులు గ్రామస్తులు పాల్గొన్నారు

## పవన్ కళ్యాణ్ మార్గం నిర్దేశంలో జన సైనికులు పార్టీ కోసం శ్రమించాలి!

**నియోజకవర్గ ఇన్చార్జ్. దొడ్డి గర్ల.**

**గోపాలపురం (విశాఖ సమాచారం):** పవన్ కళ్యాణ్ మార్గ నిర్దేశంలో క్రమశిక్షణ కలిగిన సైనికుల పార్టీ కోసం శ్రమించాలి అని గోపాలపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ దొడ్డి గర్ల .సువర్ణ రాజు పిలుపునిచ్చారు. శనివారం.జనసేన పార్టీ కార్యాలయం వద్ద మండల జనసేన పార్టీ అధ్యక్షులు పోల్నాటి. రాజేంద్ర ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరణ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా సువర్ణ రాజు మాట్లాడుతూ.జనసేన పార్టీ ప్రభంజనం 11 ఏళ్లు పూర్తి చేసుకుని 12 వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా, గోపాలపురం నియోజకవర్గ జనసైనికులకు, వీరమహిళలకు,పవన్ కళ్యాణ్ అభిమానులకుశుభాకాంక్షలు తెలిపారు.పవన్ కళ్యాణ్ ఆశయాల సాధనే ధ్యేయంగా ప్రతి జనసైనికుడు కదలాలి. సమాజ మార్పు కోసం ఆయన పడుతున్న తపనను ప్రజల్లోకి తీసుకెళ్లాలి.సభ్యత్వ నమోదు పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి. ప్రతి గ్రామంలో, ప్రతి ఇంటికి వెళ్లి జనసేన సిద్ధాంతాలను వివరించి సభ్యత్వాలు చేయించాలి. పవన్ కళ్యాణ్ మార్గనిర్దేశంలో క్రమశిక్షణ కలిగిన సైనికుల్లా పార్టీ కోసం శ్రమించాలి.ప్రశ్నించే గొంతుకగా మొదలైన జనసేన, నేడు మార్పుకు చిరునామాగా మారింది. ఈ ప్రయాణంలో ప్రతి జనసైనికుడు భాగస్వామి కావాలి,సమాజ మార్పు,రాబోయే రోజుల్లో పార్టీని క్షేత్రస్థాయిలో శక్తివంతం చేయడమే ప్రధాన లక్ష్యం. ప్రతి గ్రామంలో సభ్యత్వ నమోదు ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన వేగవంతం చేయాలి. జనసైనికులు ఇంటింటికీ వెళ్లి పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. పవన్ కళ్యాణ్.నాయకత్వ స్ఫూర్తి, పారదర్శకమైన,అవినీతి రహిత రాజకీయ ప్రస్థానానికి అండగా నిలవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

"ప్రశ్నించే తత్వంతో పుట్టిన జనసేన, నేడు ప్రజా పక్షాన నిలబడి పోరాడుతోంది. పవన్ ఆశయాలను నిజం చేసేందుకు జనసైనికులు నడుం బిగించాలి." గోపాలపురం మండలం జగన్నాధపురం గ్రామానికి చెందిన పేరు బోయిన గోపి జనసేన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు . ఈ కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షులు పోసిన గణపతి, మద్దాల కాశీ విశ్వనాథ సనారి పోతిరెడ్డి పెదబాబు,.గంట్రోతు. ఉమామహేశ్వరరావు, ప్రగడ రాంబాబు, వీర మహిళ శాంతి,.నరేంద్ర,మల్లేశ్వరరావు, స్వామి, బాలు, సూర్య భగవాన్,.కోడి సత్యనారాయణ, పసుపులేటి వరప్రసాద్, ఆకుల నాని, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టా మంజూరు చేయాలి



**సాలూరు విశాఖ సమాచారం:** పాచిపెంట మండలం మోదుగ పంచాయితీ పరిధిలో ఉన్న గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు తెలిపారు. బుర్ర మామిడి బంగార గుడ్డి కాట్రగడ్డ బొడ్డపాడు గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు లేనందున ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు. ప్రభుత్వ పథకాలు గిరిజన రైతులకు అందడం లేదని అన్నారు గిరిజనులు సంక్షేమ పథకాలకు దూరము అవుతున్నారని అన్నారు గ్రీన్ ఫీల్డ్ సిక్స్ లైన్ రహదారి నిర్మాణము చేయడము వలన రైతులు భూములు కోల్పోయారని వారికి నష్టపరహారం వెంటనే అందజేయాలని అన్నారు. అటవీ హక్కులు చట్టం ద్వారా గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు అటవీ భూములకు పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం నాయకులు కోరుతున్నారా గిరిజన శాఖ మంత్రి జి సంధ్యారాణి స్పందించి న్యాయం చేయాలని గిరిజనులు కోరుతున్నారు

## ధర్మసాగరంలో ఘనంగా 'అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్'



- రైతుల ఖాతాల్లోకి నగదు జమ

**నర్సీపట్నం (విశాఖ సమాచారం):-** మండలం లోని ధర్మసాగరంలో 'అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్' కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి రూ. 20,000 చొప్పున ఆర్థిక సాయం అందించే ఈ పథకం మూడవ విడత నిధుల పంపిణీని స్థానికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్ చింతకాయల రాజేష్ ముఖ్య అతిథిగా హాజరై తన చేతుల మీదుగా రైతులకు లబ్ధిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసమే ప్రభుత్వం ఈ పథకాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని, వ్యవసాయ పెట్టుబడికి ఈ నగదు రైతాంగానికి ఎంతో ఆసరాగా నిలుస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఓ రామారావు, జడ్పీటీసీ రమణమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, శ్రీ రంగస్వామి, నర్సీపట్నం మండలం టీడీపీ ప్రెసిడెంట్ అప్పలనాయుడు, వ్యవసాయ అధికారులు మరియు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## పవన్ పర్ఫార్మెన్స్‌కి బద్దలైపోయిద్ది



పవన్ కళ్యాణ్ హీరోగా శ్రీలీల హీరోయిన్‌గా రూపొందిన ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా విడుదలకు రెడీ అవుతోంది. ఈ సినిమా నుంచి ఇప్పటికే వచ్చిన పాటలు మంచి స్పందన దక్కించుకున్నాయి. తాజాగా మరో పాటను సినిమా నుంచి విడుదల చేయడం ద్వారా అంచనాలు మరింత పెంచే ప్రయత్నం చేశారు. కాలరే ఎత్తరా.. అంటూ సాగే పాటలో పవన్ కళ్యాణ్‌తో కలిసి రాశి ఖన్నా ఆడి పాడింది. ఈ పాట విడుదల కార్యక్రమం లాంచనంగా జరిగింది. చిత్ర యూనిట్ సభ్యులతో పాటు సాంకేతిక నిపుణులు, ఇంకా ఇండస్ట్రీకి చెందిన మరికొందరు, మీడియా ప్రముఖులు పలువురు హాజరు అయ్యారు. ఈ పాట విడుదల కార్యక్రమంలో దర్శకుడు హరీష్ శంకర్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ ఊగి పోయేలా చేశాడు. పవన్ నుంచి ఏం ఆశిస్తున్నారో అదే ఈ సినిమాలో చూపించబోతున్నట్లుగా మరోసారి బల్ల గుద్దినట్లుగా చెప్పుకొచ్చాడు. పవన్ కళ్యాణ్ గారితో సినిమా... దర్శకుడు హరీష్ శంకర్ మాట్లాడుతూ... పవన్ కళ్యాణ్ గారితో సినిమా చేసే అవకాశం కోసం ఎంతో మంది ఎదురు చూస్తూ ఉంటే అది నాకు దక్కడం సంతోషంగా ఉంది. ఆయనతో సినిమా అనగానే హీరోయిన్ రాశి ఖన్నా కనీసం కథ కూడా వినకుండా చేస్తాను అంటూ ఓకే చెప్పింది. కథ కూడా వినకుండానే ఓకే చెప్పిన రాశి ఖన్నా గారికి కృతజ్ఞతలు. ఈ పాటలో రాశి ఖన్నా మంచి డాన్స్ తో అదరగొట్టారు. పవన్ కళ్యాణ్ గారితో ఆమె చేసిన డాన్స్ తప్పకుండా ప్రేక్షకులను మెప్పిస్తుందనే విశ్వాసంను వ్యక్తం చేశాడు. ఈ పాట కోసం ఏకంగా 1500 మంది నుంచి 2000 మందిని వినియోగించి చిత్రీకరించడం జరిగింది. పవన్ కళ్యాణ్ గారు ఈ పాటలో వేసిన స్టెప్స్ కి ఫ్యాన్స్ నుంచి మాత్రమే కాకుండా అన్ని వర్గాల నుంచి కూడా పాజిటివ్ రెస్పాన్స్ రాబోతుంది. తప్పకుండా ఫ్యాన్స్ కి ఈ పాట మంచి కిక్ ఇచ్చే పాట అవుతుందని ఆయన చెప్పుకొచ్చాడు. కళ్యాణ్ గారు ఈ పాటను ప్రాణం పెట్టి చేశారు. దేవి శ్రీ ప్రసాద్ మరోసారి చక్కని సంగీతాన్ని అందించడం ద్వారా ఫ్యాన్స్‌కి ఒక మంచి అనుభూతిని కల్పించబోతున్నారు. ఈసారి పవన్ కళ్యాణ్ గారి పర్ఫార్మెన్స్ బద్దలైపోయిద్ది అని నేను మొదటి నుంచి చెబుతూనే ఉన్నాను. ఎందుకంటే సెకండ్ హ్యాఫ్ లో ఆయన చేసే ఇంటెన్స్ సీన్స్ ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేస్తాయి. మైత్రి మూవీ మేకర్స్ వారు ఎక్కడ కూడా రాజీ పడకుండా సినిమాను భారీ ఎత్తున ఖర్చు చేసి నిర్మించారు. ఈ పాట కోసం కూడా భారీ ఎత్తున ఖర్చు చేశారు. ఇలాంటి నిర్మాతలు దొరకడం నా పూర్వజన్మ సుకృతం అన్నాడు. పవన్ కళ్యాణ్ గారు ప్రతి సందర్భంలోనూ మోటివేట్ చేస్తూ ఉండేవారు. ఆయన సెట్ లో ఉన్నంత సమయం చాలా ఎనర్జిటిక్ గా ఉండేది. అంత మందితో డాన్స్ చేయాలా అని మొదట సరదాగా అడిగారు. ఆ తర్వాత అన్నట్లుగా చేశారని హరీష్ శంకర్ చెప్పుకొచ్చాడు. పవన్ కళ్యాణ్ గబ్బర్ సింగ్ రేంజ్‌లో... పవన్ కళ్యాణ్, హరీష్ శంకర్ కాంబోలో గతంలో వచ్చిన గబ్బర్ సింగ్ భారీ విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. ఆ సినిమా సూపర్ హిట్ నేపథ్యంలో ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. మరోసారి గబ్బర్ సింగ్ రేంజ్ హిట్ లోడింగ్ కాబోతుంది అంటూ మొదటి నుంచి అభిమానులు చాలా బలంగా నమ్ముతున్నారు. పవన్ కళ్యాణ్ కి గుడ్ టైం నడుస్తోంది. ఆయన కచ్చితంగా ఈ సినిమాతో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకోవడం మాత్రమే కాకుండా, ఓజీ సినిమా తరహాలో మరోసారి ఫ్యాన్స్ కి ఫుల్ మీల్స్ వంటి సినిమాను ఇవ్వబోతున్నారనే విశ్వాసం వ్యక్తం అవుతోంది. బిజీగా ఉన్న పవన్ కళ్యాణ్ ప్రమోషన్స్ కి హాజరు కాలేక పోతున్నారు. అయితే ప్రీ రిలీజ్ ఈవెంట్ కి హాజరు అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. ట్రైలర్ విడుదల కోసం అభిమానులతో పాటు అంతా కూడా చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

## టీవీలోనూ రికార్డు TRP సాధించిన సినిమాలు

రాజమౌళి తర్వాత వరుస విజయాలతో దూసుకుపోతున్న దర్శకుడు ఎవరు అంటే వెంటనే గుర్తొచ్చే పేరు అనిల్ రావిపూడి. ఈ క్రమంలో అనిల్ రావిపూడి క్రియేట్ చేసిన మరో రికార్డ్ ప్రస్తుతం తెగ వైరల్ అవుతుంది. ఆయన దర్శకత్వం వహించిన సినిమాల టెలివిజన్ ౹౼ా రేటింగ్స్‌కి సంబంధించిన వివరాలు ప్రస్తుతం తెగ వైరల్ అవుతున్నాయి. ఈ సంఖ్యలు చూస్తే అనిల్ రావిపూడి సినిమాలు థియేటర్లలో మాత్రమే కాకుండా టెలివిజన్‌లో కూడా ఎంత పెద్ద విజయం సాధించాయో స్పష్టంగా తెలుస్తుంది.




అనిల్ రావిపూడి టాలీవుడ్‌లో కామెడీ, ఫ్యామిలీ ఎంటర్టైనర్ సినిమాలకు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు. ఆయన తెరకెక్కించిన చాలా సినిమాలు ప్రేక్షకులను నవ్విస్తూ, కుటుంబంతో కలిసి చూడదగ్గ వినోదాన్ని అందిస్తాయి. అందుకే ఆయన సినిమాలు థియేటర్‌లో హిట్ అవడమే కాకుండా టీవీలో ప్రసారం అయినప్పుడు కూడా భారీ ౹౼ా రేటింగ్స్ సాధిస్తుంటాయి.

ఈ సంఖ్యలు చూస్తే అనిల్ రావిపూడి సినిమాలు ప్రతి వయస్సు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయని అర్థమవుతుంది. ఆయన సినిమాల్లో ఉండే సరదా కామెడీ, కుటుంబ భావోద్వేగాలు, సింపుల్ కథలు ప్రేక్షకులను దగ్గర చేస్తాయి. అందుకే ఆయన సినిమాలు మళ్లీ మళ్లీ చూసేలా ఉంటాయి. అనిల్ రావిపూడి సినిమాల మరో ప్రత్యేకత ఏమిటంటే అవి థియేటర్‌లో చూసినా, ఇంట్లో టీవీలో చూసినా ఒకే రకమైన వినోదాన్ని అందిస్తాయి. కుటుంబ సభ్యులంతా కలిసి చూసే సినిమాలుగా ఆయన చిత్రాలు పేరు సంపాదించాయి. అందుకే టీవీలో ప్రసారం అయినప్పుడు కూడా ప్రేక్షకులు ఆసక్తిగా చూస్తుంటారు. చాలా తక్కువ మంది దర్శకులు మాత్రమే తమ సినిమాలను ప్రతి ప్లాట్‌ఫారమ్‌లో విజయవంతం చేయగలుగుతారు. అనిల్ రావిపూడి అలాంటి అరుదైన దర్శకుల్లో ఒకరు. ఆయన సినిమాలు ఎక్కడ విడుదలైనా ఒక ఈవెంట్‌లా మారిపోతాయి.

## రణ్‌వీర్ ముగ్గురు సౌత్ డైరెక్టర్లని పక్కన పెట్టాడా?



బాలీవుడ్ క్రేజీ స్టార్ రణ్‌వీర్ సింగ్ ప్రస్తుతం దేశ వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారాడు. తను నటించిన స్పై యాక్షన్ ఎంటర్‌టైనర్ -ధురంధర్- వరల్డ్ బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచి రికార్డు స్థాయి వసూళ్లని రాబట్టింది. గత కొంత కాలంగా వరుస ఫ్లాపుల్లో ఉన్న రణ్‌వీర్ సింగ్‌ని పతాక స్థాయిలో నిలబెట్టి పాన్ ఇండియా స్టార్‌ని చేసింది. ఆదిత్యధర్ డైరెక్ట్ చేసిన ఈ మూవీ గత ఏడాది డిసెంబర్‌లో విడుదలై సంచలనం సృష్టించడంతో రణ్‌వీర్ సింగ్ మళ్లీ ట్రాక్‌లోకి వచ్చేశాడు. ఈ మూవీతో దేశ వ్యాప్తంగా హాట్ ఫేవరేట్ హీరోగా మారిపోయాడు. ఈ నేపథ్యంలోనే మార్చి 19న రణ్‌వీర్ నటించిన -ధురంధర్- సీక్వెల్ వచ్చేస్తోంది. ఇప్పటికే పెయిడ్ ప్రీమియ అడ్వాన్స్ బుకింగ్స్‌తో రికార్డుల మోత మొదలు పెట్టిన -ధురంధర్ 2- సరికొత్త రికార్డుల దిశగా పయనిస్తోంది. ఈసారి ప్రారంభ వసూళ్లు భారీగా ఉంటాయని బన్నీ -పుష్ప 2- రికార్డ్ ను తిరగరాయడం ఖాయమని బాలీవుడ్ ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. -ధురంధర్ 2- ఫీవర్ చూస్తుంటే దానికి మించి రికార్డుల్ని తిరగరాసేలా కనిపిస్తోంది. ఇదిలా ఉంటే వరుస ఫ్లాపులు, డిజాస్టర్లతో సతమతమైన టైమ్‌లో రణ్‌వీర్ సింగ్ బ్లాక్ బస్టర్ హిట్ కోసం సౌత్ డైరెక్టర్ల వైపు చూశాడు. తమిళ, తెలుగు భాషల్లో చియాన్ విక్రమ్ కథానాయకుడిగా శంకర్ తెరకెక్కించిన భారీ యాక్షన్ మూవీ -అపరిచితుడు-. ఈ మూవీని బాలీవుడ్‌లో రణ్‌వీర్ సింగ్ హీరోగా రీమేక్ చేయాలని ప్లాన్ చేశారు. జయంతి లాల్ గడ ప్రొడ్యూసర్. అయితే లీగల్ చిక్కులు, ఇండియన్ 2 వివాదం కారణంగా శంకర్ సౌత్ వరకే లాక్ అయిపోయాడు. -అపరిచితుడు- రీమేక్ చేయలేని పరిస్థితి. దీంతో రణ్‌వీర్ సింగ్ ఇది అయ్యే పని కాదని శంకర్‌తో సినిమా ప్రయత్నాలని విరమించికుని బాలీవుడ్ లో తన ప్రయత్నాలు తాను చేసుకోవడం మొదలు పెట్టాడు. ఆదిత్యధర్ ఎదురవ్వడంతో ఇద్దరి కాంబినేషన్‌లో రా అండ్ రస్టిక్ అంశాల నేపథ్యంలో -ధురంధర్- తెరపైకొచ్చింది. సైలెంట్‌గా విడుదలైన ఈ సినిమా ఏ స్థాయి సంచలనాలు సృష్టించిందో అందరికి తెలిసిందే. ఇదే సమయంలో టాలీవుడ్ మాస్ మసాలా యాక్షన్ సినిమాల డైరెక్టర్ బోయపాటి శ్రీను హీరో రణ్‌వీర్ సింగ్‌ని కలిసి భారీ యాక్షన్ డ్రామాకు ప్లాన్ చేశాడు. కానీ బోయపాటి చెప్పిన స్టోరీ రణ్‌వీర్‌కు నచ్చకపోవడంతో ఆ ప్రాజెక్ట్ పట్టాలెక్కకుండానే ఆగిపోయింది. -ధురంధర్- సీక్వెల్ లైన్‌లో ఉండటం, ఈ మూవీతో ఆశించిన దానికి మించి పాపులారిటీ రావడంతో రణ్‌వీర్ సింగ్ ..బోయపాటిని పక్కన పెట్టారట. దీనికి ముందు మరో సౌత్ డైరెక్టర్‌ని కూడా రణ్ వీర్ పక్కన పెట్టినట్టుగా తెలిసింది. మలయాళంలో కాన్సెప్ట్ ఓరియెంటెడ్ సినిమాలతో నటుడిగా, -మిన్నల్ మురళి- వంటి సూపర్ హీరో మూవీతో దర్శకుడిగా మంచి పేరు తెచ్చుకున్న బసిల్ జోసెఫ్ బాలీవుడ్‌లో సినిమా చేయాలనుకున్నాడట. అది కూడా సూపర్ హీరో స్టోరీతో. ఇందుకు రణ్‌వీర్ అయితే కరెక్ట్ అని భావించి తనని కలిసి శక్తిమాన్ స్టోరీ వినిపించాడని అప్పట్లో ప్రచారం జరిగింది. అయితే బసిల్‌కు రణ్‌వీర్‌కు మధ్య ఏర్పడిన క్రియేటివ్ డిఫరెన్సెస్ కారణంగానే ఈ ప్రాజెక్ట్ ముందుకు వెళ్లలేదని, దాంతో బసిల్ జోసెఫ్ ఫ్రెష్ స్టోరీని రెడీ చేసుకుని ఇప్పుడు బన్నీ వెంటపడుతున్నాడని వార్తలు వినిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన శిరీష్ వివాహ వేడుకలో బసిల్ జోసెఫ్ కనిపించడంతో ఆ వార్తలకు మరింత బలం చేకూరింది.

## మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- **అనకాపల్లిలో మహిళా పారిశ్రామిక పార్కుకు శంకుస్థాపన**
- **జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయ క్రిష్ణన్**



**అనకాపల్లి, (విశాఖ సమాచారం బ్యూరో):-** పరిశ్రమల ఏర్పాటులో మహిళలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, మహిళలు స్వయం ఉపాధి రంగంలో రాణించి, ఆర్థిక సాధికారత సాధించేందుకు చిన్న పరిశ్రమల ఏర్పాటుకు దోహదపడే శిక్షణ, ఇతర సహాయ సహకారాలు అందించడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయ క్రిష్ణన్ పేర్కొన్నారు. అనకాపల్లి మండలం, కోడూరులోని ఏపీఐఐసీ షెజ్లో ఎంఎస్ఎంఈ పార్కు సమీపంలో ఏఎల్ఏపీకి సుమారు 31.77 ఎకరాలలో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో మౌలిక వసతులు కల్పిండంతో, ఎలిప్ మహిళా శక్తి భవన్ పరిపాలన భవనం, శిక్షణ కార్యాలయాన్ని నిర్మించేందుకు శనివారం ఉదయం నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్లా సురేంద్ర, అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద్ సత్యనారాయణ, ఎలిప్ సంస్థ ప్రెసిడెంట్ రమాదేవి లతో కలసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా కేంద్రంలో మహిళా సాధికారత దిశగా కీలక అడుగు పడిందని, సుమారు 31.77 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేయనున్న మహిళా పారిశ్రామిక పార్కుకు నేడు ఘనంగా శంకుస్థాపన చేసుకోవడం జరిగిందన్నారు. వచ్చే ఏడాది నాటికి రాష్ట్రంలో 5 లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేయాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పమని, అందుకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని కలెక్టర్ శ్రీమతి విజయ క్రిష్ణన్ స్పష్టం చేశారు. మహిళలు తమలో ఉన్న ఆలోచనలను వ్యాపార రూపంలోకి మార్చుకోవాలని, అందుకు ప్రభుత్వం మరియు ఎలిప్ వంటి సంస్థలు పూర్తి సహకారం అందిస్తాయని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. మహిళా పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దడంలో ఎలిప్ సంస్థ అందిస్తున్న శిక్షణ మరియు మార్గదర్శకత్వం ఎంతో కీలకమని కలెక్టర్ కొనియాడారు.

**మహిళా పారిశ్రామికవేత్తలకు అండగా ప్రభుత్వం**

స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళలకు ఇచ్చే ప్రాధాన్యతకు ఈ పారిశ్రామిక పార్కు ఒక నిదర్శనమని అన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు సబ్సిడీతో కూడిన రుణాలు మరియు అన్ని రంగాల్లో వారికి అవసరమైన తోడ్పాటును ఈ పార్కు ద్వారా అందించనున్నారని తెలిపారు. ఇందులో భాగంగా మహిళా పారిశ్రామికవేత్తల కోసం భారీ సబ్సిడీని ముఖ్యమంత్రి ప్రకటించారని వెల్లడించారు. జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరగడం శుభపరిణామమని, మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి చేయడం ద్వారా వేలాది మంది మహిళలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అందరూ సమిష్టిగా కృషి చేసి నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవాలని పిలుపునిచ్చారు. అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద్ సత్యనారాయణ మాట్లాడుతూ మహిళలు కేవలం గృహిణులుగానే పరిమితం కాకుండా, స్వశక్తితో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, మహిళా పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దడంలో ఎలిప్ సంస్థ అందిస్తున్న శిక్షణ మరియు తోడ్పాటును అభినందించారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందని, దీనిని మహిళలు అందిపుచ్చు కోవాలని కోరారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్లా సురేంద్ర, మాట్లాడుతూ మహిళా సాధికారతకు - సామాజిక అభివృద్ధి మరియు భవిష్యత్తుకి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. మహిళలు కేవలం గృహిణులుగానే కాకుండా, విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆకాంక్షిస్తోందని తెలిపారు. ఈ భూమి పూజ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎలిప్ సంస్థ ప్రెసిడెంట్ రమాదేవి, మరియు పెద్ద సంఖ్యలో మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## కొత్త అమావాస్య, జాతర సందర్భంగా ఆలయ ఆవరణంలో 5000 మందికి భారీ అన్న సమారాధన



**అనకాపల్లి (విశాఖ సమాచారం):-** శ్రీ నూకంబిక అమ్మవారి దేవస్థానం సహకారంతో శ్రీ నూకంబిక అమ్మవారి మాలధారణ సంఘం వ్యవస్థాపకులు పొలిమేర శ్రీను ఆధ్వర్యంలో శనివారం కొత్త అమావాస్య, జాతర సందర్భంగా ఆలయ ఆవరణంలో 5000 మందికి భారీ అన్న సమారాధను దేవస్థానం చైర్మన్ పీలా నాగ శ్రీను ( గొల్ల బాబు) ప్రారంభించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మాజీ మంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ,ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవిందు సత్యనారాయణ ఘటాలు ఊరేగింపులు ప్రారంభించారు. ఊరేగింపులో, నియోజవర్గ ఇన్చార్జ్ భీమర శెట్టి రామ్కి, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, డిసి ఎన్ సుజాత, అమ్మవారి ఘటాలు, శోలాలు, అమ్మవారి డాన్సులు, పులి వేషాలు, దాండియా డాన్స్, తంబోలా డ్రమ్స్, పలు సంస్కృత కార్యక్రమాలు, అమ్మవారు అలంకరణలతో నృత్యాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అమ్మవారి నామస్మరంతో ఊరేగింపు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ యాళ్ళశ్రీధర్, బిఎస్ఎన్కే జోగులాయుడు, సంఘ సేవకుడు కాంద్రేగుల శ్రీరామ్,ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్,దాడి రవికుమార్,పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు,కాంద్రేగుల రాజారావు ,మజ్జి జానకి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్,వద్దాది మంగ,కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు,యర్రవరపు సంతోషి, కుమారినాగేష్,కూటమి పార్టీ నాయకులు,మాలధారణ భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## కష్టం ఏదైనా పేదలకు అండగా సీఎం సహాయనిధి

**బాధితునికి చెక్కు పంపిణీ చేసిన ఎమ్మెల్యే రాజు..**



**బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):** మండలంలోని సీతయ్య పేట గ్రామానికి చెందిన అల్లు శ్రీనివాస్ గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ వివిధ హాస్పటల్లో చికిత్స తీసుకుంటూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ ఆయన ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని స్థానిక ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ ఎస్ రాజు సహకారంతో గ్రామ సర్పంచ్ వజ్రపు ఇందిరా శ్రీనివాస్ ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా శనివారం రెండు లక్షల 25 వేల 93 రూపాయల (2,25, 093) రూపాయల చెక్కును బాధితుడికి స్థానిక సర్పంచ్ ఇందిరా శ్రీనివాస్ చేతుల మీదుగా ఎమ్మెల్యే రాజు అందజేయడం జరిగింది. గ్రామాభివృద్ధి తో పాటు గ్రామ ప్రజల సంక్షేమానికి విశేషంగా కృషి చేస్తున్న సర్పంచ్ ఇందిరా శ్రీనివాస్ ను ఎమ్మెల్యే రాజు అభినందించారు కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు తమరాన సింహాద్రి అప్పన్న, విశాఖ డైరీ డైరెక్టర్ సత్యనారాయణ, తురకలపూడి పిఎసిఎస్ అధ్యక్షులు కోట సత్యనారాయణ, మాజీ సర్పంచ్ మలిరెడ్డి బాబ్జి, తురకలపూడి టిడిపి గ్రామ అధ్యక్షులు కోరుకొండ రవి తో పాటు పలువురు పాల్గొన్నారు.

## పెదపూడి నూకాంబిక అమ్మవారి ఆలయ వార్షిక ఉత్సవ కమిటీ ఏర్పాటు..




**బుచ్చయ్యపేట, (విశాఖసమాచారమ్):** మండలంలోని ప్రసిద్ధిగాంచిన పెదపూడి శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయ వార్షిక ఉత్సవానికి ఈ నెల 9 వ తేదీ నుండి 18వ తేదీ వరకు జరుపుకొనుటకు గాను జిల్లా దేవాదాయ శాఖ అధికారిని ఎన్. సుజాత ఆదేశాలతో 11 మంది సభ్యులతో కూడిన ఆలయ వార్షిక ఉత్సవ కమిటీ ఏర్పాటు జరిగినట్లు జిల్లా దేవాలయ శాఖ అధికారిని సర్కులర్ జారీ చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు సెక్షన్ 18 లో సూచించిన అర్హతలను కలిగి 1987 రూల్ ప్రకారం సెక్షన్ 19 లో 30వ చట్టం అనుకరించి వార్షికోత్సవాలు విజయవంతంగా జరుపుకొనుటకు అనుమతులు ఇచ్చినట్లు దేవాదాయ శాఖ అధికారులు ఇచ్చిన నోటీసు నందు పేర్కొనడం జరిగింది. ఈ మేరకు ఉత్సవ కమిటీ సభ్యులు గోకివాడ సత్తిబాబు (మహేశ్) స్థానిక ఎస్ ఐ భాస్కరరావు కు దేవదాయ శాఖ అధికారులు ఇచ్చిన ఆర్డర్ కాపీని అందజేసి వార్షిక ఉత్సవాలకు తగిన బందోబస్తు కల్పించాలని కోరారు.

## రావికమతం మండలానికి 3,లక్షల 87,500 ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు



**రావికమతం(విశాఖ సమాచారం):-** రావికమతం మండలంలో పలు గ్రామాలకు చెందిన నిరుపేదలకు వైద్య సహాయం నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ₹3,87,500 రూపాయలు చోడవరం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే రాజు చేతుల మీదుగా స్వయంగా శనివారం అందజేసినట్లు టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కోమటి శంకర్రావు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరుపేదలకు,అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులకు ఆర్థికంగా సహాయ పడాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి, ప్రజల ఆరోగ్య పరిరక్షణ కొరకు ఈ సహాయం అందజేయడం జరిగిందని తెలిపారు. వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ సహాయం ఎంతో ఊరటను కలిగిస్తోందని అన్నారు. మండలంలో చినపాచల గ్రామానికి చెందిన కె.జువ్వలమ్మ 1,25,000/-, కె.రాము కు 37,500/-కన్నంపేట గ్రామానికి చెందిన సి హెచ్. శివ 50,000/-కొత్తకోట గ్రామానికి చెందిన జి రుక్మిణి 25,000/-పీ.పోన్నవోలు గ్రామానికి చెందిన కె నాగేష్ 25,000/-జెడ్ బేన్నవరం గ్రామానికి చెందిన ఎమ్ రాజ్యలక్ష్మి 1,25,000/- రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరు కావడంతో వాటిని ఎమ్మెల్యే రాజు బాధితులకు అందజేశారు. భవిష్యత్తులో కూడా అవసరమైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రాజాన కొండ నాయుడు,మండల పార్టీ అధ్యక్షులు శంకరరావు, సీనియర్ నాయకులు గోవింద,సర్పంచ్ గోకివాడ రమణ,మాజీ సర్పంచ్ అర్జున,మాజీ ఎంపీటీసీ బంటు శ్రీను,యు.శ్రీను, నాగేశ్వరరావు,కోట సత్యనారాయణ,అంజి, కూటమి నాయకులు పలువురు పాల్గొన్నారు.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press
Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, vspnews4@gmail.com